# నిజామియన్ :: 2010-11

**********************************

## తెలుగు విభాగం - విషయసూచిక

**********************************


మమ్మల్ని చూసి నవ్వకండి ! మాతో కలిసి నవ్వండి - ఎం. వెంకటప్ప, ఎం.ఎస్.సి. జువాలజీ, ద్వితీయ సంవత్సరం

చిన్నారులతో నా చిరునవ్వు - మహీంద్ర, బి.ఎ. ద్వితీయసంవత్సరం

జీవిత మార్గదర్శి - ఎన్. శ్రీనివాసులు, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

యువతీ యువకులకు సందేశం - నీలాల శ్రీనివాసులు, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

'సామాన్య' ('బహు'తిక) శాస్త్రం - వి. సృజన్, ఎం.ఎస్.సి. (భౌతికశాస్త్రం) ఫైనల్

పిల్లలు మంచి మల్లెలు - ఏ. నర్సింహాచారి, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయ

కవితలు, జోక్స్ - ఏ. నర్సింహాచారి, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయ

ప్రేమేకాదు జీవితం - ఎన్. సత్యనారాయణచారి, ఎస్.ఎస్.సి. (కెమిస్ట్రీ) ప్రథమ సంవత్సరం

ఎవరు? నీవెవరు?? - మాచిడి సంతోష్‌గౌడ్ ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం

"జ్ఞానాన్వేషి" - యన్. సైదులు, బి.ఎ. (హెచ్.టి.పి.) ప్రథమసంవత్సరం

కవిత్వంలో కవి - వివిధ ప్రక్రియలు - యన్. సైదులు, బి.ఎ. (హెచ్.టి.పి.) ప్రథమసంవత్సరం

స్త్రీ శక్తి - రమావతు దస్రునాయక్ (సుమం) బి.ఎ. (ఆంగ్లసాహిత్యం) ద్వితీయ

ఓ మగువా! - ఇ. శ్రీనివాస్, బి.కాం. ద్వితీయసంవత్సరం

స్వామీజీ, వివేకులు కలలుగన్న భారతం - ఎ. శ్రీనాథరావ్, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

తీయనైన బాధ (కథ) - కస. రమేష్, బి.కాం. ద్వితీయ సంవత్సరం

తెలుగు భాషకు వందనం - ఎం. బాలశంకర్, బి.ఎస్.సి. (బి.జడ్.సి.) ద్వితీయ సంవత్సరం

నా కవిత - ఎల్. విజయ్ కుమార్, బి.ఎ. (ఇ.పి.పి.) ప్రథమ సంవత్సరం

గాలిలోని గానమా - సిహెచ్. కిరణ్ కుమార్, బి.కాం. ద్వితీయసంవత్సరం

చెలిమి - ఎ. శ్రీను (దరువు) , బి.ఎస్.సి. (ఎం.ఇ.సి.ఎస్.) ద్వితీయసంవత్సరం

సూక్తులు - సేకరణ : వి. సృజన్, ఎం.ఎస్.సి. (భౌతికశాస్త్రం) ద్వితీయసంవత్సరం

పోరాటం ముద్దు, బలిదానం వద్దు - ఆర్. సుచరిత, ఎం.ఎ. థియేటర్ ఆర్ట్స్ (ఫైనల్)

గురువు - వి. సృజన్, ఎం.ఎస్.సి. (ఫిజిక్స్) ఫైనల్

అమ్మా! నీకు వందనం - చిలుముల సతీష్, బి.కాం. ద్వితీయసంవత్సరం

ఓ నేస్తమా - డి. రమేష్, బి.కాం. ద్వితీయసంవత్సరం

అమ్మ ప్రేమ - అయ్యాళప్ప కె. ఎం.ఎస్.సి.(జువాలజి), చివరి సంవత్సరం

హొలారే ... హొలారే హొలారే - కె. తిరుపతి పటేల్, బి.ఎస్.సి. (ఎం.ఇ.సి.) ద్వితీయసంవత్సరం

ప్రకృతి - ఇ. దాస్ (రిషి), బి.ఎ. (ఇంగ్లీష్) ప్రథమ సంవత్సరం

మంచి విషయాలు - సేకరణ : ఇ. నరేష్, బి.ఎస్.సి. (బి.జడ్.సి.) ద్వితీయసంవత్సరం

మనిషి - మనస్సు - నీల రామస్వామి, ఎం.ఎస్.సి. (ఫిజిక్స్) ద్వితీయసంవత్సరం

| | |
|---|---|
| మై కాలేజ్ | - బి. శివ, బి.ఎస్.సి. (ఎం.సి.సి.) ద్వితీయసంవత్సరం |
| విషాదంతో ... కోయిల | - కొలనుపాక సురేష్, ఎం.ఎస్.సి. (ఆర్గానిక్ కెమిస్ట్రీ) ద్వితీయ |
| సామాజిక, సాంస్కృతిక రంగాలపై యువత ప్రభావం | - బొద్దు కిరణ్, బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం |
| అమ్మ | - జి. అశోక్, ఎం.ఎస్.సి. (జువాలజీ), ప్రథమసంవత్సరం |
| అమ్మ ప్రేమ | - పతకమూడి విజయశాంతి, ఎం.ఎ. తెలుగు, ద్వితీయ సంవత్సరం |
| స్నేహం | - పి. బాలమణి, ఎం.ఎ. ప్రథమసంవత్సరం |
| ఆనంద వేళ | - పి. సుదర్శన్, ఎం.ఎ. తెలుగు ద్వితీయసంవత్సరం |
| తామసి! నా ప్రేయసి | - బి. సైదులు, ఎం.ఎ. తెలుగు, ప్రథమ సంవత్సరం |
| మెరుపులాంటి నిజాం | - గుండు రాజు, బి.కాం. (రెగ్యులర్) |
| ఆమె | - వి. లక్ష్మీనారాయణ, ఎం.ఎ. తెలుగు ప్రథమ సంవత్సరం |
| ఉపాధ్యాయ వృత్తి | - కట్ట రంజిత్ కుమార్, ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం |
| తెలుగు భాషకు అభినందన అక్షరమాల | - కట్ట రంజిత్ కుమార్, ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం |
| గుర్రం జాషువా - గబ్బిలం ఖండకావ్య పరిశీలనం | - బేగరి మొగులయ్య, ఎం.ఎ. ప్రథమసంవత్సరం |
| ప్రేమతో... | - లక్ష్మన్న, ఎం.ఎస్.సి. (జువాలజీ) ద్వితీయ సంవత్సరం |
| యువతీ - యువకులు ఆలోచించండి | - నీలాల శ్రీనివాసు |
| గొప్పవారి గుర్చి గొప్పవారు చెప్పిన గొప్ప సూక్తులు | - పాతకోటి రాజు, ఎం.ఎ. తెలుగు, ప్రథమసంవత్సరం |
| అణగారిన వర్గాలు ఉద్యమించాలి | - కొప్పు రాజు, బి.ఎ. (పి.ఎస్.ఎం.) ద్వితీయసంవత్సరం |
| జై తెలంగాణ (గేయం) | - నర్రా రాజు, ఎం.ఎ. ప్రథమ సంవత్సరం |
| వెలుగుల తెలుగు | - బి. సైదులు (కళింగ), ఎం.ఎ. తెలుగు, ప్రథమ సంవత్సరం |
| తెలుగు భాషా స్వభావం | - జి. జంగయ్య, ఎం.ఎ. తెలుగు, ఫైనల్ |
| భారతంలో విజయ రహస్యం | - అట్టిం దత్తయ్య , ఎం.ఎ. తెలుగు, ద్వితీయ సంవత్సరం |
| నా చదువు - నా చావు | - బి. రాజన్న , ఎం.ఎ. ద్వితీయసంవత్సరం |
| ఆధునిక యుగ కవితా వైతాళికుడు - గురజాడ | - ఎం.గీత, జె.నాగమణి, జె.స్వాతి, ఎం.ఏ., తెలుగు ప్రథమ సం॥ |

* విజేతలదే ఈ ప్రపంచం. ఇదే సత్యం. అందుకే భయం వదలండి. విజేతలుగా నిలవండి.
* వేలమంది వందల ఏళ్లపాటు పని చేసే కన్నా - మనస్ఫూర్తిగా, నిజాయితీగా, శక్తిమంతంగా పని చేసే కొద్దిమంది యువతీయువకులు చాలు... ఈ ప్రపంచాన్ని మార్చేయడానికి!
* జీవితంలో నేర్చుకోవలసిన పాఠం ఒక్కటే - అన్యాయాలను, అక్రమాలను ధైర్యంగా ఎదుర్కోవడం. మనం ధైర్యంగా చెయ్యి విదిలించి ముందడుగేస్తే.... అన్ని కష్టాలూ చెదిరిన కోతుల్లా పారిపోతాయి.
* ధైర్యం, బలం, నిర్భయం.... ఇవే విజయానికి సోపానాలు.
* లక్ష్యం ఉన్నతంగా ఉండాలి. దానికోసమే కృషి చెయ్యాలి. "సముద్రాన్ని చూడండి.... అలలను కాదు."

- స్వామి వివేకానంద

# మమ్మల్ని చూసి నవ్వకండి! మాతో కలిసి నవ్వండి!!

సృష్టిలో చాలా గొప్పది జీవితం. కాని ఈ జీవితంలో అనేక ఒడుదొడుకులున్నాయి. విధి కాటేసిన జీవితాలు కొన్నైతే, విధి నిర్వహణలో తమ అంగాలను కోల్పోయినవారు మరికొందరు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం జనాభాలో ప్రతి పదిమందిలోను ఒక వికలాంగుడున్నాడు. అదేవిధంగా ప్రతి 10మంది వికలాంగులలో ఒక మానసిక వికలాంగుడు (బుద్ధిమాంద్యంగలవారు) ఉన్నాడు. సగటు 6% తీసుకుంటే జనాభా సర్వే ప్రకారం మన రాష్ట్రంలో 45లక్షల వికలాంగులు, మొత్తం జనాభాలో సుమారు 3% మానసిక వికలాంగులున్నారని అంచనా.

పెరిగిన ఈ నాగరిక సమాజంలో కాలంతో పోటీపడుతున్న ఈ సాంకేతిక ప్రపంచంలో ఇంకా వివక్షకు గురి అవుతున్న విషయాలు సామాన్య మానవున్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. అందులో ఒకటి కులము అయితే మరొకటి వికలాంగులపట్ల వివక్షతను ప్రదర్శించడం. సాటి మానవునిగా మానవత్వాన్ని ప్రదర్శించే సందర్భాలలో మానవత్వం మరచిపోయినవారిని ఈ నాగరిక సమాజంలో అక్కడక్కడా ఇంకా మనం గమనించటం మన దురదృష్టకరం. ఇందుకు నిదర్శనం ఈ క్రింది సంఘటనలే. బస్సులలో, రైల్వేలలో, బస్‌పాస్ కౌంటర్‌లలో ఇంకా వివిధ సందర్భాలలో వారికి సహాయం చేసేది మరచిపోయి వారికి కేటాయించిన రిజర్వేషన్ సీట్లల్లో దర్జాగా కూర్చుంటారు. (అందరు కాదు కొందరు మాత్రమే) కొందరు వాహనాలను చాలా వేగంగా నడుపుతుంటారు. కొన్నిసార్లు అంధులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురికావచ్చు. కాబట్టి వారికి సహాయం చేయకున్నా పర్వాలేదు. కాని హాని చేయకుండా వాహనం నెమ్మదిగా నడిపితే చాలు, వారికి సహాయపడినవారవుతారు.

అంగవైకల్యాన్ని ఎదిరించి ఎవరెస్టును అధిరోహించిన (టామ్ విట్టేకర్)వారున్నారు. మహా సముద్రాలను ఈదిన (తారనాథ్ షెనాయ్) వారున్నారు. తమ బాధలను గుర్తించి తమ కొరకు తామే పరికరాలను, పథకాలను, సేవా కార్యక్రమాలను నిర్వహించుకుని ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నతమైన ఉద్యోగాలను సాధించి విధిని ఎదిరించిన వారిని ఎంతో మందిని సమాజంలో చూస్తున్నాం. కావున వికలాంగులు కూడా మామూలు మనుషుల్లా బతకాలి. చదువు సంధ్యలు నేర్వాలి. జీవనోపాధిని సంపాదించుకోవాలి. వైకల్యం తాలూకు నిరాశ నిస్పృహలకు లోనుకాకుండ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి.

## వికలాంగులు - అవకాశాలు

ఒకరకంగా చెప్పాలంటే అంగవైకల్యంకలవారు అదృష్టవంతులని చెప్పవచ్చును. ఎందుకంటే ఆత్మస్థైర్యంతో అందుకోగలిగితే అద్భుత అవకాశాలెన్నో... వికలాంగుల చట్టం 1995 ప్రకారం.

అంగవైకల్యం ఉన్న ప్రతి చిన్నారీ 18 సంవత్సరాల వరకు ఉచిత విద్య అభ్యసించే అవకాశం కల్పించడం, ప్రత్యేక పాఠశాలల ద్వారా వృత్తి విద్యను ప్రోత్సహించడం, మామూలు పిల్లలతో కలిసిమెలిసి ఉండేందుకు పాఠశాలల్లో తగిన వాతావరణం కల్పించడం, నిరుద్యోగులైన వికలాంగులకు ఉద్యోగాలు కల్పించడం, ప్రభుత్వ, స్థానిక సంస్థల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించడం, ఉద్యోగంలో ఉన్న వికలాంగులకు ప్రోత్సాహకాలివ్వడం ప్రభుత్వ లక్ష్యం.

వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన "వికలాంగుల సంక్షేమశాఖ" ద్వారా ఈ క్రింది ఉపాధి అవకాశాలు కల్పించబడును.

**స్కాలర్‌షిప్‌లు / స్టయిఫండ్‌లు :** దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్నవారికి మాట్లాడే శక్తిలేని వారికి ఇతర శారీరక వైకల్యం ఉన్న వారికి (వేర్వేరు తరగతుల విద్యార్థులకు వేర్వేరు విధాలుగా) స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడును.

**స్వయం ఉపాధి రుణాలు :** అంగవికలురకు స్వయం ఉపాధి కోసం 3 వేల రూపాయల వరకు రుణాన్ని ఇస్తారు. ఈ రుణానికి 30% కొన్ని సందర్భాలలో 50% సబ్సిడి కూడా లభించే అవకాశం ఉంటుంది.

**వివాహ ప్రోత్సాహకాలు :** సకలాంగులు వికలాంగులను చేసుకుంటే వివాహ ప్రోత్సాహకాలు రూ. 3000/-ల నుండి రూ.10,000ల వరకు పెంచారు.

**పెరిగిన వికలాంగుల పెన్షన్లు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వికలాంగులకు యిచ్చే పెన్షన్ రూ. 200/–ల నుండి రూ. 500/– ల వరకు పెంచడం జరిగింది.

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం :** గ్రామీణ ప్రాంతాలలోని వికలాంగులు ఉన్న కుటుంబాలకు సంవత్సరానికి 150 రోజులు పని దినాలు కల్పించబడును.

**గ్రామీణ గృహ వసతి :** పెద్దలైన వివాహంకాని వికలాంగులకు గ్రామీణ పక్కా గృహాలు ఇందిరమ్మ పథకం క్రింద మంజూరు చేయబడును.

**పెట్రోల్ సబ్సిడి :** వార్షికాదాయం లక్ష రూపాయలకు మించని అంగవికలురు 50% మినహాయింపుతో 15 లీటర్ల పెట్రోలు కొనుగోలు చేయవచ్చును.

**సామగ్రి కొనుగోలుకు ఆర్థిక సహాయం :** తల్లిదండ్రుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించని వికలాంగులకు వీల్ చెయిర్, వినికిడి మిషన్ వంటి సామగ్రిని ఉచితంగా పొందవచ్చు. రూ. లక్ష ఆదాయంగల వికలాంగులకు సామాగ్రి కొనుగోలుకు 50% రాయితీ పొందే అవకాశం ఉంది.

**హాస్టల్ వసతి :** వికలాంగులకు నెలకు (1 నుండి 7వ తరగతి పిల్లలకు) 530రూపాయలకు మించని ఖర్చుతో ప్రభుత్వ హాస్టల్ ఉచిత వసతిని, పెద్ద తరగతులు చదువుతున్న వారికి నెలకు దుస్తుల నిర్వహణకు 100రూ.లు, భోజనానికి (8 నుండి 10వ తరగతి పిల్లలకు) 730రూపాయలు మంజూరవుతాయి.

**టేప్‌రికార్డరు :** అంధులకు ఉచితంగా టేప్‌రికార్డరు, రుణ ప్రాతిపాధిక క్యాసెట్లు ఇస్తారు.

**రీడర్ అలవెన్సు :** అంధ విద్యార్థులకు రీడర్ అలవెన్సు నెలకు 200 – 300 లభించును.

**ట్యూషన్ ఫీజు :** ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వికలాంగులు ఏటా 4000వేలు వరకు చెల్లించిన ఫీజులు తిరిగి పొందవచ్చును.

**టీచర్స్ ట్రయినింగ్ :** అంధ విద్యార్థులకు బోధించేందుకు ఒక విద్యాసంవత్సరానికి 22 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**రెసిడెన్షియల్ స్కూళ్ళు :** వినికిడి సమస్య ఉన్న వారికి, రాష్ట్రవ్యాప్తంగా 4 రెసిడెన్షియల్ స్కూళ్ళు, 16 సాధారణ స్కూళ్ళు ఉన్నాయి.

**హోమ్స్, హాస్టల్స్ :** రాష్ట్రవ్యాప్తంగా 42 శరణాలయాలు, వసతి గృహాలున్నాయి.

**పునరావాస కేంద్రాలు :** రాష్ట్రవ్యాప్తంగా 12 పునరావాస కేంద్రాలున్నాయి.

**ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ స్కీమ్ :** చెవిటివారికి, అంధులకు రాష్ట్ర వ్యాప్తంగా 46 స్కూళ్ళలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్‌ను అమలుచేయబడును.

**ఆదాయపు పన్ను రాయితీలు :** వికలాంగుడు ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆదాయపన్ను చట్టం 461లోని కొన్ని క్లాజులననుసరించి 80యు రాయితీ ఇవ్వబడును.

**3% రిజర్వేషన్ :** అంగవికలురకు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలలో 3% రిజర్వేషన్ ఉంటుంది. అంధులకు, చెవిటివారికి, అంగవికలురకు 1:1:1 నిష్పత్తిలో ఈ రిజర్వేషన్‌లు అమలు చేస్తారు.

ఈవిధంగా ఇన్నిరకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పించినప్పుడు మనం వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థానానికి ఎదగాలి. లేకపోతే ఈ జీవితం వ్యర్థం.

వికలాంగ అభివృద్ధి సాధికారితల సాధనలో వికలాంగుల హక్కుల వేదిక (డి. ఆర్. ఎఫ్.) మరెన్నో మైలురాళ్ళను అధిగమించి అభ్యుదయాన్ని సాధిద్దామని ఆశిద్దాం. అందరం ఏకమై చిత్త శుద్ధితో ఆత్మబలంతో మానవహక్కులని సాదిద్దాం. కృషితో నాస్తి దుర్భిక్షం, సర్వోజనా సుఖినోభవంతు.

అంగవైకల్యం అంటే శరీరంలో ఏదో ఒక భాగం లోపించడం కాదు అన్ని ఉండి కూడా ఇంకా ఏదో లోపం ఉందని ఆలోచిస్తూ కూర్చోవడమే నిజమైన అంగవైకల్యం అంటారు పెద్దలు. తమలోని అంగవైకల్యాన్ని మరచిపోయి ఎదుటివారి అభివృద్ధిలో పాలుపంచుకొంటున్న మా లాంటి వారికి మీ చిరుపలకరింపుతో తోడుంటారని ఆశిస్తూ...

మీ స్నేహితుడు

**– ఎం. వెంకటప్ప**

ఎం.ఎస్.సి. జువాలజీ, ద్వితీయ సంవత్సరం

# చిన్నారులతో నా చిరునవ్వు

ప్రపంచము చాలా పెద్దది. అందులో మన భారతదేశము ఒకటి. ప్రపంచ దేశాలతో పోటీ పడుతాం. అన్ని రంగాలలో వృద్ధి చెందుతూ ముందుకు సాగుతుంది. కాని ఎంత వృద్ధి చెందినా ఎంత విజ్ఞానాన్ని సంపాదించినా కొన్ని విషయాలలో అంటే వైద్యరంగంలో సంపాదించిన కొన్ని ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడే వాళ్ళు మన దేశములో ఎందరో. అందులో చిన్నారుల పరిస్థితి మాత్రము చాల ఘోరము.

"అమ్మ" అనే పదానికి అర్థమే ప్రేమ.

తన బిడ్డకు ప్రేమను పంచటం ఒక తియ్యని అనుభూతి కాని ఆ అమ్మ ప్రేమ లేకుండా ప్రేమ అనే పదానికి దూరంగా ఉంటూ ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడేవాళ్ళతో నేను కొంత సమయం గడుపుతున్నందుకు గర్వపడుతున్నాను. వాళ్ళతో గడుపుతున్నందుకు తియ్యని అనుభవాలను అనుభూతిని మీ అందరితో పంచుకోవాలని నా చిన్ని కోరిక.

ఒకరోజు నా మిత్రుడు (ఎం.ఎన్.జె.) ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆన్కాలజీ అండ్ రీసెర్చ్ సెంటరులో ఉద్యోగం ఉందని కబురు పంపాడు. వెంటనే అతనితో వెళ్ళి చూసేసరికి అక్కడ పెద్ద ఆసుపత్రి ఉన్నదని తెలిసింది. అందులో వైద్యము కోసము వచ్చిన 3 సంవత్సరాలనుండి 17 సంవత్సరాలవరకు గల పిల్లలను చదివించడం, ఆడించటం, వాళ్ళను నవ్వించటం, మొత్తానికి చెప్పాలంటే వాళ్ళకు ప్రత్యామ్నాయంగా ఆ వ్యాధి నుండి వాళ్ళను బయటపెట్టటం. నాకు తెలియనిది ఏమిటంటే ఒక హాస్పిటల్లో చదివించటం, ఆడించటం ఏమిటని ఆశ్చర్యపోయాను. అక్కడికెళ్ళి చూస్తేకాని నాకు తెలియని ఒక నిజము తెల్సింది. వాళ్ళు ఒక భయంకరమైన "క్యాన్సర్" అనే వ్యాధితో బాధపడుతున్నారని తెలిసింది. అయితే ఆ పిల్లలను చదివించటం, ఆడించటం చెప్పాలంటే వాళ్ళను ఎలా సంతోషపెట్టాలో అనే సందేహంతో మొదటి రోజు వెళ్ళాను. వాళ్ళందరితో కలిసిపోయా. అలా రోజూ వెళ్ళడం వాళ్ళను సంతోషపెట్టడం అలవాటయింది. కాని కొంతమంది పిల్లలు మాత్రము ఎవరితో మాట్లాడకపోవడం, ఒంటరిగా ఉండటం నేను గమనించి వాళ్ళ దగ్గరికి వెళ్ళి అడిగేసరికి వాళ్ళ లేత మనసులు బాధలను నాతో చెప్పటం మొదలుపెట్టారు. "అన్నయ్యా" రోజు డాక్టర్ అంకుల్ వచ్చి ఇంజక్షన్ ఇస్తాడు కాదా అది చాలా నొప్పిగా ఉంటుంది. బాడీ పెయిన్ అని వాళ్ళకు తెలిసిన మాటలలో చెప్పారు. అప్పుడు వాళ్ళకు అర్థమయ్యే మాటలలో సమాధానం చెప్పి నచ్చచెప్పాను. తరువాత మరుసటిరోజు సరదాగా ఒక్కొక్కరిని మీ జీవితంలో పెద్దయ్యాక మీ కోరిక ఏమిటని అడిగా. ఒక్కొక్కరు ఒక్కోవిధంగా ఒకరు డాక్టరు అని, ఒకరు ఇంజనీరు అని ఇంకొకరు పైలెట్ అని, ప్రతి ఒక్కరు పెద్దయ్యాక ఏదో సాధించాలని తపన వాళ్ళ కళ్ళలో కనిపించింది. వాళ్ళ పట్టుదలను చూస్తే వాళ్ళు అనుకున్నవి సాధించాలని మనస్ఫూర్తిగా ఆ దేవుడితో కోరుకుంటున్నాను.

"ఆకాశానికి అందము సూర్యుడు, చంద్రుడు, చుక్కలు. అయితే పగలంతా వెలుగునిచ్చేది సూర్యుడు, రాత్రంతా వెలుగునిచ్చేది వెన్నెల అలాంటి వెన్నెలగల" చల్లని మనసున్న పిల్లల జీవనము మరి కొద్ది రోజులే అంటే నాకు చాలా బాధ అనిపించింది.

ఈనాటి చిన్నారులే రేపటి మేధావులు. ఆ మేధావులే లేకపోతే దేశం ఏమైపోవాలి?

కన్నులు ఉన్నా చూడలేని ప్రపంచంలో, చెవులు ఉన్నా వినలేని సమాజంలో, మాటలు వచ్చినా మాట్లాడలేని వారితో నా జీవిత ప్రయాణం సాగుతుంది. కాని వ్యాధులతో బాధపడే వాళ్ళను చదివించడానికి సంతోషపెట్టడానికి నన్ను నియమించినందుకు వారికి నా కృతజ్ఞతలు. ఎందుకంటే సహజంగా బడిలో చదివించడం ఒక వంతు. అయితే జబ్బుతో ఉన్న వారికి ఆనందం పంచటం ఎంతో గొప్ప విషయం అని నా భావన. ఆ పిల్లలు చేసే అల్లరి, పాడే పాటలు, ఆడే ఆటలు జీవితంలో మరచిపోలేనిది నన్ను ఎన్నడు విడిపోనిది. అవన్నీ నా తీపిగుర్తులే. రండి మనమందరమూ వారికి చేయూతనిస్తూ ముందుకు నడిపిద్దాం.

**– మహీంద్ర**

బి.ఎ. ద్వితీయసంవత్సరం

# జీవిత మార్గదర్శి

## మనిషి ఆత్మ

మనిషి చనిపోయిన తర్వాత, వారి ఆత్మ బ్రతికి ఉంటుంది. అయినప్పటికి వారి ఆత్మ భూలోకంలో తిరుగుతూ ఉంటుంది. ఓ మనిషీ నీ ఆత్మ గాలిలో కలిస్తే గాలిలో తిరుగుతూ ఉంటుంది. నీవు చనిపోతే నీ శరీరాన్ని మంటలో దహనం చేస్తారు. అప్పుడు నీ ఆత్మ బూడిదలో కలుస్తుంది. ఆ బూడిదే మట్టి అవుతుంది. అప్పుడు నీ ఆత్మ మట్టిలో కలుస్తుంది. నీవు ఎన్నో పాపాలు చేయడం వలన, ఇలాంటి శిక్ష అనుభవించవలసి ఉంటుంది. మనిషికి అహంకారం ఉండడం వలన ఆత్మ లేకుండా పోతుంది. నీ ఆత్మని ఎన్నో పాపాల వలన మలిన పరిచావు. అలాంటి నీ ఆత్మ మంచిదైతే "స్వర్గలోకానికి" పోతుంది. లేకపోతే చెడ్డదైతే యమలోకానికి పోతుంది. చూశావా? మనిషి ఆత్మకు ఎంత చరిత్ర ఉందో. ఈ లోకంలో మంచి ఆత్మగలవారు దేనినైనా సాధిస్తారు. ఒక్కసారి మీ ఆత్మను మీరు పరీక్షించుకోండి. అప్పుడే మీ గురించి మీకు తెలుస్తుంది.

## ప్రకృతే ఉగ్రరూపం ధరిస్తే?

అందరు బ్రతకటానికి కావలిసింది ప్రకృతి. ఆ ప్రకృతి లేకపోతే మన అందరి పరిస్థితి ఏంటి? ఒక్కసారి ఆలోచించండి. మనకు జీవనాధారమైంది ప్రకృతి. అలాగని ఈరోజుల్లో మానవుడు ప్రకృతిని తన జీవన మనుగడ కోసం నాశనం చేస్తున్నాడు. ఆ ప్రకృతే తలచుకుంటే మనిషిని భూమిమీద నామరూపాలు లేకుండా చేస్తుంది. "ఏ స్వార్థం లేని చెట్లను చూశావా. మనిషికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది". "ఏ స్వార్థం లేని సముద్రాన్ని చూశావా? మానవజాతికి ఎన్నోరకాలుగా ఉపయోగపడుతుంది." అదే విధంగా ప్రకృతిలోని "సూర్యచంద్రులను చూశావా. ఏ స్వార్థం లేకుండా ప్రజలకు వెలుతురును ఇస్తున్నాయి. ఎన్నో విధాలుగా సహాయపడుతున్నాయి. అలాగని సమాజంలో ఒక గొప్ప వ్యక్తిగా గుర్తింపు పొందిన మనిషి ఈరోజుల్లో సమాజానికి సేవచేయడం లేదు. మనం ప్రకృతికి అనుకూలంగా నడుచుకుందాం.

**– ఎన్. శ్రీనివాసులు**

బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

# యువతీ యువకులకు సందేశం

యువతీ యువకుల్లారా మేల్కోండి.
మీ దారి ఎటో తెలుసుకోండి.
మంచి నిర్ణయాలు తీసుకుంటే,
మంచివారిగా అభివృద్ధి చెందుతారు.
చెడు నిర్ణయాలు తీసుకుంటే
చెడ్డవారిగా తయారు అవుతారు
మీ జీవితం మీ మీదనే
ఆధారపడి ఉంది.
విద్యార్థులుగా మీ విధి ఏమిటో
నిర్వర్తించి ముందుకు సాగిపో.
సినిమాలు, షికార్లు అంటారు,
ఇంకా త్రాగుడు అంటారు. చివరికి మీ
బ్రతుకు బండి ఎక్కడికి పోతుందో తెలియదు.
విద్యార్థుల్లారా మీకు గురువులు అంటే,
తల్లిదండ్రులంటే భయమే లేదు.
సమాజంలో గురువుల తల్లిదండ్రుల, మాటలు
వినని వారి జీవితాలు వ్యర్థం అయ్యాయి.

ఓ యువతీ యువకుల్లారా, మన ఆచార సంప్రదాయాలను మంటలో కలుపుతున్నారు.

ఓ యువతీ యువకుల్లారా, మీ జీవితాలను కాపాడుకోండి.

అప్పుడు మిమ్మల్ని చూసి ఇతరులు నడచుకుంటారు.

ఓ యువతీ యువకుల్లారా జీవితంలో అందరికి కష్టాలు మామూలే. వాటిని ఎదుర్కొని అధిగమించాలి. అప్పుడే నీవు అన్నింటిని సాధిస్తావు.

ఓ యువతీ యువకుల్లారా! స్నేహం బజారులో దొరికే వస్తువు లాంటిది కాదు. ఆ స్నేహానికి విలువ తెలిసిన వారితో స్నేహం చెయ్యాలి.

ఓ యువతీ యువకుల్లారా! జీవితంలో మంచి మిత్రుని కలిగి ఉండు, వారి నుండి ఏమి ఆశించకూడదు. అప్పుడే ఆ స్నేహానికి విలువ ఉంటుంది.

ఇట్లు మీ శ్రేయోభిలాషి

**– నీలాల శ్రీనివాసులు**

బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

## 'సామాన్య' ('బహు'తిక) శాస్త్రం

చూడడానికి 'సామాన్య'మైనది కనిపించే నామము
జీవితంలో వుంది దాని పాత్ర అమోఘం
న్యూటన్ సూత్రంతో రాకెట్‌ను అందించి
జీవితంలో ఎలా అభివృద్ధి చెందాలో వివరించి
అయస్కాంతత్వంతో 'ఆకర్షణ'ను వర్ణించి
ఆంపియర్‌తో విద్యుత్‌ను ఆరంభించి
మనిషిలో కనబడని శక్తిని గురించి తెలిపి
ఘర్షణతో జీవితంలోని కష్టాలను పోల్చి
ఐన్‌స్టీన్ ద్రవ్యరాశి తుల్యత నియమంతో
కష్టానికి, ఫలితానికి సంబంధాన్ని అందించి
కాంతితో చూసి ప్రతిదానిని నమ్మకూడదని
నవీన యుగానికి మరమనిషిని సృష్టించి
సృష్టికి ప్రతి సృష్టిగా నిలుస్తున్న
'బహు' తికమా ఎటువైపు నీ యీ ప్రయాణం...

## అంతర్మథనం

అభివృద్ధి చెందుతున్నామా
అథోఃపాతానికి చేరుతున్నామా
మిలియనీర్లు పెరుగుతున్నారు ఒకవైపు
ఆకలిరాజ్యం విస్తరిస్తుంది మరొకవైపు
సంపాదనే అంతిమలక్ష్యం చాలామందికి
మొహమాటానికి అదేదారిలో మిగిలింది
అంబరాన్ని తాకే విజ్ఞాన (మేధ) శాస్త్రం
కుచించుకుపోతున్న విచక్షణ జ్ఞానము
'స్వేచ్ఛ' రాజ్యాంలో బానిస బ్రతుకులు కొందరివి
స్వచ్ఛమైన దేశంలో నీచమైన జీవితాలు మరికొందరివి
భగవంతుడా! మార్చుతావో లేదో నీ యిష్టం
నాకు మాత్రం వీటి గురించి ఆలోచించే సమయాన్నివ్వకు
వీటి ప్రభావం నా వ్యక్తిత్వముపై పడకుండా చూడు.

**వి. సృజన్**

ఎం.ఎస్.సి. (భౌతికశాస్త్రం) ఫైనల్

## పిల్లలు మంచి మల్లెలు

పిల్లలం మంచి మల్లెలం
కపటం ఎరుగని బాలలం
భారతమాతకు పుత్రులం
భావి భారతపౌరుషం ॥2॥
చిన్న పిల్లలం మేమంతా
తెలియక చేస్తాం తప్పులను
తప్పులన్నిటి మన్నించి
ఆదుకొను మము ఆచార్యా ॥పి॥
గాలి లాగ మేమున్నము
మా దారికి కళ్లెము వేయుము
మంచిదారులకు మళ్లించి
మా జీవితాలను మార్చుము ॥పి॥
శిలల లాగ మేమున్నం
శిల్పంగా మమ్ము మార్చుము
విద్యాజ్యోతులను వెలిగించి
విశ్వసేవకై పంపుము ॥పి॥
గురువులందరికి వందనం
మేమైనమిపుడు చందనం
చదువుల తల్లికి వందనం
భారతమాతకు సుందరం ॥పి॥

## పద్యం

గ్రంథభాష నాడు కరడు గట్టిననేల
గిడుగు రాముడొచ్చి గొడుగు గప్పి
వ్యవహారిక భాష వ్యవసాయం జేసెరా
నరుల గోల వినుర నారసింహా! 1
తేనెలొలుకు తెలుగు తేట మాటల పల్కు
తెలుగు వలన మనకు తెలివి పెరుగు
మాతృభాషలోన మాట్లాడితే మేలు
నరుల గోల వినుర నారసింహా! 2

**ఏ. నర్సింహాచారి**

బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయ

## కవితలు

"ఏది ఆగదు"

వచ్చేది రాక ఆగదు

పొయ్యేది పోక ఆగదు

జరిగేది జరుగక ఆగదు

సృష్టిలో పుట్టుక ఆగదు

గిట్టుక ఆగదు

చెప్పి వచ్చేది పుట్టుక

చెప్పక పోయేది గిట్టుక

ఇదియే సృష్టి ధర్మ రహస్యం

## జోక్స్

1. సార్ : ఒరేయ్ చారి నీవు ఏం తింటావురా?

చారి : ఎందుకు సార్?

సార్ : నీకు ఇన్ని తెలివి తేటలున్నాయని.

చారి : అదా సార్! నేను మీ బుర్ర తింటాను.

2. ప్రేక్షకుడు : చారి సార్ మీ నంబరు కొంచెం చెప్పరూ?

చారిసార్ : ఆ రాసుకోవయ్యా 950

ప్రేక్షకుడు : ఏంటి సార్ ఇంతేనా.

చారిసార్ : నువ్వేకదయ్యా కొంచెం చెప్పమన్నావు.

3. చారిసార్ : ఒరేయ్. సింహా నీవు ఏ క్లాస్ రా?

సింహ : యల్.కె.జి. ప్లస్ యుకెజి కలిపి పికెజి చదువుతున్నాసార్

చారిసార్ : అమ్మో మీకు కె.జి. చొప్పున చదువు చెప్పడం నావల్ల కాదురోయ్.

**– ఎ. నర్సింహాచారి**

బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

## ప్రేమేకాదు జీవితం

ప్రేమకు మనసును ఇవ్వకు
మనసే మాయమౌతుంది
ప్రేమకు చేరువౌతుంది
గుండెలో ప్రేమ అలజడి రేపి
సందులు గొందులు తిప్పుతుంది
ప్రేమే నా ప్రాణమంటావు
నీ చావును కొని తెచ్చుకుంటావు
"అందుకే ప్రేమించకు"
మంచి మార్గాన్ని ఎంచుకో
"నీకంటూ ఓ ప్రత్యేకతను సాధించుకో"

**–ఎన్. సత్యనారాయణచారి**

ఎస్.ఎస్.సి. (కెమిస్ట్రీ) ప్రథమ సంవత్సరం

## ఎవరు? నీవెవరు??

ఎవరు నీవెవరు ఇంతకీ నీవెవరు
నాకనురెప్పల మాటున దాగిన కమ్మని కలవా...?
లేక నా గుండె లోతుల్లోంచి వస్తున్న నా శ్వాసకే శ్వాసవా...?
నా హృదయపుటంచులోని నా హృదయ వేదనవా?
లేక నా మరణశ్వాసకు అడ్డుగా నిలిచే అమృతధారవా.
ఇంతకీ నీవెవరు ఎందుకీ నాకీ ఆవేదన
అంతులేని నీ హృదయపు లోతున
ఎప్పుడు చేరుతుంది, అనంతమైన నా హృదయరోదన
నా కనురెప్పల మాటున కమ్మని కలగా నిలిచిన నీకు
నా గుండె గుడిలోపల కొలువైన నీకు
ఎప్పుడు తెలుస్తుంది నా ఆలాపన,
నా శ్వాస, నా ధ్యాస అన్నీ నీవేనని
ముసుగు తెరలను తెంచుకుని చూడు నేస్తం
నీకు తెలుస్తుంది నా హృదయ స్పందన
అప్పుడు కన్పిస్తుంది నీకు నా కల్మషం లేని స్వచ్ఛమైన ప్రేమ.
ఎందుకు నేస్తం నాపైన ఆక్రోశం
నా హృదయ వేదనతో వచ్చిన కన్నీటితో తడపనా...
నీ ఆక్రోశం తగ్గడానికి, లేక
నీకు ఇష్టమైన ఎరుపు రంగుతో వున్న నా రక్తంతో తడపనా...
అప్పటికైనా నాపై దయ చూపిస్తావా నేస్తం...

**మాచిడి సంతోష్‌గౌడ్**

ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం

## "జ్ఞానాన్వేషి"

సమాజాన్ని అర్థం చేసుకోలేని
చదువులు ఎన్ని ఉన్నా వ్యర్థమే!
మనోవైకల్యం సంసిద్ధంగా ఉండి
మానసిక వికాసం పరిపక్వం చెంది
అన్ని విధాలుగా ఆసరయ్యేదే
నిజమైన చదువు.
అమాస – పున్నంలా...
అవసరానికి పనికొస్తుందని చదివితే
ఎంతకాలం నిలుస్తుంది!
మాంటే పరీక్షలు పూర్తి అయ్యేంతవరకేగా!
నాటి వేద జ్ఞానం కాదు నేడంతా పుకిళించేదే.
చదువు అనేది,
సర్వ జన హితంకై
సత్యశోధన అర్థంకై
నిజ నిర్ధారణ వివరణకై
ప్రకృతిని ఆస్వాదిస్తూ...
నిత్యం కొనసాగిస్తేనే నిలుస్తుంది!
అజ్ఞానం అనేది ఏ జీవిలో ఉండదు
అందుకే, ఉన్న జ్ఞానాన్ని సవ్యదిశలో నిల్పడానికి,
తాత్విక వైచిత్రి దృష్టితో సాగించే చదువు,
సర్వం బ్రతికే ఉంటుంది... ఆ దారిలో
జ్ఞాన సముపార్జన మార్గాలు అనేకం
ఆ మార్గాలను ఎంచుకోవడమే
జ్ఞానాన్వేషిగా – నీ బాధ్యత.

## దీనికి పరిష్కారం ఎవరు?

యంత్రాలు కడుపు నింపలేవు
కాగితాలు రుచి చూపలేవు
తిండిగింజలు కరువైనప్పుడు
రెక్కలు చెమట చిందనిదే
నోట్లోకి ముద్ద అందదు
ఐతే
గ్లోబలైజేషన్
ఆకలిని ఎంత వరకు తీర్చుతుంది?
అసహాయత, అవినీతి...
సమానత్వం దొరకని ఈపేద సమాజంలో
ఆకలి దరిద్రులు ఎందరో
కూటికోసం కొట్టుకు చస్తున్నారు....
నడి సముద్రంలో తిమిలింగాలు ఉన్నంతకాలం.
చిరు చేప పిల్లలు సుఖంగా బతుకగలవా?
కరుణించలేని కాసులు గలవారున్నంత వరకు
కూడు దొరుకని జీవుల బతుకు లేమవ్వాలి?
మరెలా ఆకలి సద్దుమణిగేది?
ఆర్థిక వ్యవస్థ ఎన్ని పథకాలు తెచ్చినా?
మంచుగడ్డలా మధ్యలోనే కరిగిపోతుంటే
దయార్థ్ర జీవులకు ముక్తి ఎక్కడ?
స్వేచ్ఛా సమానత్వం
నేడు సందుల్లో చిందులేస్తుంటే,
లౌకికవాదం వక్ర క్రోధాలాడుతుంటే
మానవత్వ పరిమళం ఎక్కడ పుడ్తుంది?
మరి ఎప్పుడు ఆకలి సద్దుమనుగుతుంది?
ఎవరిచేత ఆకలి సర్దుకుపోతుంది?
దీనంతటికి పరిష్కారం ఎవరు?

**యన్. సైదులు**
బి.ఎ. (హెచ్.టి.పి.) ప్రథమసంవత్సరం

# కవిత్వంలో కవి - వివిధ ప్రక్రియలు

ఉచ్చరించే శబ్దాల్ని పదంగా మలిపేదే అక్షరం.

అదే మన తెలుగు లక్షణం. తెలుగు తియ్యదనం తరుగనిది. తెలుగు భాష తెలుగు ప్రాంత ప్రజల నోటి ద్వారా బయటపడితే ఆ భాషకు జీవంపోసి శాశ్వతంగా వెలిగించేందుకు కృషి చేసే సాధకుడే కవి.

సృష్టిలో భాష అనేది సహజసిద్ధంగా అవతరిస్తుంది. ఐతే... భావ వినిమయంలో భాషకు సౌందర్యాన్ని సృష్టించి... ఆ సౌందర్యాన్ని నిత్యం నిలబెట్టే వారధి కవి.

కవి తెలుగు కవిత్వాన్ని, కథను, వచన రూపాలను, నిరంతరం నిర్మించే భాషా శిల్పి. ఒక శిల్పి సహజ లక్షణాలతో, త్రికరణ శుద్ధి వంటి గుణాలతో, సదుద్దేశంతో నిలువెత్తు బండనుసైతం చక్కని శిల్పంగా రూపుదిద్దగలడు. అలాగే సమాజంలో "సనాతన ఆధునిక" భావాలమధ్య వస్తున్న మార్పులకు అనుగుణంగా భాషకు ప్రాణాన్ని పోసే ఉద్యమకారుడు, సహజ సన్యాసి అని ప్రతి ఒక్కరు గమనించాలి. భాష అనేది మనిషి పుట్టుకతోనే వస్తుంది. అది ప్రతి వ్యక్తి రక్తంలో నిరంతరం ప్రవహిస్తుంది.

మన స్థితులు, పెరిగిన పద్ధతులు, చుట్టూ జరిగే పరిణామాలు ప్రతివ్యక్తిలో భావవ్యక్తీకరణ అభివృద్ధికి మూలాలు.

ఈ భావవ్యక్తీకరణ అభివృద్ధికి తెలుగు సాహిత్యంలో ఎనలేని కృషిచేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు.

ఆదికవి నన్నయ దగ్గరి నుంచి ఆధునిక కవి సి.నా.రె. వంటి కవుల వరకు ఈనాడు తెలుగు కవిత్వం అభివృద్ధి స్థాయిలోకి చేరిందనడంలో సందేహం లేదు. ఐతే మొదట నన్నయ సాహిత్య ప్రక్రియకు ప్రాణం పోశాడనడంలో ఎటువంటి తారతమ్యం లేదు.

ఇక మరో విషయం ఏమంటే నాటి ప్రాశ్చ సాహిత్యం నుంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు తెలుగు ఓ వెలుగు వెలుగుతుందనడంలో ఆశ్చర్యంలేదు. నేటి ఆంగ్ల మాధ్యమ బోధనల వల్ల ప్రాంతీయ భాష ప్రతిష్టకు దెబ్బతగిలింది. అమ్మ భాష విడిచి అరువమ్మ భాష పట్టుకు వేలాడుతున్నారు. బలవంతంగానైనా దానికోసం ప్రాకులాడుతున్నారు.

గ్లోబలైజేషన్ దృష్ట్యా ఇతర భాషలకు ప్రాధాన్యత ఉన్నప్పటికి మన మాతృభాషను మరవకూడదు.

మానవత్వాన్ని మరిచి – సహజ లక్షణాన్ని విడిచి – సామాజిక వ్యతిరేకంగా... తెలుగు తల్లి మాటకు తూట్లు పొడవవద్దు.

అదే విధంగా 'కథ' అనేది సామాజిక పరివర్తనకు, నూతన మార్పుకు నాంది. ఇందులో సందేహం లేదు. కవి తన అక్షరాభిరుచిని బట్టి ఆయా ప్రక్రియల్లో రచన సాగిస్తుంటాడు. కథ మానవ విలువల్ని తట్టి చూపుతాయి. ఆనాడు కథలన్నీ రాజులను, దేవతలను గూర్చి సాగినవే ఐనా. ఒక ప్రక్రియ మాత్రం మనకు దొరికింది.

అలనాడు తెలుగులో గుణాఢ్యుడి – "బ్రహృత్కథ" నుండి కథ లిఖిత రూపం పొందిందనడంలో అతిశయోక్తి లేదు.

ఏమాటకు ఆమాట చెప్పుకోవాలన్నా... ఆనాడు కథ ఆశు రూపంలో ఎక్కువగా సాగేది. ఎప్పుడైతే లిఖితం మొదలైందో అప్పుడే "కథ" భద్రపరిచే స్థాయికి చేరుకుంది.

ఆధునిక కాలంలో తెలుగులో అనేక రచనా ప్రక్రియలను అనేకమంది కవులు ప్రవేశపెట్టారు.

అందులో విశ్వనాథ, రావిశాస్త్రి, కవికొండల, శ్రీపాద, కొడవటిగంటి, దాశరథి, జాషువా, వట్టికోటి ఆళ్వారుస్వామి, బోయిభీమన్న, శ్రీశ్రీ, చలం, తిలక్, సి.నా.రె. ఇలా ఎందరో కవులు తెలుగు సాహిత్య వనంలో వికసించే మందారాల వంటి రచనలు పూయించారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఐతే ప్రస్తుతం ప్రతి కవి తెలుగులో తమ తమ ప్రాంతీయ మాండలికాల్లో, యాసల్లో, రచనలు చేస్తున్నారు.

కలకాలం ప్రజల కంఠమందు నిల్చిఉండేవి నిక్కమైన మంచి మాట ఒక్కటే. అది కవుల కల్పనా శక్తికి నిదర్శనం.

మానవీయ కోణంలో, సమసమాజ నిర్మాణంలో భాగమై – నిత్యాన్వేషణ పరుడై, జనజాగృతి కోసం వికసించే రచనలు వెదజల్లుటలో కవికి – సుదీర్ఘ దృష్టి, నిరంతర పరిశీలన, అత్యంత ముందుచూపు, తాత్వికదర్శనం ఉంటుంది. ఎందుకనగా "రచన" అనేది సామాన్య విషయం కాదు. అందరి భావాలను, ఒక్కటిగా చేసి చూస్తూ, చూపించాలంటే కవికి – ఒక ప్రత్యేక లక్షణం అవసరం. అది తాత్విక, ఆధ్యాత్మిక దర్శనం లేనిదే రచన బలంగా సాగదు.

ఏది ఏమైనా తెలుగు సామ్రాజ్యంలో చెక్కుచెదరని, నిలువెత్తు కోటలు నిర్మించే సామర్థ్యంగల ప్రముఖ కవుల పాత్ర ఎనలేనిది.

కృతిని వెలువరించుటలో కవుల కృషి అద్వితీయం. ఈ సందర్భంగా మనం ఒక్కటి గుర్తించాలి. "కవి వ్యక్తిగతం కన్నా – అతని కవితా తత్వం, భావం, వివరణ లక్షణాన్ని అర్థం చేసుకోవాలని మనవి.

తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు అవతరించినా అవి మానవ ప్రగతికోసమే అని గుర్తించిననాడే తెలుగు విలువ విశాలమౌతుంది. జై తెలుగు – జై జై తెలుగు.

**– యన్. సైదులు**

బి.ఎ. (హెచ్.టి.పి.) ప్రథమసంవత్సరం

# స్త్రీ శక్తి

అందానికి రూపం నేను
ఆనందానికి ప్రతిబింబం నేను
సృష్టికి మూలం నేను
సువిశాల హృదయం కలను నేను
ఓ ఇంటి కోవెల దీపమైన ఉవిదను నేను
ఒడుదుడుకుల ఓర్పును నేను
అలసట లేని ఆలను నేను
ప్రేమ పంచే మూర్తిమత్వాన్ని నేను
ప్రకృతి కవికలాన్ని నేను
దేనిలో లుసిపోని శక్తిగల పడతినేను
జడివానలు కురిసిన వేళ
గుడిసంతా తడసిన వేళ
ఎండలో కమలిన వేళ
చలిలో వణికిన వేళ
గృహమనే గుండెలో దాచిన సృష్టిని నేను...
నన్ను ఇప్పుడు :
నా అందాన్ని ఛిద్రం చేశారు
నాకో ఆనందమే లేదంటూ వ్యధను కలిగించారు.
వాళ్ళదె సృష్టి అంటు సుడిలో చిక్కారు
నాకు స్థానమే లేదంటూ వ్యసనాలు పట్టారు వాళ్ళే కామాంధులు
నేనంటే దరిద్రలక్ష్మి వారిళ్ళకు
నా మేను రత్నరాసులు వారి కళ్ళకు
నా తనువును తక్కెడతో తూస్తారు వాళ్ళు
నా శరీరాన్ని పిండి పిప్పి చేస్తున్నారు వాళ్ళు
వాళ్ళే వ్యాపారులు
నన్ను హీనంగా చూస్తారు. ఘోరంగా నిందిస్తారు
వాలుగా చూస్తారు నరకం చూపిస్తున్నారు...
అదిగో ... త్వరలో ...
వస్తుంది స్త్రీశక్తి... విశ్వంలోని పురుషాధిక్యం తుడిచి
స్త్రీ ఆధిక్యంకై ... హోమం చేస్తూ
అగ్నిపర్వతం బద్ధలయ్యేటట్లు
హిమశిఖరం కరిగేటట్లు
భూమి చీలేటట్లు
ఆకాశం విరిగేటట్లు
నక్షత్రాలు రాలేటట్లు
ప్రకృతి తాండవించేటట్లు
నూతన సృష్టికై మహిళాలోకం వస్తుంది. వస్తుంది.

***రమావతు దస్రు నాయక్ (సుమం)***
బి.ఎ. (ఆంగ్లసాహిత్యం) ద్వితీయ సంవత్సరం.

# ఓ మగువా!

మగువా!
చల్లని నిశిరాతిరి పొరలు తప్పించి
వెచ్చని స్పర్శనందించే ఉషస్సును
నాకు పరిచయం చేసేందుకు
తల్లిలా మారింది.
జీవరహిత కనులలో సప్తవర్ణ
శోభను నింపేందుకు
చెలిమిలా మారింది
నా తరుణ ప్రాయం ఒంటరిదైన తరుణంలో
ప్రణయమాధుర్యాన్ని అందించేందుకు
ప్రేయసిలా మారింది.
జతకై కసివేట మొదలెట్టే సమయంలో
శృంగార రస కలశాన్ని అందించేందుకు
రతీదేవిలా మారింది
జగతిని విడిచిన నిమిషంలో
తన బడిని చేర్చుకునేందుకు
పుడమి దేవతలా మారింది.
ఉలి నీవై మనిషిని మలిచిన మగువా!
చిరకాలం నీవు సుఖీభవా!!

**– ఇ. శ్రీనివాస్**
బి.కాం. ద్వితీయసంవత్సరం

# స్వామీజీ, వివేకులు కలలుగన్న భారతం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన శుభసమయంలో 1947 ఆగస్టు 15న ఆకాశవాణిలో అరవిందయోగి తన కలల భారతాన్ని ఆవిష్కరింపచేశారు. తాను ఏవిధంగా భవిష్యత్ భారతావనిని చూడ దల్చుకున్నదీ స్పష్టంగా తెలియచేశారు. స్వేచ్ఛాయుత, సమైక్యాయుత భారతావనినే తాను కోరుకుంటున్నానని తెలియచేశారు. కానీ, ఆయన ఆశలు తీరలేదు, కలలూ ఫలించలేదు. స్వాతంత్ర్యం రావడంతోనే అఖండభారత్ ముక్కలైంది. అల్లర్లు జరిగాయి. దేశ విభజనతోనే అంతా సమసిపోతుందని వారు ఆశించారు. కానీ అలా జరగలేదు. ఇరు దేశాలను విభజించిన రేఖలు మరింత మందంగా మారాయి.

ఆధ్యాత్మికంగా శతాబ్దాల చరిత్రను, ఘనతను సొంతం చేసుకున్న భారతావని సనాతనధర్మానికి పెట్టనికోటలా తయారు అవుతుందని అరవిందులు భావించారు. కానీ అలాంటి సనాతన ధర్మాన్ని మనం పాటిస్తున్నామా? అసలు దాని నీడలేమైనా వర్తమానదేశంలో కనిపిస్తున్నాయా? అసలు ఎవరు ఈ ధర్మాన్ని పాటిస్తున్నారనే ప్రశ్నకు సమాధానంలేదు. ఇప్పుడు సర్వత్రా కనబడుతున్నది ఆధ్యాత్మిక, ధార్మిక మూలాలను ఛేదించే, ప్రశ్నించే ప్రయత్నాలే. సనాతనంగా ఆధ్యాత్మికతకు కేంద్రంగా ఉన్న భారత్‌లో వుంటూ, ఆధ్యాత్మిక, ధార్మిక మూలాలనే ప్రశ్నిస్తున్నారు కొందరు సూడో సెక్యులరిస్టులు. నైతికపరమైన అరాచకత్వం దేశాన్ని అలుముకుంది. అవినీతి సర్వత్రా వ్యాపించింది. ప్రపంచంలోనే అవినీతి పేరుకు పోయిన పది దేశాల్లో ఒకటిగావున్న భారతావని రాజకీయంగా, పాలనాపరంగా, ఆర్థికంగా కూడా ఈ విషవలయంలో చిక్కుకొని విలవిలలాడుతుంది. ఫలితంగా దాని మూలాలు ఆవిరైపోతున్నాయి.

వర్తమాన కాలంలో చట్టసభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధులు తమ విధినిర్వహణలో నిర్లక్ష్యం, స్వార్థచింతన వంటివి కనబరుస్తున్నారు. నేటి ప్రజాప్రతినిధులు ప్రజలకు ప్రాతినిధ్యం వహించటంలేదు. వారి ఆశలు, ఆకాంక్షలు అద్దంపట్టేవిధంగా తమ ధర్మాన్ని నిర్వర్తించడంలేదు. ఉన్నత వాగ్దాటిని చూపి, అరచేతిలో వైకుంఠం చూపి ప్రజలను, దేశాన్ని మోసం చేస్తున్నారు. ఇవన్నీ ప్రయత్నాలు తాము ప్రాతినిధ్యం వహించే పార్టీనుంచి ప్రశంసలు పొందడానికే ఉపయోగపడతాయి.

ఇప్పటి మన పార్లమెంటును చూస్తే అసలు వాస్తవం ఎంత కఠోరంగా వుందో అర్థమవుతుంది. ప్రజల్లో చైతన్యాన్ని ఆలోచనను రేకెత్తించే రీతిలో ఉండాల్సిన పార్లమెంట్ ఆ లక్షణాలు, లక్ష్యాలతో ఏమాత్ర కనిపించుటలేదు. వందలాది మంది నేరచరితులు కావడం, ఎంతైనా శోచనీయం. ఈ వందమందిలో ముప్పైమంది హత్యలు, మానభంగాలు, దోపిడీలు చేసి ఛార్జిషీట్లలో ఉన్నవారనే నిజం గుండెలను పిండేసేదే. పార్లమెంటు ప్రతిష్ఠకు మచ్చతెచ్చేదే. ఇలాంటి వారు ప్రాతినిధ్యం వహిస్తే యోగి అరవిందులు ఆకాంక్షించిన భారత్‌ను ఆవిష్కరించగలమా?

మహోన్నత ఆధ్యాత్మిక ధార్మిక వారసత్వానికి భారత్ పెట్టిందిపేరు. తరతరాల సంపదగా మనకున్న ఆధ్యాత్మిక, ధార్మిక జీవనానికి భారత్ పట్టుకొమ్మ. ఇంతటి ఘనచరిత్రను సంతరించుకొన్న భారత్ ఆధ్యాత్మిక, ధార్మిక లక్షణాలను వ్యాపితం చేయడంలో మొత్తం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని, ఆదర్శనీయ భావాలకు మూలకేంద్రం అవుతుందని అరవిందులు ఆశించారు. అమెరికాలాంటి ఇతర దేశాల వారు సైతం మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతవైపు ఆకర్షితులు అవుతున్నారన్న విషయాన్ని అరవిందులు ఆనాడే గుర్తించారు. అందుకే భవిష్యత్తులో భారత్ ఆధ్యాత్మికత ప్రపంచంలో మహోన్నత శిఖరాలను అధిరోహిస్తుందని ఆశించారు. కానీ తన మహోన్నత వారసత్వాన్ని పరిరక్షించడంలో భారత్ ఆసక్తి కనబర్చడంలేదు.

ఈ నేపథ్యంలో కొన్ని ప్రశ్నలకు సమాధానం తెల్సుకోవాల్సిన అవసరం వుంది. అరవిందయోగి ఆశలు, ఆశయాలు, కలలను భారత్ ఎందుకు విస్మరించింది? వాటిని సాధించే ఆచరణాత్మకం చేసే విధంగా ఎందుకు ముందడుగు వేయలేకపోతున్నాము?

ఈదేశంకోసం నిస్వార్థంగా సేవలందించిన నేతలు, మహాశయుల చేతులనుండి భారత వారసత్వాన్ని, ఆధ్యాత్మిక వారసత్వాన్ని అన్ని కోణాల్లోనూ ధ్వంసం చేసే వారి చేతుల్లోకి పాలనాపగ్గాలు ఎలా వచ్చాయి? ఇందుకు కారణం 1947 స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశపరిపాలనా పగ్గాలు చేపట్టిన వ్యక్తులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోవడమే. అందుకే భారతావని అన్ని కోణాల్లోనూ ఘోరంగా దెబ్బతిన్నది.

కావున బాధ్యతాయుత పౌరునిగా, విద్యార్థులుగా, యువకులుగా మనం ముందుకు వచ్చి, నైతికపరమైన అరాచకాన్ని రూపుమాపి, ఆధ్యాత్మిక లక్షణాలను, ఆదర్శ భావజాల వ్యాప్తికి భారత్‌ను విశ్వగురుస్థానంలో నిలబెట్టి శ్రీ అరవిందుల ఆశయాలను నిజం చేయడానికి ముందుకు కదులుదాం. రండి...

స్వామీజీ, వివేకులు కలలుగన్న భారతం...
గతవైభవ శిఖరాలనంచుదాక చేర్చుదాం...
ఇహపరాలతో కూడిన జీవనమే మన లక్ష్యం...
ఆ లక్ష్యమే చేరుదాక ఆగకుండా సాగుదాం...
జై విద్య! జై సంస్కృతి!! జై భారతమాత!!!

**– ఎ. శ్రీనాథరావ్**
బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

# తీయనైన బాధ (కథ)

జీవితంలో ప్రతివ్యక్తికీ ఒక్కసారైనా హృదయంలో భావాలు కలుగుతాయి అంటే అతిశయోక్తి కాదు. ఒక్కసారైనా ప్రేమించకుండా ఉండలేరు. నేను కూడా దీనికి మినహాయింపు కాదు. నా ప్రేమను వివరించే చిన్ని ప్రయత్నాన్ని స్వాగతించినందుకు ధన్యవాదాలు.

టైమ్ ఎనిమిది గంటలు దాటింది. ఇంకో గంటలో నేను ఆశ్రమం దగ్గరుండాలి. సుచి నాకోసం ఉదయాన్నుంచే ఏర్పాట్లు చేస్తుంది. కారు కోసం వెయిట్ చేస్తున్నాను. కింద నుంచి హారన్ వినపడింది. సుచి లోపలి గదిలో ఏదో పనిచేస్తుంది. సుచీ... కారొచ్చింది నే వెళ్తున్నాను అని తన కోసం చూడకుండా బయటకి వచ్చేశాను. కారు విండోలోంచి బయటికి చూశాను. సుచి బాల్కనీలోంచి చేయి ఊపుతూ కనుమరుగైంది.

కారు హాయిగా సాగిపోతుంది. నాకు తెలీకుండానే కళ్ళు మూతలు పడ్డాయి.

జీవితం, ప్రేమ, గోల్ వంటి పెద్ద పెద్ద మాటలేవి తెలియని అప్పుడే పూచిన మల్లెల్లాంటి మనసులు. నా ఇంటర్మీడియట్ క్లాసులు మొదలై ఇరవై రోజులు దాటింది. ఓరోజు అనుకోకుండా సుచి పరిచయమైంది. రేపు ఎగ్జామ్ ఉందంట కదా చెప్పనే లేదు. సీరియస్‌గా నోట్స్ రాస్కుంటున్న తన గొంతు వినబడటంతో వెనక్కి చూశాను. ఈ అమ్మాయి జాయినై రెండ్రోజులే అయింది. తనని గుర్తుపట్టాను. కానీ పేరు తెలీదు. ఏంటీ మళ్ళీచెప్పండి అన్నాను. హాయ్! నేను "సుచిత్ర" పేరు చెప్పింది. అదే తనతో తొలి పరిచయం. కానీ ఆ క్షణంలో నాకు తెలీదు తను నా జీవితంలోకి రాబోతోందని. సుచి చలాకీగా అనుకువగా ఉండేది. తక్కువ టైంలోనే మంచి ఫ్రెండ్సయ్యాం. నోట్స్, ఫ్రెండ్స్, కాలేజ్, ఎగ్జామ్స్ తప్ప మరే విషయాలు మా మధ్య వచ్చేవి కావు.

క్లాసులో ఎంటరౌతూనే నా కళ్ళు తనకోసం వెతికేవి. తను రానిరోజు వెలితిగా అన్పించేది. రెండుసార్లు మా ఇంటికి తీస్కెళ్లాను. తను కూడా వాళ్ళ పేరెంట్స్‌కి నన్ను పరిచయం చేసింది. ఎంతమంది ఫ్రెండ్స్ ఉన్నా తను స్పెషల్‌గా కన్పించేది. ఇంటర్మీడియట్ మొత్తం గడిచేసరికి ఇద్దరం బెస్ట్ ఫ్రెండ్సయ్యాం. అప్పుడప్పుడూ సెల్‌ఫోన్ కబుర్లు కూడా జరిగేవి. ఇంటర్ తర్వాత డిగ్రీ నేను హైదరాబాద్‌లో జాయినయ్యాను. ఊరెళ్ళినప్పుడల్లా తనని కలుస్తూండేవాన్ని. ఇన్నేళ్ళ స్నేహంలో మా మధ్య ప్రేమ ఉందని నాకు అనిపించనేలేదు. కానీ తను నన్ను ప్రత్యేకంగా చూడటం నాకు నచ్చింది. బహుశా అదేనేమో నన్ను ఆకర్షింపచేసింది.

... సర్ ఆశ్రమానికొచ్చేశాం. డ్రైవర్ పిలవడంతో కళ్ళు తెరిచాను. ఆశ్రమం నాకు కొత్తకాదు. ప్రతీవారం ఇక్కడకొస్తాను. ఇప్పుడందరూ ప్రార్థనలో ఉంటారు. ఇంకో అరగంట తర్వాతే కలవడానికి వీలవుతుందని రిసెప్షనిస్ట్ చెప్పింది. వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నాను. ఇక్కడికి నేనొచ్చింది అఖిల్‌ను కలవడానికి. ఇంటర్‌నుండి నా వన్ అండ్ ఓన్లీ బెస్ట్ ఫ్రెండ్.

అఖిల్ నాకంటే రెండేళ్ళు సీనియర్. మా బ్యాచ్‌లో రీ అడ్మిషన్ అయ్యాడు. వాడికి కాలేజ్‌లో అందరితో మంచి పరిచయాలుండేవి. మొదట్లో పరిచయాలకోసం వాడితో ఉండేవాన్ని. అటు తర్వాత కూడా వాడితోనే ఉన్నాను. తొందర్లోనే మా స్నేహం ముదిరింది.

అఖిల్ మా క్లాస్‌మేట్ పూజితను ఇష్టపడేవాడు. మొదట్లో నాకు విషయం తెలియనివ్వలేదు. కానీ నాదగ్గర దాచలేకపోయాడు. పూజితతో క్లాస్‌లో మాట్లాడ్డానికి ట్రై చేయడం కాలేజ్ వదిలిన తర్వాత తనని ఫాలో అవ్వడం, తనతో వెరైటీగా ప్రవర్తించడం వల్ల పూజితకు విషయం తెలిసిపోయింది. సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది. కొన్నాళ్ళు వీడు కామ్‌గా ఉన్నా మళ్ళీ కథ మొదటికొచ్చింది.

ఈసారి సీరియస్‌గా, సిన్సియర్‌గా ట్రై చేశాడు. పూజితకు ఇవన్నీ తెలిసినా ఏమీ అనేది కాదు. అలా కామ్‌గా ఎందుకుందో నాకూ తెలీలేదు. కానీ తొందర్లోనే మావాడు అమ్మాయిని పడేశాడని అర్థమైపోయింది. రెండు సంవత్సరాల్లో ప్రేమ బాగానే ముదిరిపోయింది. ఇంటర్ తర్వాత డిగ్రీ వాడు ఊళ్ళోనే జాయినయ్యాడు. వీలున్నప్పుడల్లా అఖిల్ పూజితను కాలేజ్‌లో కలిసి వచ్చేవాడు. వాడికి పూజితకు మధ్య జరిగే అన్ని విషయాలు రోజూ నాకు చెప్పేవాడు. వాడు పూజితను ఎంతగా అభిమానిస్తాడో నన్ను కూడా అంతకంటే ఎక్కువే ట్రీట్ చేసేవాడు.

డిగ్రీ తర్వాత అఖిల్ వాళ్ళమ్మ వీడికి పెళ్ళి చేయాలనుకున్నారు. ఎన్ని కారణాలు చెప్పి దాటేసినా పట్టుబట్టి ఎంగేజ్‌మెంట్ చేసేశారు. తర్వాత కొన్నాళ్ళకే పెళ్ళికూడా చేసేశారు. పాపం. అఖిల్ అమ్మకు ప్రేమ విషయం చెప్పలేకపోయాడు. అలాగని తన భార్యను పూజితగా అంగీకరించలేకపోయాడు. పెళ్ళి తర్వాత పూజిత కనుమరుగైంది. కానీ వీడు తేరుకోలేకపోయాడు. పెళ్ళి జరిగి రెండేళ్ళయినా భార్యతో ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయాడు. యాంత్రికంగా తయారయ్యాడు. ఇవన్నీ నాకు తెలిసినా కొన్ని విషయాలు మాత్రం నాకు తర్వాత తెలిశాయి. అనుకోకుండా వాడినుంచి నాకు లెటర్

వచ్చింది. ఫోన్ చేయొచ్చుకదా లెటర్ ఎందుకనుకున్నాను. కానీ వాడు నాతో మాట్లాడలేకపోయాడని లెటర్ చదివాక తెలిసింది.

లెటర్ మొత్తం భారంగా సాగింది. ప్రేమ విషయం అమ్మకు చెప్పనందుకు బాధపడ్డాడు. ఏడ్చాడు. తనని తాను అసహ్యించుకున్నాడు. ప్రేమించిన అమ్మాయిని పొందలేక, భార్యను ప్రేమించలేక నరకం అనుభవించాడు. కానీ ఎప్పుడూ బయటపెట్టలేదు. లెటర్ రాకపోతే నాకు ఇదంతా తెలిసేది కాదు. ఈ ఆలోచనలతో వాడి శరీరం సహకరించింది కాని మెదడు సహకరించలేదు. మానసికంగా కృంగిపోయాడు. ఎప్పుడూ ఒంటరిగా ఉండేవాడు. చికిత్సకోసం ఆశ్రమంలో చేర్పించాల్సి వచ్చింది. ఇక్కడికొచ్చాక వాడి పరిస్థితిలో మార్పు లేదు కాని ప్రశాంతంగా ఉండగల్గుతున్నాడు.

ఇన్ని సంఘటనల వల్ల మొదటిసారి నేను సుచి విషయంలో ఆలోచించాల్సి వచ్చింది. ఎన్ని సంవత్సరాలు తను నా ఫ్రెండ్‌గా ఉన్నా తను వేరొకరికి భార్య అయితే అన్న ఊహను నా మనసు అంగీకరించలేకపోయింది. తను లేకుండా ఉండలేను అన్పించింది. టైమ్ వేస్ట్ చేయాలన్పించలేదు. వెంటనే ఊరెళ్ళాను. వాళ్ళ నాన్నతో కొంచెం పరిచయముంది. కానీ ప్రేమ విషయం మాట్లాడేంత కాదు. ధైర్యం కావట్లేదు. అలాగని తనని వదులుకోలేను. నా ప్రేమ మీద నమ్మకముంది. ఆ నమ్మకమే వాళ్ళ నాన్నతో మాట్లాడించింది. నాకోసం కాదు కానీ తన కూతురి సంతోషం కోసం ఒప్పుకున్నారాయన. కానీ సుచికి నాపట్ల ఏ అభిప్రాయముందో తెలీదు. నాకున్న ఒకే ఒక్క అవకాశం. సుచికి ప్రేమిస్తున్నానని చెప్పలేదు. పెళ్ళి చేసుకుందాం అన్నాను. తనపై నాకున్న ప్రేమ, అభిమానం, గౌరవం కొత్తగా చెప్పాల్సిన అవసరంలేదు. తను పాజిటివ్‌గా రియాక్టయ్యింది. మా వాళ్ళు నా నిర్ణయాన్ని గౌరవించారు. ఇప్పుడు హ్యాపీగా ఉన్నాను. బయట ఇన్ని మార్పులు జరిగినా అఖిల్ మాత్రం ఇంకా వాడిలోకంలోనే ఉన్నాడు. ఇదే మాకు తీరని నిర్వేదం. నా ఈ సంతోషానికి కారణం ముమ్మాటికీ అఖిల్...! ఔను అఖిలే...!

ప్రార్థన అయిపోయింది. మీరు వెళ్ళొచ్చు. రిసెప్షనిస్ట్ చెప్పి వెళ్ళిపోయింది. అఖిల్ గదికెళ్ళాను. కొన్నేళ్ళుగా నేను చూస్తున్నదే. ఒంటరిగా కూర్చుని శూన్యంలోకి చూస్తుంటాడు. ఎప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడడు. ముఖంలో బాధ, నిర్వేదం తప్ప మరోటి గమనించలేదు. వాడిని జాగ్రత్తగా చూస్కోవడం తప్ప మానసికంగా మామూలు చేయలేకపోయాను. కానీ వాడి బాగుకోసం రోజూ దేవుణ్ణి వేడుతున్నాను. నాకు నమ్మకముంది వాడు తిరిగి కోలుకుంటాడు. ఆ నమ్మకమే ఇప్పటికీ నన్ను నడిపిస్తుంది. అఖిల్ త్వరగా కోలుకోవాలని కోరుతూ గది నుండి బయటికి నడిచాను...

**– కస. రమేష్**

బి.కాం. ద్వితీయ సంవత్సరం

## పరిపాలనా ప్రభుత్వం

కరిగిపోయే కాలమా కాసేపు ఆగుమా
నా మనస్సు పడే బాధని వినుమా
నీతిలేని జాతి నిజాయితీయే భ్రాంతి
అక్రమార్కులకు ఆస్తి మాకేమో పస్తి
ప్రాణంలేని పాలన
పరిపాలనే నటన
ఆపలేని ప్రభుత్వం అంతులేని నల్లధనం
మాకేది ఉపకార వేతనం
పేరున్న నాయకుడు
ప్రజల ధన భక్షకుడు
కోట్లు గణించే జాతి సంపద
కుంభకోణాలతో శూన్యమవదా
కాలం కడుపులో కలిసినా బాగుండు
కానరాని లోకానికెళ్లినా బాగుండు
ఈ అవినీతి అంటువ్యాధి సోకిన అక్రమార్కులతో
పోరాడి రాజీపడే బదులు
ఆపగలవా ఈ ఆపలేని విపత్తు
ముందు తరానికి చూపడమే నీ వంతు
–"గెలవాలన్న ఆరాటంతో పోరాడు
అలసిపోక పోరాడు
ఆఖరిదాక పోరాడితేనే
అంతిమ విజయం నీదవుతుంది
ఆఖరికి ఓటమి కూడా గెలుపవుతుంది."

**– బి. శివ**

బి.ఎస్.సి. (ఎం.పి.సి.) ద్వితీయసంవత్సరం

# తెలుగు భాషకు వందనం

తేట తేట తేనెలొలుకు
తెలుగుకు వందనం
మాతృభాషకు యీ నా
అక్షరమాలతో చేస్తున్నా
పాదాభివందనం.
కన్నతల్లి ఒడిలో
నేర్చుకున్న తొలిపలుకుకు వందనం
తెలుగుతల్లి ఒడిలో
నేర్చుకున్న సంస్కృతికి వందనం.
బాల్యదశలో వున్న
మాతృభాషకు నడక నేర్పిన
నన్నయ నా కుసుమాభివందనం.
తెలుగు భాషకు వన్నెలద్దిన,
సాహిత్యాన్ని తీర్చిదిద్దిన
రాయలకు చేయు నా హృదయాభివందనం.
తెలుగు సంకీర్తనలతో
వెంకన్నను మురిపించిన
అన్నమయ్యకు చేయు గానాభివందనం.
కలములు చేతబట్టి
మాతృభాషకు చీరకట్టిన
నా తెలుగు కవులకు
చేయు పద్మాభివందనం.
స్వచ్ఛమైన మాతృభాషకు
నా తెలుగు పదాలతో చేయు
తెలుగు పదాభివందనం.

**– ఎం. బాలశంకర్**

బి.ఎస్.సి. (బి.జడ్.సి.) ద్వితీయ సంవత్సరం

# నా కవిత

1. కలల అలజడిలో కదిలే బొమ్మవై
నా చిరు స్వప్నంలో మెరిసే తారవై
నా జీవితంలో నను నిదుర లేపిన వేగుచుక్కవై
నా జీవితంలోకి ఆహ్వానిస్తూ నీ ప్రియుడు...
2. అందమా ఓ నా ఆనందమా
తరిగిపోని నీ అందానికి విడిపోయే పువ్వ?
అందుకే నీవు కోరితే నీ కోసం మరణించి
పరిమళాలు వెదజల్లుతూ,
ఎన్నడు వాడిపోని పువ్వుగా పుట్టుకువస్తా.
ప్రేమగా నన్ను స్వీకరించలేదు
పువ్వుగానైనా నన్ను చేరనీయవా....
3. ఆనందం పంచే నీ అందం
అభిరుచిని మరిపించే నీ మాటలు
మరిచిపోలేని నీ జ్ఞాపకాలు
మధురం మధురాతి మధురం
మరువలేను నీవు నా ఎదురుగా వుంటే...

**– ఎల్. విజయ్ కుమార్**

బి.ఎ. (ఇ.పి.పి.) ప్రథమ సంవత్సరం

# గాలిలోని గానమా

మనస్సులోని మౌనమా
గుండెలోని భావమా
గొంతులోని రాగమా
నా జీవితంలోని ఓ ప్రాణమా!!
కలగా ఉన్నా నా జీవితంలోకి
వరంలా వచ్చి నాకు కలవరాన్ని
మిగిల్చిన ఓ మౌనరాగమా. నా జీవితంలో
మళ్ళీ ఎప్పుడు ఉదయిస్తావు!!

**– సిహెచ్. కిరణ్ కుమార్**

బి.కాం. ద్వితీయసంవత్సరం

## చెలిమి

కలిమి లేమిల కలయిక చెలిమి
బ్రతుకు భవితకు బాటనే చెలిమి
మరువలేను నేస్తమా...
మరుపురాని ప్రాణమా...
కన్నీళ్ల కష్టాలకు అండగున్నవు
నా ఇష్టాన్ని కష్టమైన తోడుగున్నవు
ఎండల్లో గొడుగువలె నీడగున్నవు
నా కంటికి రెప్పలే కాపుగున్నవు
నువ్వు తోడు ఉంటే కొండంత గుండె ధైర్యం...
అమ్మతోడు నువ్వే నా ఆత్మ బంధము...
"మరువలేను నేస్తమా..."
"మరుపురాని ప్రాణమా..."
ఆకలైతే కంచములో అన్నమైనవు
ఆపదలో ఆదుకునే అన్నవైనవు...
మన జీవితాన ఒయాసిస్సువు
చీకటి మన బ్రతుకుల్లో ఉషస్సువు...
ముదముతోని మిత్రమా ఎదలో ఉంచితి...
ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే ఆప్తమిత్రమా...
"మరువలేను నేస్తమా....
మరుపురాని ప్రాణమా..."
కదిలేటి కాలంలో జాప్యం లేదు
చూపే నీ స్నేహంలో లోపంలేదు
చిరకాలం మన స్నేహం చిగురించాలి
కన్ను మూసేంత వరకు కదిలించాలి.
కల్మషము లేనట్టి కరుణ హృదయం
నిమిషమైన మరువనట్టిది నీ స్నేహం
"మరువలేను నేస్తమా...
మరపురాని ప్రాణమా..."

**– ఎ. శ్రీను (దరువు)**
బి.ఎస్.సి. (ఎం.ఇ.సి.ఎస్.) ద్వితీయసంవత్సరం

***తనలో లేని గుణాలు వున్నాయని చూపించుకోవడానికి ప్రతివ్యక్తి తన జీవితంలో కొంత సమయాన్ని వ్యర్థం చేసుకుంటాడు. – జాన్సన్***

* మంచి టీచరు బోధపరుస్తాడు.
  ప్రతిభగల టీచరు చాకచక్యంగా అన్నీ చేసి చూపుతూ హావభావాలతో విద్యార్థులను ఆకర్షిస్తారు.
  గొప్ప టీచరు విద్యార్థులకు స్పందన కల్గిస్తారు.
* మీరు ఉన్నతంగా ఎదగటానికి మీకు ప్రపంచం కావాలి.
  మీరు ఎదిగాక, ప్రపంచానికి మీరు కావాలి. అందుకే ప్రపంచం మీకోసం ఎదురు చూసేలా ఎదగాలి.
* డబ్బులేకున్నా సంతృప్తికరమైన పనులతో జీవించవచ్చు. కాని డబ్బు ఉన్నా సంతృప్తి లేకుంటే జీవించడం కష్టం.
* తరువాత ఏమి చేయాలో చెప్పేది విజ్ఞానం. అది ఎలా చేయాలో తెలిపేది బుద్ధికుశలత. అలా చేయగలగడం ప్రజ్ఞ.
* అందరూ నిన్ను అనుమానిస్తున్నప్పుడు వినయంగా వుండటం మంచిది కాదు.
  అందరూ ప్రశంసిస్తున్నప్పుడు వినయంగా వుండటం మాత్రం అరుదైన అవకాశం.
* ఆనందం రానివ్వు, పోనివ్వు, కాని అదిలేకుండా జీవించడానికి నువ్వు సిద్ధం కావాలి."
* "కలలు కనేవారికి గుండెధైర్యం మెండుగా వుండాలి. కలలు తీరం చేరాలంటే నిప్పుల బాటలో నడవాలి మరి."
* మాట్లాడవలసిన చోట మౌనంగా వుండటం, మౌనంగా వుండవలసిన చోట మాట్లాడటం రెండు తప్పే.
* కలకాలం వీడని బంధం
  కరిగిపోని మధుర సుగంధం
  మదిమదిలో మెదిలే నాదం
  ఎద ఎదను పిలిచే మురళిగానం యీ స్నేహం.
* కనిపించే మనుషులకన్న
  సువాసన కురిపించే పుష్పాలకన్న
  ఆకర్షించే అందాల కన్న
  జ్ఞానాన్ని పెంచే చదువుమిన్న

**– సేకరణ : వి. సృజన్**
ఎం.ఎస్.సి. (భౌతికశాస్త్రం) ద్వితీయసంవత్సరం.

# పోరాటం ముద్దు, బలిదానం వద్దు

కుల, మత, భాష, లింగ, వయో భేదాలు లేకుండా ఆనందంగా, సంతోషంగా ఎవరి పని వారు చేసుకుంటున్నాం. ఇంతకి మాదేదో ఉమ్మడి కుటుంబమో లేక అనాథ శరణాలయమో కాదు. అతి విశాలమైన స్థలం, మైదానం, నిజాం కట్టడాలు, బాస్కెట్‌బాల్ గ్రౌండ్, కాంటీన్, వేలల్లో విద్యార్థులు, నిష్ణాతులైన లెక్చరర్లు, సిటీ సెంటర్‌లో కాలేజీ, అందుకే ఎంతోమంది మా కాలేజీలో చదివే అవకాశం కోసం ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది మాది నిజాం కాలేజీ అని.

ఇక కట్‌చేస్తే అంటే స్టోరీని ఓపెన్ చేస్తే

కాంటిన్ దగ్గర బ్యాచులు బ్యాచులుగా కూర్చున్నారు, క్లాస్‌లకు వెళ్ళని ది గ్రేట్ స్టూడెంట్ బ్యాచ్.

**విద్యార్థి :** ఒరేయ్ డిసెంబరు నుంచి సెమిస్టర్ ఎగ్జామ్స్ కదరా. నీ దగ్గర నోట్స్ ఉంటే ఇవ్వవా. ఈ రోజు నైట్ అవుట్ చేస్తాను.

(ఇదంతా పక్కన కూర్చున్న ఎగ్ పఫ్ఫ్ లాగిస్తున్న ఇంకో విద్యార్థి బృందంలోని భాస్కర్ విని)

**భాస్కర్ :** అరే మామ మనకి కనీసం నోట్స్ తీసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. ఒరేయ్ నీ దగ్గర ఉందా?

**చందు :** హా.... హ.. హ్హా.. ఏంటిరా అరటిపండు ఒలిచి బత్తాయి తిన్నట్టు. ఆ... అర్థం లేని మాటలు.

**నలిని :** అబ్బ... బ్బా నోట్స్ లేదు సరికదా! పైనుంచి పిచ్చి పిచ్చి సామెతలు ఒకటి.

**చందు :** అది సర్లేకాని నలిని నీదగ్గర అయినా ఉందా?

**నలిని :** (కోపంగా చందు తింటున్న ఎగ్ పఫ్ఫ్ లాక్కొని) కడుపుకు ఎగ్ పఫ్ఫ్ తింటున్నావా? చికెన్ పఫ్ఫ్ తింటున్నావా? (అని చిన్నగా నవ్వి, ఆ పఫ్ఫ్ కూడా లాగించేసింది. నలిని కూడా రాయలేదని అర్థమై అందరు నవ్వారు.)

**విశ్వ :** హ.హ. హే నేను వెళ్ళి రాజుని అడిగొస్తనుండు. (అని రాజుని వెతుకుతు లైబ్రరి మెట్లపై డల్‌గా కూర్చున్న రాజును చూసి, దగ్గరికి వెళ్ళి)

**విశ్వ :** రాజు...! ఏంటి? డల్‌గా ఉన్నావు?

**రాజు :** ఏంలేదు. ... (కొంచెంసేపు మౌనంగా ఉండి) అవును మన తెలంగాణా వస్తుందంటావా?

**విశ్వ :** ఒరేయి ఎందుకురా? నీకు ఆ అనుమానం? అయినా సెమిస్టర్ ఎగ్జామ్స్ వస్తున్నాయి. ముందు దాని గురించి ఆలోచించు.

**విశ్వ :** అది సర్లేగాని, నీ దగ్గర హిస్టరీ నోట్స్ ఉంటే ఇవ్వవా. (టక్కున ఏదో గుర్తుకు వచ్చినవాడిలా నవ్వి) అయినా నీ దగ్గర ఉండకపోవడం ఏంటి, సిన్సియర్ & రెగ్యులర్ స్టూడెండ్‌వి కదా!

**రాజు :** అవును (బాధగా) ఇదిగో (అంటూ నోట్స్ ఇచ్చిన తర్వాత) మన తెలంగాణా వస్తుందంటావా? (అని మళ్ళీ అడిగాడు)

**విశ్వ :** (సమాధానం చెప్పకుండానే) థ్యాంక్స్ రా కాపీ చేసుకొని ఇస్తాను. (అని నోట్స్ తిరగేస్తూ వెళ్తున్న అతనికి అందులో అంతకు ముందే రాజు రాసుకున్న సుసైడ్ లెటర్ చదివి నిర్ఘాంతపోయాడు. రాజుని నిలదీసి అడుగుదాం అనుకుంటాడు. కాని అలా చేయడం వల్ల లాభం లేదని ఆలోచిస్తూ తిరిగి ఆ లెటర్ని అందులో పెట్టగానే, రాజు కంగారుగా ఉరికి వచ్చి నోట్‌బుక్‌ని లాక్కొని లెటర్‌ని తీసుకొని నోట్స్ తిరిగి విశ్వ చేతిలో పెట్టి హడావిడిగా)

**రాజు :** వస్తాను రా క్లాస్‌కి టైమ్ అయింది.

(విశ్వకి ఏమి మాట్లాడాలో తెలియక అలాగే చూస్తూ... రాజుకి అనుమానం రాకూడదని చిన్నగా నవ్వి)

**విశ్వ :** ఏంటి లవ్ లెటరా?

(రాజు వైరాగ్యంగా హూం... అని నిట్టూర్చి, బాధగా వెళ్ళిపోతాడు.)

**మరుసటి దినం**

విశ్వ & అతని స్నేహితులు రాజు దగ్గరికి వెళ్ళి.

**భాస్కర్ :** మేము క్యాంపస్‌కు వెళుతున్నాము. నువ్వు వస్తావా?

**రాజు :** ఎందుకు

**చందు :** మొన్న సుసైడ్ చేసుకున్న యాదయ్య స్నేహితుడు అలీని కలవడానికి వెళుతున్నాము.

**రాజు :** సరే వస్తాను.

మన హైదరాబాదు సిటీ, మెట్రోసిటి అయిన తర్వాత కోల్పోయిన

ప్రకృతి అందాలు అన్నీ సిటీ సెంటర్‌లో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో కనిపిస్తాయి. గుబురుగుబురు చెట్లు, కిలకిల రాగాలు తీస్తూ పిచ్చుకలు, అందమైన నిజాం కట్టడం అయిన ఆర్ట్స్ కాలేజీపైన శ్రద్ధగా క్లాసులు వింటున్న పావురాలు, ఫ్రెండ్స్ వస్తే సినిమాకి రాకపోతే క్లాసుకి వెళ్దాం అని బస్సుస్టాఫ్‌లో ఎదురుచూస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు. ట్రాఫిక్ జాం తక్కువున్న క్యాంపస్ రోడ్లపై రయి.... రయి... మంటూ వెళ్తున్నారు విశ్వ & గ్యాంగ్.

**రాజు :** ఎందుకు వెళ్తున్నారు.

**చందు :** పాపం వాడి స్నేహితుడు చనిపోయాక పలకరించలేదు. అందుకే.

టాగూర్ ఆడిటోరియం ఎదురుగ ఉన్న ల్యాండ్‌స్కేప్ గార్డెన్ ముందు బండి పార్క్‌చేసి లోపలికివెళ్ళి, పార్క్‌లో ఓ మూల చెట్టుకింద ఒంటరిగా కూర్చున్న అలీని చూసి దగ్గరికి వెళ్ళి ఆప్యాయంగా హత్తుకొని, ఆ ప్రక్కనే ఉన్న బెంచ్‌పై కూర్చుంటారు.

**చందు :** అసలు ఎలా జరిగిందిరా, ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుండేవాడు. ఇలా సడెన్‌గా...

**అలీ :** (బాధగా) పాపం చాలా పేదవాడు రా, ఇలా క్షణికావేశంతో ప్చ్...

**నళిని :** అయినా ఎడ్యుకేటెడ్ అయివుండి, ఇలా ఫూలిష్‌గా ఆత్మహత్య చేసుకున్నాడు.

**అలీ :** ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గొన్నాడు. కానీ రేపు, మాపు అంటుంటే ఇక వస్తుందో లేదో అని భయపడి, వాడి మరణంతోనైనా తెలంగాణా తేవాలి అని అనుకున్నాడు. అందుకే (అంటూ ఏడ్చాడు...)

**చందు :** ఊరుకోరా... (అని తన కళ్ళలో వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ) ఊరుకో (అని భుజం తట్టాడు).

**అలీ :** (కళ్ళు తుడుచుకుంటూ) లేదురా వాడు లేనిలోటు తీరనిది క్లాసులో, కాలేజీలో, రూం.. అసలు నా లైఫ్‌లోనే వాడిని మిస్ అయ్యాను అని తలుచుకుంటేనే బాధగా ఉందిరా. నా సంగతి వదిలేయి. పాపం వాడి అమ్మా నాన్నలని తలుచుకుంటే ఇంకా బాధేస్తుంది. వాడిది మా ఊరే. మా ఇంటిపక్కనే వాడి ఇల్లు. చిన్నప్పట్నుంచి కలిసి పెరిగాం, తిరిగాం. వాడి నాన్న పెద్ద వ్యవసాయదారుడు. కాని వాడి చిన్నప్పుడే నీళ్ళులేక పొలం బీడుబడి పోవడంతో ఆర్థికంగా బాగా చిక్కిపోయారు. వాళ్ళ అమ్మకి పురిటి ఖర్చులకు కూడా డబ్బులు లేకపోతే వాళ్ళ నాన్న కిడ్నీ అమ్మి, ఆ డబ్బుతో హాస్పిటల్ పైసలు కట్టి వాడిని కన్నారు. వాడిని అల్లారుముద్దుగా కంటికి రెప్పలా, ఎన్నో నోముల ఫలితంగా పుట్టిన బిడ్డ అంటూ, వాడే వారి ఆశగా, జీవితంగా బ్రతికారు. ఎన్నో కష్టాలు పడ్డారు కాని ఆ కష్టాన్నంతా వాడిని చూస్తూ మర్చిపోయారు. "మేము ఎంత కష్టపడ్డా మా బిడ్డకోసమే కదా" అనేది వాళ్ళ అమ్మ. వాడి తల్లి పాచిపనిచేస్తూ, వాళ్ళ నాన్న కూలికి వెళ్తూ వాడిని చదివిస్తున్నారు. ఎన్నో సార్లు వాడు పనిచేస్తాను మీరు ఇంకెన్నేళ్లు నా కోసం కష్టపడతారు అంటే వద్దు బిడ్డా అనేవాళ్ళు. మా కొడుకు పై చదువులు చదవాలి, దొరలాగ బ్రతకాలి అయ్యా" అని ఎన్నోసార్లు వాళ్ల నాన్న నాకు చెప్తే "మీరు చూస్తూ ఉండండి వాడు చాల పైకి ఎదుగుతాడు, ఈ ఏడాది యూనివర్సిటీ టాప్ టెన్, వచ్చే ఏడాది యూనివర్సిటీ ఫస్ట్ వస్తాడు, మంచి ఉద్యోగం వస్తుంది, మీ కష్టం ఊరికే పోదు" అన్నాను. వాడు కూడా ఎన్నోసార్లు నాతో "మా అమ్మకి నేనంటే ప్రాణం. ఎప్పుడు నాగురించే ఆలోచిస్తూ ఆమె ఆరోగ్యం సంగతే మర్చిపోయింది. అమ్మని కళ్ళ ఆసుపత్రిలో చూపించాలి. నాన్నకి మోకాళ్ళ నొప్పులు చూపించాలి. అమ్మానాన్నల్ని బాగా చూసుకోవాలి" అనేవాడు. అలాంటి వాడు తొందరపాటు తనంతో ఇలాంటి నిర్ణయం తీసుకుని, సరిదిద్దుకోలేని అతిపెద్ద తప్పు చేసాడు. (కళ్లనీళ్లని తుడుచుకుంటూ, నిబ్బరంగా) నీకు తెలుసా వాడు చనిపోయాడు అన్న వార్త వినగానే వాడి అమ్మ పిచ్చిది అయింది. మొన్ననే మానసిక వైద్యశాలలో వేసాము. (అని ఒక్కసారిగా వెక్కి వెక్కి ఏడుస్తుంటే, అందరు కలిసి ఓదార్చారు.)

ఈరోజు ఆంటీని చూడటానికి ఆసుపత్రికి వెళ్ళాలి.

నళిని : మేము వస్తాము పద!

ఆసుపత్రికి వెళ్ళి కౌంటర్లో యాదయ్య తల్లి ఎల్లమ్మ రూం నెంబర్ కనుక్కొని, ఆంటీ ఉన్న గదిలోకి వెళ్ళారు. అక్కడ జట్టంతా విరబోసుకొని, మూడతబడ్డ బట్టలతో, ఒంట్లో ప్రాణం లేనంత బక్కగా ఏడ్చినట్టు కింద చారలు చాలా దీన పరిస్థితిలో ఉంది.

పక్కన ఎవరో ఉన్నట్టుగా "వదిన మా కొడుక్కి అరిసెలు అంటే ప్రాణం. అందుకే చేస్తున్న (నేల మీద అరిసెలు ఒత్తుతూ, గాల్లో వేసి కాలుస్తుంది). పాపం బిడ్డ సదువుతూంటే తిండి ధ్యాసే ఉండదు" అని ముఖం మీద పిచ్చిగా పడ్డ వెంట్రుకల్ని సిగవేస్తూ ఏవేవో కొడుకు గురించి తనలోతాను మాట్లాడుకుంటూ, చెబుతూ

పనిచేసుకుంటుంది. అందరు గుమ్మం దగ్గర నిల్చొని ఆమెని అలానే చూస్తూ నిలబడ్డారు.

**నర్సు :** జరగండి. (నర్సును చూడగానే భయంతో)

**ఎల్లమ్మ :** వద్దు... వద్దు (అని గట్టిగ అరుస్తూ) బిడ్డ నొప్పి పెడ్తుంది. సూది వద్దు (పిచ్చిపిచ్చిగా) కావాలంటే ఇదిగో ఓ అరిసె తీసుకో. (అని పక్కన ఉన్న గుడ్డముక్కను అరిసె అనుకొని నర్సు చేతిలో పెట్టింది. నర్సు సూది ఇవ్వడానికి ఆమె అసలు సహక రించట్లేదు. అప్పుడు అలీ కల్పించుకుంటూ)

**అలీ :** అమ్మ నువ్వు అలా సూది తీసుకోకపోతే యాదయ్య చాలా బాధపడతాడు. నిన్ను చూడడానికి రాడు.

**ఎల్లమ్మ :** గట్లన అయితే ఇయి బిడ్డ (అని నవ్వుతు సూది వేయించుకుంది. ఆ తల్లి ప్రేమను చూస్తూ అనుకోకుండానే వాళ్ళ అందరి కళ్ళు చెమ్మగిల్లాయి). ఇప్పుడు చెప్పు నా కొడుకు ఎప్పుడొస్తనన్నడు. (అనగానే అలీ కంట్లో నీళ్లు తిరిగాయి), నువ్వెట్ల గున్నావ్ అయ్యా?

(అలీ ఏమి మాట్లాడలేకపోతే నళినే కాస్తంత సమయమైన ఆమెని సంతోషపెట్టాలని అనుకొని)

**నళిని :** వస్తాడమ్మ తప్పకుండా వస్తాడు. పరీక్షలు అయిపోగానే వస్తాడు (అని ధైర్యంగా చెప్పినా యాదయ్య ఇంకా ఎప్పటికీ రాలేదని తెలిసి మనసులోనే బాధపడుతుంది).

ఎల్లమ్మ : నా కొడుకు బాగా చదువుతున్నాడా? పండక్కి రమ్మను, ఏలకి ఇంత బువ్వ తింటుండో లేదో" అని నన్ను కొడుకు యోగక్షేమాల గురించి అడుగుతుంటే (అందరి గుండెలు తరుక్కుపోయాయి. రాజుకు వాళ్ళ అమ్మ గుర్తుకు వచ్చి, మా అమ్మ ఇలాగే అయితే అన్న ఆలోచన రాగానే అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేక పోయాడు. ఇంకా నా కొడుకు వస్తాడు అని ఎదురుచూస్తున్న ఆ తల్లి ఆవేదన, ఆశ అన్ని కలలో అని తెలిసి అందరు మనసులోనే కుమిలిపోయారు. ఎల్లమ్మ మెల్లగా మత్తులోకి జారుకుంది. అందరు అక్కడి నుంచి బరువైన హృదయంతో బయటికి వచ్చారు.)

**వారం రోజుల తర్వాత**

రూంలో సుసైడ్ లెటర్‌పెట్టి, ఓ కాగితంలో జై తెలంగాణా అని రాసుకొని జేబులో పెట్టుకొని, దేవుడి పటానికి మొక్కుకొని, అందరితో కలిసి టిఫిన్ చేసి, అందరికంటే ముందుగానే కాలేజీకి వెళ్ళి బిల్డింగ్ మీదకి ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. కానీ మనసులో ఎన్నో రకాల ఆలోచనలు, అందరు గుర్తుకు వస్తున్నారు, అయోమయంగా బిల్డింగ్ చివరిదాకా వెళ్ళాడు.

**భాస్కర్ :** చావడానికి వచ్చావా?

(కంగారుగా వెనక్కి తిరిగి చూసాడు)

**చందు :** నీచావుతో తెలంగాణా వస్తుందా?

**రాజు :** (ఏడుస్తూ) వస్తుంది.

**విశ్వ :** వెళ్ళరా (వరుసగా చచ్చిన వాళ్ల పేర్లు చెబుతూ) వీళ్ళందరూ చచ్చినందుకు తెలంగాణ వచ్చిందా?

పోనీ ఇప్పుడు నువ్వు చస్తే వస్తుందా?

**రాజు :** లేదు నీకు తెలీదు, ఈ ఉద్యమం ఆగకూడదు అందుకే. (రాజు మాటని పూర్తి అవకుండానే, కోపంగా)

**విశ్వ :** ఒరేయి నీలాంటి వాళ్ళు చస్తే ఉద్యమం రాదురా, నీలాంటి వాళ్ళు బ్రతికి పోరాడితే వస్తుంది.

**భాస్కర్ :** అయినా నీ చావుతో వచ్చే తెలంగాణా మాకొద్దురా. (అని నిక్కచ్చిగా చెప్పాడు)

**నళిని :** (కన్వీనెన్స్‌గా) నువ్వే చూసావు కదా! యాదయ్య చనిపోతే వాళ్ళ అమ్మ ఎలా పిచ్చిది అయిపోయిందో, నువ్వు కూడా మీ అమ్మకి కడుపుశోకం మిగిలిద్దామనుకొన్నావా? ఆమె ప్రాణం పణంగా పెట్టి నీకు ప్రాణం పోసింది ఇందుకేనా, ఇలా నీ జీవితం అర్ధాంతరంగా ఆగిపోవడానికేనా? (రాజు మనసు కలుక్కుమంది.)

**విశ్వ :** తెలంగాణా రోషాల గడ్డరా. భిక్షం ఎత్తి అడుకున్నట్టు, చస్తానని బెదిరించి తెచ్చుకోవడం కాదు, పౌరుషంతో పోరాడి తెచ్చుకుందాం.

కొమరంభీం, చాకలి ఎల్లమ్మ, రాణి రుద్రమ్మ లాంటి మహామహులు పుట్టిన గడ్డరా ఇది. నీలా పిరికితనంగా ఆలోచించి ఉంటే వాళ్ళు ఈరోజు ఇలా ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచేవారు కాదు, ఎంతో మందికి మేలు జరిగి ఉండేది కాదు. కష్టాన్ని చూసి పిరికివారిలా తప్పించుకోకుండా పోరాడిన సమర యోధులు అందుకే చరిత్రలో నిలిచిపోయారు. కాని నీలా ఆత్మహత్య చేసుకోలేదు.

**చందు :** ఎలాగూ చనిపోవాలని నిర్ణయించుకున్నావ్ కదా, అలాంటప్పుడు నీ చివరి శ్వాస వరకు దర్జాగా పదిమంది చూసి గర్వించేలా పోరాడి చనిపో. ఇలా పిరికివాడిలా ఎవరికీ చెప్పకుండా దొంగచాటుగా చనిపోవడం ఎందుకు.

**విశ్వ :** (నిరుత్సాహంగా) నీలాంటి వాళ్ళు ఇలా చేయబట్టే డిసెంబరు వస్తుందంటే, ఊర్లో ఉన్న తల్లిదండ్రులు గుప్పిటితో గుండెను పట్టుకొని బ్రతుకుతున్నారు. (ఏడుస్తూ) సంక్రాంతికి కొత్త పంట వస్తుంది. కాని మా కొడుకు వస్తాడా, మా కూతురు వస్తుందా అని తెలియక "మాబిడ్డ క్షేమంగా ఉండాలని" రోజు దేవుడిని మొక్కుతున్నారు.

మాబిడ్డ ఇంజనీర్ అవుతాడు, డాక్టర్ అవుతారు అని దూరమైన, వారి ఆర్థిక స్థితికి భారమైనా ఇంత దూరం పంపించి చదివిస్తున్నారు. కాని ఇలా తిరిగిరాని లోకానికి, ఇంత దూరంగా వెళ్తే.... వాళ్ళు ఏమైపోతారు. ఒక్కసారైనా ఆలోచించావా? అక్క, చెల్లి, తమ్ముడు (దగ్గరికి వెళ్ళి భుజం మీద చేయివేసి) స్నేహితులం... మేము ఏమై పోతాంరా. (అని బాధగా అడిగి, ఒక్క క్షణం ఆగి) అయినా సమస్యలని పరిష్కార దశగా ఆలోచించాలి. కానీ సమస్యను సమస్యగానే వదిలేసి, మరో సమస్యకి కారణం అయ్యి, జీవితం మాకు దుఃఖాన్ని మిగిల్చేలా ఆలోచించవద్దు.

**చందు :** ప్లీజ్ రా. మా గురించి కూడా ఆలోచించండి (అని వేడుకోలుగా అడుగుతూ) దయచేసి నిన్ను అనాధ కాకుండా పెంచిన నీ తల్లిదండ్రులను అనాధలు చేసి వెళ్ళకురా. (రాజుకి యాదయ్య ఆత్మహత్య చేసుకోవడం వల్ల పిచ్చిది అయిన ఎల్లమ్మ, అలీ గుర్తుకు వచ్చి రేపు నేను ఆత్మహత్య చేసుకుంటే నా తల్లిదండ్రులు అనాధలవుతారు అని గుర్తుకువచ్చి, వాళ్ళు నా మీద పెట్టుకున్న ఆశలు అడియాశలవుతాయి. అవును వీళ్ళు చెప్పేది వాస్తవం అనుకొని)

**రాజు :** మీరు చెప్పేది నిజమే కాని (ఏడుస్తూ).. తెలంగాణా. (విశ్వ రాజు కన్నీళ్ళు తుడుస్తూ)

**విశ్వ :** కలిసి పోరాడదాం, దానికున్న ప్రతిబంధకాల్ని ఛేదిద్దాం. అయినా బ్రతికి సాధించలేనిది, చచ్చిపోయి ఎలా సాధిస్తం చెప్పు (అనగానే రాజు విశ్వాన్ని గట్టిగా హత్తుకొని, గుండెలోని భారం తీరిపోయేలా ఏడ్చి, అతను ఎంత పెద్ద తప్పు చేయబోయాడో తెలిసొచ్చి సిగ్గుతో తలదించుకున్నాడు).

**భాస్కర్ :** ఇప్పటికైనా నువ్వు మారినందుకు చాలా సంతోషంగా ఉంది. (అంటూ రాజులో వచ్చిన మార్పుకు అందరు ఆనందంతో ఒకరిని ఒకరు హత్తుకున్నారు) (నళిని, చందు, భాస్కర్ ఆ రోజు విశ్వకి రాజు సుసైడ్ లెటర్ చదివిన విషయం మాకు చెబితే, మేము వాడి అమ్మానాన్నలకు ఈ సంగతి చెబుదాం అంటే, వద్దని మమ్మల్ని వారించి)

....

**విశ్వ :** "అలా చేయడంవల్ల అనవసరంగా వాళ్ళు కంగారు పడతారు. కాలేజీ పంపరు. ఇంకెక్కడికి పంపించాలన్నా భయపడతారు. అయినా ఇరవై నాలుగు గంటలు కాపలాకాయడం కష్టం. ఆత్మహత్య చేసుకోవద్దు తప్పు అని వాడికి తెలిసి రావాలి. లేకపోతే ఎప్పుడు ఏం చేసేది ఎవరు చెప్పలేం. అసలు వాడిలో మార్పు రావాలంటే బిడ్డ చనిపోతే తల్లిదండ్రులు పడే వేదన, మనస్తాపం. మానసికంగా క్రుంగిపోయే బంధువుల, స్నేహితుల పరిస్థితి అర్థమయ్యేలా, యధార్థంగా చూపించాలి." (అని మాకు చెప్పి కావాలనే రాజుని ఆ రోజు క్యాంపస్‌కి తీసుకుపోయాడు.)

(అలా వాడిలో సరైన మార్పు తీసుకొచ్చాడు. "నీ ఆలోచన సరైంది విశ్వ. యు హేడ్ డన్ ఎ గుడ్ జాబ్" అన మనసులో అనుకొని విశ్వలాంటి వాడు స్నేహితుడు అయినందుకు గర్వంతో ముగ్గురు విశ్వకి సాల్యూట్ చేసారు.

## కొన్నిరోజుల తర్వాత

ఉద్యమం ఉధృతమైంది. అందరు తెలంగాణ ప్రజలంతా ఊరు ఊర నిరాహారదీక్షలు, రిలేలు, పెన్ డౌన్లు లాంటివి చేస్తూ నిరసన తెలియచేస్తూ, తెలంగాణా కోసం పోరాడుతున్నారు.

మాకాలేజీ కూడా తెలంగాణా బ్యానర్‌లతో, ముగ్గులతో, పాటలతో నిండిపోయింది. ఒకప్పుడు ఆత్మహత్య చేసుకుందామనుకున్న రాజు చురుకుగా ఉద్యమంలో పాల్గొంటూ, తెలంగాణా సాధన ఎలా సాధ్యమో, అసలు తెలంగాణా రాష్ట్రం ఎందుకు కావాలో ప్రజలకి అర్థమయ్యేలా అవగాహన కలిగిస్తూ, ప్రజలలో ఉన్న అవాస్తవపు అపోహలను పోగొట్టేలా ఉపన్యాసాలు ఇస్తూ, అతని ఉనికిని చాటుకుంటూ, ఇంకో పదిమందికి ఆదర్శప్రాయంగా నిలిచాడు.

నా ప్రియమైన విద్యార్థినీ విద్యార్థులు ఆత్మహత్యలు వద్దు... ప్లీజ్.

డు ఆర్ డై అన్నది కాలం చెల్లిన సామెత. డు అంటిల్ యు డై అన్నది ప్రస్తుత విధానం.

"లివ్ అండ్ లెట్ లివ్"

ఇంతకీ నేనెవరో చెప్పలేదు కదూ. నేను ఈ కథ రచయిత్రిని.

**– ఆర్. సుచరిత**

ఎం.ఎ. థియేటర్ ఆర్ట్స్ (ఫైనల్)

## గురువు

సంతృప్తే ఊపిరిగా భావించి
నిరాడంబరతే లక్షణంగా చేసుకొని
నేర్చుకోవడమే ఆయుధంగా అలవరుచుకొని
బోధించడమే లక్ష్యంగా ఎంచుకొని
శిష్యులు ఎదగడంలోనే ఆనందాన్ని అనుభవించి ఓ గురువా!
దేవునికి తీసిపోని శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందిన
వివేకం లేని విజ్ఞానం వ్యర్థమని
అనుభవాలనే ఆదర్శాలుగా మలచి
వ్యక్తిత్వమే పెట్టుబడి అని నేర్పించి
సమాజ శ్రేయస్సుకు పరోక్షంగా పాటుపడే
ఒక ఆదర్శమూర్తి అందుకే మా వందనాలు.
ఎదుగుతూనె ఒదిగి ఉండాలని చూపిస్తూ
దానం చేయడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటూ
నిష్కల్మషంతో నవయుగ నిర్మాణానికి నాంది పలుకుతూ
ఆస్తి, అంతస్థులను ఆశించని ప్రత్యక్ష దైవమా
మీకు యివే మా హృదయపూర్వక పాదాభివందనాలు.

**– వి. సృజన్**
ఎం.ఎస్.సి. (ఫిజిక్స్) ఫైనల్

## అమ్మా! నీకు వందనం

నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లికి వందనం
తన రక్తాన్ని పాలుగా మార్చి అమృతాన్నందించిన
అమ్మకు క్షీరాభివందనం
గోరుముద్దలు తినిపించిన అన్నపూర్ణమ్మకు అభివందనం
తన మాటల పాటలతో ఆడించి, లాలించిన
తల్లికి స్వరాభివందనం
తనకోసం కాకుండా మనకోసం బ్రతికే
మాతృమూర్తికి పుష్పాభివందనం
అన్నింటా వెన్నంటే ఉండే అమ్మ ప్రేమకు శతకోటి వందనం
ప్రతిక్షణం మనకై తపించే తల్లిప్రేమకు పాదాభివందనం...
అమ్మా నీకు వందనం
శతకోటి ఆనందబాష్పాల నీరాజనం...!

**– చిలుముల సతీష్**
బి.కాం. ద్వితీయసంవత్సరం

## ఓ నేస్తమా

ఓ నేస్తమా!
మరుపు రాని మధురానుభవాన్నిచ్చిన బంధమా!
స్నేహం అనే అనుబంధానికి నిలయంగా వున్న మిత్రమా
ప్రతిరోజు ఉదయించి పలకరించే నా స్వప్నమా!
అనుదినము పరితపించే తీయని మధురమా!
కష్టసుఖాలలో ఆదరణనిచ్చిన అభయహస్తమా!
సరస్వతి నిలయంలో మొలకెత్తిన మహావృక్షమా!
నీ జ్ఞానం అనే వెలుగుతో నాలోని చీకటిని తొలగించిన దీపమా!
ఆటపాటలలో అలరించిన ఉత్సాహ గానమా!
అన్నివేళలలో మార్గాన్ని చూపిన సుకుమారమా!
కఠినమైన హృదయానికి ప్రేమను పంచిన పవిత్ర బంధమా
కోపతాపాలలో జాలి కురిపించిన మహా మంత్రమా!
స్వచ్ఛమైన మనసుతో మందలించిన మహనీయమా!
హృదయపు వాకిట నిలచిన తీపి జ్ఞాపకమా!
మూడు వసంతాల పాటు నిలచిన ధైర్యమా!
మనస్సును దోచిన హృదయ స్పందనమా!
భగవంతుడు ప్రసాదించిన వరప్రసాదమా!
దేవుడు దీవించాలని నేను కోరిన మానవత్వమా!
మరవకుమా ఓ స్నేహమా!
విడువకుమా ఓ మిత్రమా! ఓ నేస్తమా!

**– డి. రమేష్**
బి.కాం. ద్వితీయసంవత్సరం

## అమ్మ ప్రేమ

పక్షులలో అందమయింది రామచిలుక అయితే
గానాలలో వినసొంపయింది కోయిల గానమయితే
నాట్యాలలో చూడచక్కనిది నెమలి నాట్యమయితే
పైరులలో చూడముచ్చటయింది వరిపైరు అయితే
పువ్వులలో గుమగుమలాడేది మొగలి పువ్వు అయితే
భాషలలో తీయనిది తెలుగుభాష అయితే
సంప్రదాయాలలో ఉత్తమమయినది
హిందూ సంప్రదాయమయితే
లోకంలో మృదుమధురమయినది – అమ్మ ప్రేమ
ఈలోకంలోనే అతి మృదు మధురమయినది అమ్మప్రేమ.

**– అయ్యళప్ప కె.**
ఎం.ఎస్.సి.(జువాలజి), చివరి సంవత్సరం

## హొలారే ... హొలారే హొలారే

హొలారే ... హొలారే ... హొలారే...
సూర్యుడెళ్ళిపోతుండు లేవండిరోయ్...!
హొలారే ... హొలారే... హొలారే...
జాముర్రాతిరెళ్ళిపాయే లేవండోయ్...!
పచ్చని పంటల్లోన పసిడికి నిద్దురలేచే...
వెచ్చని బావుల్లోన గోదారమ్మ పరుగుతీసే...
గోమాత కడుపులున్న లేగదూడలు ఉరుకలేసే...
కొండగాలి కోయిలమ్మ పాటలన్ని వినసాగే...
లేగదూడలు..., పాలగువ్వలు..., అన్నీ అన్నీ నిద్దురలేచే...!
సీతాకోక చిలుకమ్మ చిరునవ్వుతో చిందేసే...
తేనెటీగ పరవళ్ళకి పువ్వులన్ని విరబూసే...
కొండగాలి కోయిలమ్మ రాగాలతో వలవేసే....
నెమలీకల నాట్యముతో ఊరువాడా గంతులేసే...
సెలయేరులు..., పిల్ల పక్షులు..., సంధ్యగాలిలో అన్నీ లేచే...!
హొలారే... హొలారే... హొలారే....
సూర్యుడెళ్ళి పోతుండు లేవండిరోయ్...!

## నాన్న

లాలిస్తూ... ఆడిస్తూ... జోకొడుతూ...
మారాం చేస్తూ... ఏడిస్తే తన కన్నీరై...
నవ్వితే తన బోసి నవ్వులోంచి పుట్టుకొచ్చే
చిన్న పాపాయే... **నాన్న.**

## మా పల్లెటూరు

చుక్కల్లో మెరిసేటి ఓ జాబిలమ్మ ఓసారి చూడవా
మా పల్లెటూరు పరిమళాన్ని కనుచూపులో హాయిగా
నింగిన తారలు ఒక్కసారి మెరిసి చూడగా
తారలో ధ్రువతారగా మా పల్లెటూరుగా ...
మా పల్లెటూరుగా...!
చుట్టూ పచ్చని పొలాల పసిడి ఉన్నది
మెరిసేటి కోనల్లో పలికేటి రాగా చిలుక ఉన్నది
కోనల్లో గువ్వల్లో అరిచేటి గోరింక పిలుపు ఉన్నది
ఆడేటి పాడేటి ఆటల్లో పిల్లల సందడున్నది...
ఆ సందడున్నదో...
ఎన్ని రాగాలు, ఎన్ని జన్మలు వేచిన గానీ లేనిది...
మాసినా దొరకనిది ...
ఆకు ఆకు ఆడుతుంటే ఆనందమెక్కడున్నది
సీతాకోక చిలుకమ్మ చిరునవ్వుతో దాగుంది
పూరిళ్ళు, గుడిసెలలో ప్రేమదాగి ఉన్నది
ఆ ప్రేమనే మించిన ఆప్యాయతెక్కడున్నది...
ఆప్యాయతెక్కడున్నదో...
ఎన్ని నాళ్ళు..., ఎన్ని యేళ్ళు వేచినా రానిది...
చూసినా కనబడనిది...

## ఓ సంధ్యకాల పుష్పమా...

ఓ సంధ్యకాల పుష్పమా...
సూర్యుడెళ్ళిపోతున్నాడని కలత చెందావా
ఓ సంధ్యకాల పుష్పమా...
నిన్ను విడిచి పోతున్నాడని దిగులు పడ్డావా...
కాదా... అది తప్పు...! ఇక దిగులు పడుట తగదుగా...
చల్లని ఆ మబ్బుల్లోంచి చందమామ వచ్చెనుగా...
ఉదయ సంధ్యవేళల్లో ప్రజలలో అడుగుదిడుగు
అరుపులతో, పొగలతో అలసి తొలసి ముడిచిపోయావ్
ఇకనైనా ఆ కొండగాలిని కడుపారా ఆస్వాదించుకో...!
మంచుకురిసే చలివేళ తుంపరలలో తడిసిపో
కొమ్మగూటిలో నిదురోయే పక్షి రాగాలు వినుకో
రాతిరేల అమ్మ పాడే జోలపాటలు గుర్తు చేసుకో
నీవు కూడా ఈ రేయిలో హాయిగా నిదురపో...!

## స్నేహం

నీలాంటి వ్యక్తి పరిచయమైనందుకు
నీ స్నేహం ఎంత విలువైనదో తెలిసినందుకు
నా మనస్సులోని భావాన్ని చెబుదామంటే భాష చాలకుంది!
భాషలేనిది బంధం ఉన్నది సృష్టిలో అతి మధురమైనది
జీవితంలో మనిషి మరువలేనిది స్నేహం ఒక్కటే
చిరునవ్వులాంటి నీ స్నేహం నాకు దేవుడిచ్చిన వరం
నీ స్నేహం అంతులేనిది, అతీతమైనది, స్వార్థంలేనిది
అలాంటి నీ స్నేహం ఎప్పటికి నాకు ఇలాగే ఉండాలని ఆశిస్తూ...
ఎప్పటికి నిను మరచిపోలేని...

## చీకటిలో ఉన్నానని చింతపడకు

దానిని చీల్చుకొని వచ్చే వెలుగుకోసం ఎదురుచూడు
ఓటమి పొందావని కలతచెందకు
ఓటమినే ఓడించి గెలిచే మార్గాన్ని వెతుకు
నమ్మకం నీచేతిలో ఒక ఆయుధం
ఆ నమ్మకంతో ముందుకు వెళ్ళు
విజయం అన్ని వేళలా నీచెంతనే ఉంటుంది.

**– కె. తిరుపతి పటేల్**
బి.ఎస్.సి. (ఎం.ఇ.సి.) ద్వితీయసంవత్సరం

## ప్రకృతి

“మా మంచి ప్రకృతి”లో
ఒక్కో సూర్యకమలమూ
వేవేల వెలుగు రేకలు విప్పుకొని
పగలై విచ్చుకుంటుంది
నమ్మకంగా నీకై...
పూల పాటలన్నీ మోసుకుని
గాలిపిట్ట ఎగిరొస్తుంది
వెచ్చగా వొదిగి ఉండాలని
వెతుక్కుంటూ నీగుండె కోసం...
రెమ్మల చివుళ్ళలో, పచ్చిక బయళ్ళలో
రంగులు చిమ్ముతూ
గుండ్రంగా తిరుగుతూ
నర్తించే ఋతు కన్యలను
మెప్పిస్తూ నీ ఆనందం కొరకు
అని నువ్వనుకుంటావు...
అవి మాత్రం అలవాటుగా
తమ పని కొనసాగిస్తాయి
నిర్నిమిత్తంగా
నిరంతరమూ, నీ అనంతరము

## “చినుకు తాకిడి”

చినుకు తాకిడికి
కమలిపోయే
పువ్వు మనసు
కానీ, అల్లకల్లోలమైన
ఆలోచనా కెరటాలు
మనసు తీరం
దాటుతున్నవి
ఆకు చివర మెరిసే
వాన చినుకు ప్రేమ
ఆ ఒక్క చినుకు బిందువు చాలు
దాహం తీర్చడానికి...

**– ఇ. దాస్** (రిషి)
బి.ఎ. (ఇంగ్లీష్) ప్రథమ సంవత్సరం

## మంచి విషయాలు

1. మీ శరీరాన్నిగానీ, బుద్ధినిగానీ, ఆధ్యాత్మికతనుగానీ బలహీన పరిచే దేన్నయినా విషంవలె తిరస్కరించండి
2. పోరాటంలోనైనా, మృత్యువులోనైనా మీ శక్తినే విశ్వసించండి. ప్రపంచంలో పాపమనేది ఉంటే అది బలహీనత మాత్రమే.
3. నిర్భయులై ఉండండి. ఎల్లప్పుడూ నిర్భయత్వాన్నే స్మరించండి. ప్రతి ఒక్కరికి నిర్భయత్వాన్నే బోధించండి.
4. మంచి శీలాన్ని నిర్మించి మానసిక బలాన్ని పెంచి బుద్ధిని వికసింపజేసి మనిషిని తన కాళ్ళమీద తాను నిలబడేలా చేసేది విద్య.
5. ఏ మనిషి అయినా, ఏదేశమైనా ఉన్నత స్థితిని చేరుకోవాలంటే ఈ మూడు గుణాలు అవసరం. అవి
   1. మంచితనానికి ఉన్న శక్తిమీద అఖండ విశ్వాసం.
   2. అసూయ, అనుమానం లేకుండా ఉండడం.
   3. మంచితనంతో వెలుగుతూ, మంచిపనులు చెయ్యాలనుకునే వారందరికి సహాయం చెయ్యడం.

## విసిరిన రాళ్ళతోనే విశాల సౌధం

మానవుడు ఎంత గొప్పవాడయితే అంత కఠినమైన పరీక్షలను, విమర్శలను ఎదుర్కోవలసి వస్తుంది. కానీ నేడు నిత్యజీవితంలో ముఖ్యంగా ఈతరం యువతీ యువకులు చిన్న విమర్శలను కూడా ఎదుర్కోలేక పోతున్నారు. విమర్శల ధాటిని తట్టుకోలేని చాలా మంది ఆత్మన్యూనతాభావంతో బాధ పడుతున్నారని సామాజిక విశ్లేషకుల అభిప్రాయం.

ప్రపంచ చరిత్రలో విప్లవాత్మక విజయాలను సాధించిన ప్రతి ఒక్కరూ ముందు విమర్శల జడివానలో తడిసిన వారేనని మనం గుర్తుంచుకోవాలి. వారంతా విసిరిన రాళ్ళతోనే విశాల విజయ సౌధాలు నిర్మించుకున్న వారని తెలుసుకోవాలి. అందుకే ఈతరం యువతీ యువకులు విమర్శలను ఎదుర్కొని విజయాలను సాధించాలి.

సేకరణ : **ఇ. నరేష్**
బి.ఎస్.సి. (బి.జడ్.సి.) ద్వితీయసంవత్సరం

## మనిషి - మనస్సు

మేఘానివి నీవైతే

ఆ మేఘంలోని నీరును నేనౌతా.

నీరుగా నీ నుండి వేరయినా

ఆవిరయి నిన్ను చేరుతా...

నీరుగా మారుతా...

## చినుకు - ఆవిరి - దాహం - స్వేదం

చినుకు అయి వస్తావు

ఆశలు చిరుగింపజేస్తావు

ఆవిరి అయి వెళ్తావు

ఆశలు అడియాశలుగా మిగుల్చుతావు

దాహం అయి వస్తావు

దప్పిక తీర్చుతావు

స్వేదం అయి వెళ్తావు

వేదనను మిగుల్చుతావు

ఓ చెలీ! ఇది నీకు న్యాయమా చెప్పుమా?

## ప్రేమ క్రమము

ఓ చెలీ!

నీ ఒక్క చూపు చాలు

    నాలోని నైరాశ్యాన్ని తొలగించడానికి

నీ ఒక్క నవ్వు చాలు

    నా మనస్సు కరిగించడానికి

నీ ఒక్క మాట చాలు

    కార్యం సాధించడానికి...

నీ ఒక్క తోడు చాలు

    ఈ జన్మ ధన్యం కావడానికి...

## నవ్వు - చూపు - మాట - మోము

ఓ చెలీ!

నీ నవ్వే చిరుజల్లై కురిసే నా మదిలో

నీ చూపే ఓ మెరుపై మెరిసే నా ఎదలో..

నీ మాటే ఓ ఉరుమై ఉరిమే నా హృదయంలో..

నీ మోమే చంద్రబింబమై ప్రతిబింబించే నా మనస్సులో...

నీ కనుల నుండి జాలువారే ఆ ముత్యపు చుక్కను చూడాలనివుంది.

## ప్రకృతి

ప్రకృతిని చూచిన ప్రతిక్షణం

పరవశించేను నా మది

జల జల పారే కోనేరులు

నా హృదయంలో ప్రవహించే రక్తధారలై

నా ప్రతికణంలో నింపుతాయి పరవశం

ప్రకృతికి పెట్టింది పేరు పచ్చదనం.

ఆ పచ్చదనాన్ని కాపాడితేనే మనకు కలుగు మంచితనం

## నువ్వే నేను - నేనే నువ్వు - నా నిరీక్షణ నీకోసమై

నాలో నేను లేనివాడనై

నీలో నేనొక ఏకాకినై

మది నిండ 'నీవు' కలవానినై

నీ జన్మ నాకోసమై

నా నిరీక్షణ నీకోసమై...

ఓ చెలీ! మన కలయిక

శుభసూచకం కావాలని కోరుకుంటా...

– నీల రామస్వామి

ఎం.ఎస్.సి. (ఫిజిక్స్) ద్వితీయసంవత్సరం

## మై కాలేజ్

కాలేజీ ఓ నిజాం కాలేజి
మాకు మళ్లీ మళ్లీ రావాలి ఈ ఏజి
అని అంటుంది మా టీనేజి
నువ్వు అన్ని రుచులు కలిసిన జిలేబి
పంచావు స్నేహమనే గులాబి
నైజాం ప్రభువులు వేసిన పునాది
చేశావు నిరక్షరాస్యతను సమాధి
జాతి గర్వించే ఘనులను ఇచ్చావు
దేశాన్ని ఏలే మణులనూ ఇచ్చావు
వారిని అనుసరించే మాకు మార్గం చూపావు
కట్టిన కూలీలు కనుమూసినా
ఏలిన రాజులు అంతరించినా
చరిత్ర చూపే అద్దమైనావు
ఎందరో చరిత్రకారులకు జన్మనిచ్చావు
123 వసంతాల విద్యావృక్షం
వికసించాయి నీ పుష్పాలు విశ్వవ్యాప్తం

## రాజకీయ నేతలు

కీర్తి గడించే అపకీర్తులు మీరు
అవినీతికి అద్దం మీరు
అక్రమానికే మార్గం మీరు
అభివృద్ధికీ అడ్డు వంతెన మీరు
మీ మాటలు నమ్మి మిమ్ము గెలిపిస్తే
మిమ్మల్ని నమ్మినందుకు మమ్మల్ని ఓడించారు.
నటనే మిమ్ము చూసి నేర్చుకునేంత నటులు
తిట్టేందుకు కొత్త తిట్లు వెతుక్కోవా ఆ తిట్లు
చాలవురా మామీద మీరు వేసిన ఒట్లు
మిమ్మల్నే నమ్ముకుంటే తప్పవు మాకు పోట్లు
ఎంతరాసినా చాలదు మీ గురించి
ఎంతో కొంత రాస్తేనే నాకు మనఃశాంతి.

**– బి. శివ**

బి.ఎస్.సి. (ఎం.సి.సి.) ద్వితీయసంవత్సరం

## విషాదంతో ... కోయిల

చల్లని సాయంత్రం వేళ, పక్షులన్నీ కీచుకీచుమంటూ గూటికి చేరుతున్నవేళ, పిల్ల పక్షులు తన తల్లి పక్షులు వస్తున్నాయని కేరింతలు వేస్తున్న వేళ, కిలకిల రాగాలకి ప్రజలంతా హాయిగా నిదురోయే వేళ, సూర్యుడు అస్తమించి మెలమెల్లగా చందమామ మబ్బులోంచి తొంగి చూస్తున్న సమయాన ..., ఒక బొంగురు గొంతుతో అరుస్తున్న శబ్దం వినిపించింది. రాగాలతో మనలని పలుకరించే కోయిల అలా ఆకాశంలో ఒంటరిగా పైకి ఎగురుతూ అరుస్తున్నది. రాతిరేల పక్షులన్నీ తమతమ గూటిలో కొమ్మ ఊయలలో నిదురిస్తున్నాయి. అప్పటికి ఆ కోయిల అలాగే అరుస్తూ.. అరుస్తూ... పైకి ఎగురుతూనే ఉంది. తెల్లవారింది, మళ్ళీ రాత్రి అయ్యింది. అయినా ఆపకుండా అరుస్తున్న ఆ కోయిలని ఆకాశవాణి చూసింది.

ఆ ఆకాశవాణి కోయిల బాధని చూడలేక ఇలా అడిగింది. "ఏంటి... కోయిలమ్మా? అలా రెండు రోజుల నుంచి అరుస్తూనే ఉన్నావు. ఏమయింది నీకు?" అని అడిగింది.

దాన్ని ఆ కోయిల విషాదంతో "చూడమ్మా. అడవులలో కొండలలో తిరుగుతూ, గింజలని తింటూ, చల్లనివేళ కొండగాలికి, పైరగాలికి హాయిగా పాటలు పాడుతూ కాలం గడిపే నేను ఇపుడు ఈ భూమిమీద ఉండలేక పోతున్నాను. ఈ మనుషుల మధ్య జీవించలేము" అని అన్నది.

దానికి ఆశ్చర్యంతో ఏమి అర్థం కాక ఆకాశవాణి ఇలా అడిగింది. "ఏమయింది కోయిలమ్మా? ఎందుకలా అంటున్నావు?" అనగా కోయిల కన్నీరు పెడుతూ ఇలా చెప్పుకొచ్చింది.

"ఎక్కడ చూసినా జనం, ఎటు చూసినా కాలుష్యం. మనిషి తన మనుగడ కోసం ఏమైనా చేస్తున్నాడు. మాలాంటి అరణ్య జీవులని నిరంతరం వేటాడుతున్నాడు. చెట్లని, అరణ్యాలని నరికివేసి ఇలా తన ఇళ్ళుగా మార్చుకుంటున్నాడు. భూమిలో నీరులేక, ఆకాశం నుంచి వర్షంరాక, తిండికోసం, గూటికోసం తిరగని ప్రదేశాలు లేవు. ఒకప్పటి చల్లగాలులు, అరణ్యప్రాణులు అన్నీ కరువయ్యాయి. చివరికి మనుషులు– మనుషులే వాళ్ళమధ్య భూములకోసం కొట్టుకుంటున్నారు. ఇలాంటి ఈ మానవలోకంలో ఉండలేననే క్షోభతో తట్టుకోలేక ఇలా ఎగురుతున్నాను. నాకు, నాలాంటి జీవాలకి ఈ భూమిమీద మనుగడ లేదు. మనుగడ లేదు... అవును మాకు మనుగడ లేదు" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్నా ఆ కోయిల మాటలు విని ఆకాశవాణి కంటనీరు కార్చింది. బాధతో తన ఒడిలోకి తీసుకొని ఓదార్చింది.

నిజానికి మనిషి మనుగడలో అరణ్య జీవాలకి మనుగడ లేదా? అవి బ్రతుకకూడదా? వాటి జీవితాలు ఈ కోయిలలాగే క్షోభించాలా?

ఏంటో మీరే చెప్పాలంటూ....

**– కొలనుపాక సురేష్**

ఎం.ఎస్.సి. (ఆర్గానిక్ కెమిస్ట్రీ) ద్వితీయ

# సామాజిక, సాంస్కృతిక రంగాలపై యువత ప్రభావం

నేటి సమాజంలో యువత పాత్ర అనేది చాలా ప్రముఖమైనది. చేతిలో పుస్తకాలు పట్టుకోవాల్సింది పోయి కత్తులు, తుపాకులు, యాసిడ్ బాటిల్స్ పడుతున్నారు. నాడు నెహ్రూ "నేటి బాలలే రేపటి పౌరులని" చెబితే దానికి భిన్నంగా దేశానికి బానిసలుగా ద్రోహులుగా యువత మారుతున్నారు. దీనికంతటికి కారణం ఏమిటని సుదీర్ఘంగా ఆలోచిస్తే, యువతకి సరైన అవగాహన లేకపోవడం. సరైన ఆలోచన విధానం లేకపోవడం, తొందరపాటు తనం, ఆవేశం మరియు నేటి సమాజంలో ఉన్న పాశ్చాత్య సంస్కృతి ఇంకా సమాజాన్ని సరైన రీతిలో అధ్యయనం చేసే సంస్థలు లేకపోవడం. నేడు కొన్ని సంస్థలు స్వంత ప్రయోజనాలకోసం తమ విధి, విధానాలను అనుసరిస్తున్నాయి. ప్రతి విద్యార్థికి తన బాధ్యతలను తెలియచేస్తూ, తను పాటించవలసిన విధి విధానాలను తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈనాడు పల్లె ప్రాంతాలలో చూచినట్లయితే యువత వారసత్వంగా ఆస్తి హక్కుతోపాటుగా బానిసత్వాన్ని, తాగుబోతుతనాన్ని, చెడు అలవాట్లను, నిరక్షరాస్యతను, నిరుద్యోగాన్ని మరియు తండ్రి ఏవిధంగా తన జీవితాన్ని గడిపితే విద్యార్థి కూడ తన జీవితాన్ని తండ్రికి అనుగుణంగా గడపడం జరుగుతుంది. కాని ఆ సమయంలో ఆ విద్యార్థి ఆలోచించవలసి ఉంటుంది. అప్పుడు ఆ విద్యార్థి తన తాతలు, తండ్రుల, జీవిత విధానాన్ని గ్రహించి, తన భవిష్యత్ జీవిత విధానాలను ఏవిధంగా అనుసరించాలో ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నేటి సమాజంలో అమ్మాయిలపై దాడులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. అసలు ప్రతి మనిషికి తనకు తాను చంపుకొనే వీలులేని ఈ సమాజంలో మరో వ్యక్తిని చంపడానికి ఎవరిచ్చారు ఈ హక్కు. ఎన్నిరోజులని ఈ దాడులు జరుగుతాయి. అసలు దాడుల ద్వారా సమస్యలు పరిష్కారమవు తాయా అనే విషయాలు యువత ఆలోచించవలసిన అవసరం ఉంది. ఒక్కసారి "ప్రేమోన్మాదం" గురించి యువత ఆలోచించి నట్లయితే సమస్య పరిష్కారమవుతుంది. ప్రేమ అనేది పరస్పరం ఇచ్చి పుచ్చుకునేది. అది నీతి, నిజాయితీతో కూడుకొని ఉన్నది. మరియు ఒకరినొకరు అర్థం చేసుకొనేది. కాని నేడు పురుషుడు ఒక స్త్రీని తనను ప్రేమించమని బలవంతం చేస్తున్నాడు. ఆ విషయాన్ని తాను అంగీకరించకపోతే గొంతుకోయడం, యాసిడ్ పోయడం, బలవంతంగా ఆమెను వశపరచుకొని, తన కోరికలు తీర్చుకొని తరువాత చంపివేయడం జరుగుతుంది. ఇటువంటి ప్రేమ ఉన్మాదం క్రిందనే వస్తుంది. అసలు ఉన్మాదం అంటే పిచ్చి, పిచ్చివాడు ఏంచేస్తాడో వాడికే తెలియదు. అలాగే ప్రేమ పిచ్చివారు చేసే పనులకు అర్థం ఉండదు. యువత ఈవిధంగా చెడిపోవడానికి సంస్కృతిక కార్యకలాపాలైన సినిమాలు, అశ్లీల చిత్రాలు, ధూమపానం, ఇంటర్‌నెట్ మొదలగునవి కారణాలుగా చెప్పవచ్చు. సినిమారంగం, మీడియారంగం, తన స్వార్థం కోసం వాటిని రూపొందిస్తే, యువత వాటిని ఆదర్శంగా తీసుకోవడం జరుగు తుంది. నేటి సమాజంలో ఒక కెమెరాసెల్‌కు ఇచ్చిన విలువను, పుస్తకాలకు యివ్వలేకపోతున్నారు. ఇంకా ఒక 10 సంవత్సరాలు దాటితే ప్రతి విద్యార్థి ఒక ఉన్మాదిగా, ద్రోహిగా, ఒక రౌడీగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచంలో అన్నిచోట్లలో ఈ ప్రేమోన్మాద దాడులు జరుగుతున్నాయి. అంతెందుకు మన రాష్ట్రాన్ని పరిశీలిద్దాం. ఈమధ్య విజయవాడలో హాస్టల్లో ప్రవేశించి ఆయేషా అను తెలివిగల అమ్మాయిని ఒక ప్రేమోన్మాది అతి దారుణంగా చంపాడు. అలాగే వరంగల్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినిపై యాసిడ్ చల్లారు. గుంటూరు జిల్లాలో తరగతిగదిలో ఒక విద్యార్థిని పీక కోశాడు. ఇలా చెప్పుకుంటూపోతే దాడులసంఖ్య పెరుగుతుపోతుంది.

## నా దృష్టిలో ఈ దాడులను అరికట్టాలంటే

1. ఈ దుండగులను నిర్దాక్షిణ్యంగా శిక్షించాలి. 2. దాడి జరిగిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి దుండగులను నిర్బంధించాలి. 3. తప్పుచేసిన వారికి సిగ్గు వచ్చేటట్లు వారిని అర్ధనగ్నంగా వీధుల్లో తిప్పాలి. 4. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో పెంచాలి. 5. ఆడపిల్లలు, మగవారిని రెచ్చగొట్టే విధంగా దుస్తులు ధరించరాదు.

ఈవిధంగా జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషిచేయాలి. యువత ముఖ్యంగా ఆలోచించాలి. పైగా మన దేశం సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం కావున దేశ భవిష్యత్‌ను కాపాడడానికి, పురాతన దేశ గౌరవాన్ని కాపాడడానికి యువత కృషి చేయాలి. ఎందుకంటే ఒక దేశ భవిష్యత్ అనేది యువకుల భుజస్కంధాలపై ఆధారపడి ఉంది. స్త్రీల ప్రతిపత్తికి భంగం వాటిల్లే చర్యలను విడనాడాలి. దేశ సమైక్యతను పెంపొందించాలి. అదే గురజాడ చెప్పిన విధంగా "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే విధంగా యువకులు గుర్తుంచుకోవాలి. సమాజంలో జరిగే అవినీతి చర్యలను, లంచగొండితనాన్ని, దాడులను, యువకులు తీవ్రంగా ఖండించాలి. ముఖ్యంగా నేటి సమాజంలో యువకులు రాజకీయాలలోకి రావాలి. వారసత్వ రాజకీయాన్ని వారు తీవ్రంగా ఖండించాలి. అలాగే సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన మరియు చారిత్రకమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలి.


– బొడ్డు కిరణ్

బి.ఎ. (ఇ.పి.పి.) ద్వితీయసంవత్సరం

## అమ్మ

మాతృదేవోభవ అని పిలిచే మన భారతదేశంలో మాతృప్రేమకే వెలకట్టబడుతుంది. అమ్మ అనేది పదం కాదు. ఒక శక్తి, ఒక ఆధారం, ఒక రూపం, ఒక రక్షణ వలయం. అమ్మ అనే తీయటి పదం మనుషులకే కాదు. పక్షులకు, జంతువులకు సకల జీవకోటికి సంబంధించినటువంటి స్పర్శే అమ్మ.

మనకు కష్టం వచ్చినా, కన్నీరొచ్చినా మనకంటే ఎక్కువ బాధపడుతుంది అమ్మ. సమాజంలో తన బిడ్డను తిడితే చిన్నబుచ్చుకుంటుంది. పొగిడితే తాను పొంగిపోతుంది. అమ్మకి తన బిడ్డలపై ఈర్ష్య, కోపం ఎప్పుడు ఉండవు. మనం నివసించే భూమికి అమ్మలాంటిదే సూర్యుడు కూడ. తన నుండి విడిపోయిన చిన్న ముక్క సకల జీవకోటికి ఆధారమైన భూమికి, సూర్యుడు నిరంతరం శక్తిని అందిస్తూనే ఉన్నాడు. అదే అమ్మ ప్రేమ.

అమ్మ నోటి మాట
అమ్మ జోల పాట
అమ్మ గోరు ముద్ద
మళ్ళీ, మళ్ళీ కావాలనిపిస్తుంది కదూ...

అమ్మకు ఎంత కష్టం వచ్చినా బిడ్డల్ని కంటికి రెప్పలాగ కాపాడుతుంది. తనకు అన్నం ఉన్నా లేకపోయినా తన రక్తాన్ని పాలగా మార్చి బిడ్డ ఆకల్ని తీరుస్తుంది.

పువ్వులు, కాయలు చెట్టుకు ఎప్పుడు బరువు కావు. కాని కాయలు చెట్టును వదిలివెళ్ళినట్టు, రెక్కలు రాగానే పక్షులు తల్లిని వదిలి వెళ్ళినట్టు మనం ఆస్తికోసమో, అమ్మాయి కోసమో, అబ్బాయికోసమో, ఆధారం దొరికిందనే ఆశతో అమ్మను వదిలి వెడుతున్నాము. అమ్మను వృద్ధాశ్రమంలోనో లేదా ఒక ఆయాను పెట్టి చేతులు దులుపుకుంటున్నాము. చదువుకున్నవారే ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. ఒక నిమిషం ఆలోచించండి.

మనం బిడ్డల్ని కనడం ఎందుకు. అనాథ పిల్లల్ని పెంచుకుంటే సరిపోదా, మనకు అసలు పిల్లలు ఎందుకు బ్రతికినన్ని రోజులు సుఖంగా బ్రతుకుదాం అని అందరు అనుకుంటూ పోతే ఈ లోకం ఉంటుందా.

ఆస్తికోసమో, అమ్మాయికోసమో, అబ్బాయికోసమో, ఆధారం కోసమో అమ్మను విడిచిపెట్టవద్దు. చెట్టు కాయల్లాగా, పక్షుల్లాగా మరియు జంతువుల్లాగా అమ్మను వదిలిపెట్టి వెళ్ళకుండా అమ్మకు తోడుందాము. అమ్మకు మనమే ఊతకర్ర అవ్వాలి. అమ్మ ఎంత ముఖ్యమో నాన్న కూడ అంతే ముఖ్యము.

## అమ్మప్రేమ

సృష్టికి మూలం బ్రహ్మ, ప్రతి చోట తానుండలేక
సృష్టించాడు అమ్మను
అమ్మ అనే మాట పదం కాదు ప్రతిస్పందన
అమ్మ అనే పిలుపు పెదాల ద్వారా వచ్చే మాట కాదు
అంతరంగ శక్తులు స్పందించేది అమ్మ అనే పిలుపుతోనే,
పదినెలలు మోసి, పురిటినొప్పులు భరించిన అమ్మను...
ఆరాధించటం గతజన్మల పుణ్యఫలం,
పాపం అయినా పుణ్యం అయినా అమ్మ క్షమిస్తే
ఆ దైవం క్షమించినట్లే
తన బిడ్డ ఎదిగి ఒదిగి ఉన్నత శిఖరం చేరాలనేది
అమ్మ ఆశయం
కన్న సంతానం కోసం కోటి పూజలు చేస్తుంది అమ్మ
అమ్మ పిచ్చిదైనా తన బిడ్డను అడుక్కుని బ్రతికిస్తుంది
అదే అమ్మ! అమ్మలేని లోకం శూన్యమే కదా!

## స్నేహం

ఓ కావ్యంలా పరిచయం అయ్యావు
ఓ బంధంలా అల్లుకున్నావు
ఓ చేదు జ్ఞాపకం అసలే కావు
ఓ తీపి అలజడి కానే కావు
ఓ బంగారు స్నేహమా నన్ను
ఓ నిమిషమైన గుర్తుంచుకుంటావని
ఓ చిన్ని మనస్సు నీకోసమే
ఓ కన్నీరులా కరిగి కరిగి పరితపించే
ఓ స్నేహం

**– పతకమూడి విజయశాంతి**
ఎం.ఎ. తెలుగు, ద్వితీయ సంవత్సరం

అమ్మా నాన్న కలిస్తేనే మన రూపం.
మనమందరం కలిస్తేనే స కుటుంబం.
మారుదాం... లోకాన్ని ... మారుద్దాం.
– అమ్మ బిడ్డ.

**జి. అశోక్**
ఎం.ఎస్.సి. (జువాలజీ), ప్రథమసంవత్సరం

## స్నేహం

స్నేహమా స్వాగతం స్నేహ బంధమా సుస్వాగతం
మిత్రమా స్వాగతం మిత్ర బృందమా సుస్వాగతం
సోదరభావం తానై ఆత్మీయత నేస్తమై
సహజత్వం ఉట్టిపడే సంకీర్తన విదితమే
మాతృబృంద వరుసలాగ మరపురానిదీ...
హృదయవేదనే అయినా పంచుకున్న కరిగిపోవు
కన్నీళ్ళ ప్రవాహమే ఒకింతలా తరిగిపోవు
హిమగిరి సైతం మారే జలధి మాదిరీ
జననసీమ ఎక్కడో జగతిపై కని ఉన్నా
స్నేహజన్న సూక్ష్మంలా ఇలలో తిరిగేస్తున్నా
మృతియెరుగని అమరజీవి స్నేహ లహరీ
చిరకాలం వీడలేని బంధం అనుకుంటున్నా
అందరికోసం నేనై అతి వ్యాప్తిగ వస్తున్నా
కాంక్షనడిగి కనుగొన్నా కలకానిది స్నేహ మాధురి

**– పి. బాలమణి**

ఎం.ఎ. ప్రథమసంవత్సరం

## ఆనంద వేళ

ఆకాశం వర్షించే వేళ
భూమిపై పసిరిక విరిసేవేళ
ప్రకృతి చిగురించిన వేళ
సూర్యుడు ఉదయించిన వేళ
నిజాం కళాశాల వెలసిన వేళ
ఆచార్యులు బోధించే వేళ
మాలో జ్ఞానం వికసించే వేళ
మాలోని విద్య నలుగురికి పంచేవేళ
పండువెన్నెల పిండి వెలుగులు చిందేవేళ
కాలం ఆగిపోయే వేళ
నా కవితకై నిలచిపోయే వేళ

**– పి. సుదర్శన్**

ఎం.ఎ. తెలుగు ద్వితీయసంవత్సరం

## తామసి! నా ప్రేయసి

పడమటి రవి చిన్నగా నవ్వి
కొండల మాటుకు దిగుచుండగా
పక్కున నవ్విందో గొంతుక
నల్లపూల చీర చుట్టి, కస్తూరి వర్ణ రవిక కట్టుకు వస్తోంది
అదే నా ప్రేయసి! ఓ తామసి
ఆకసాన్ని ఒరుసుకుంటూ
నింగి అంచుగా నేలపై పదమిడుతుంది
దాని ధాటికి వెలుగురేఖ మూగబోయింది
ఇరులతో జగతిని కప్పేస్తుంది
కురులతో దివిని, భూమిని ఏకం చేస్తుంది
అదే నా ప్రేయసి! ఓతామసి
దీని ఆధిపత్యంలో వీరవిహారం
చేస్తున్నారు నిశాచరులు
సిరి కోల్పోయిన ఈ ప్రపంచిని
వీణ మీటుతూ విలపిస్తుంటే
ఆ దుఃఖంలోని కన్నీరు చీకటి ధారలే
అదే నా ప్రేయసి! ఓ తామసి
ఈ చీకటి రాజ్యానికి రాజులా
కూర్చుందో చెట్టుపై గుడ్లగూబ
దాని చూపులు ఇరులకు శాసనాలు
కాంతిని కోల్పోయిన ఈ విశ్వానికి చిన్న నెలవంక
చైతన్యాశనిస్తుంటే...
వికటాట్టహాసంతో మూసింది నిశీధి
అదే నా ప్రేయసి! ఓ తామసి
నడి జాములో ఓ గొంతుక వింత
అది తీతువు బేతాళ కూత
ఆ శబ్దరవానికి ఉలిక్కిపడ్డ దొక్కసారి నిద్రావస్థలోని జగత్తు!
అవిరళంగా కురుస్తుంది నిశీధి వర్షం
అదే నా ప్రేయసి! ఓ తామసి
చీకటిని ఎక్కిరిస్తూ వచ్చిందో చుక్క
అది వచ్చి వాలింది ఆ ప్రక్క
అది సూర్యరథ చక్ర సవ్వడికి చిహ్నాక
తన ఇరులను మడతేస్తుంది రాత్రి కన్యక
మళ్ళీ వస్తానంటూ కసితో వెళ్తుందిక
అదే నా ప్రేయసి! ఓ తామసి
జీవిత కాలపు రాకాసి

**– బి. సైదులు**

ఎం.ఎ. తెలుగు, ప్రథమ సంవత్సరం

## మెరుపులాంటి నిజాం

నిజాం! గాలికి తిరుగుతున్న నాకు
మెరుపులా కనిపించావు ఇది నిజం.
నీ గురించి ఆరా తీసింది నిజం.
ఏదేమైనా సరే మూడు సంవత్సరాలు
నీతోనే గడపాలనుకున్నది నిజం
నీ ఒడిలో చేరి కొత్త పరిచయాలను
కొత్త విషయాలను తెలుసుకున్నది నిజం
కాని ఇంతలోనే తెలిసింది
నిన్ను వదిలి వెళ్ళే సమయం వచ్చిందని
నిన్ను వీడాలంటే దిగులుగా ఉంది.
ఇది నిజం...!
ఓ నిజాం...!!

**– గుండు రాజు**
బి.కాం. (రెగ్యులర్)

## ఆమె

ఆశ నిరాశలతో అలసిన ఆమె కళ్ళు
నాకై ఎదురు చూసే చల్లని లోగిళ్ళు
అన్నెం పున్నెం ఎరుగని ఆమె నవ్వులు
నన్ను మురిపించే వాడినా రాలని పువ్వులు
పొక్కుతూ పోలుతూ నడిచే ఆమె గమనం
నన్ను నడిపించే పావన గమనం
ఆమెకు అంతగా చదువురాదు
అయినా ఆమెకు మించిన గురువు లేదు
ఆమె నాకు ఎలాంటి వరం ఇవ్వలేదు
అయినా ఆమెకు మించిన దైవం లేదు
ఆమె పేరులో రెండే రెండక్షరాలు
అవి నాకు ప్రాణం పోసే వరాలు
అందుకే ఆమె నా ప్రాణం ప్రాణం
ఆమె ఎవరో కాదు ఆమే "మా అమ్మ"

**– వి. లక్ష్మీనారాయణ**
ఎం.ఎ. తెలుగు ప్రథమ సంవత్సరం

## ఉపాధ్యాయ వృత్తి

ఉపాధ్యాయ వృత్తిలోన
ఉన్నదొక పరమార్థం
ప్రతిభాపాటవాలను
పైకితీయు సామర్థ్యం
ఉత్తేజపుబాటలోన
ఉరికించుట తన ధ్యేయం
పరిసరాలు కలబోసిన
కమ్మని రసకావ్యం
నరనరాన వెలిగించే
నవ్య సూర్యతేజం
అదిగదిగో అదిగో
అతడేనోయి
నవ సమాజ నిర్మాణపు పునాది రాయి
భవిష్యత్తుకు బాటవేయి
భవ్యబుద్ధి జీవి
నైపుణ్యపు దారిలోన
అలసిపోని శ్రమజీవి!
అందం
ఆకులుంటే చెట్టుకు అందం!
తారలుంటే నింగికి అందం!
చంటిపాపకు నవ్వు అందం!
చంద్రునికి వెన్నెల అందం!
కళ్ళకు కళలు అందం!
మనిషికి ఆనందం అందం!
నీటికి కెరటాలు అందం!
నెమలికి నాట్యం అందం!
కోకిలమ్మకు పాట అందం!
మనసుంటే మనిషికి అందం!
సంస్కారం చదువుకు అందం!
చదువుంటే విద్యార్థికి అందం!

**– కట్ట రంజిత్ కుమార్**
ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం

# తెలుగు భాషకు అభినందన అక్షరమాల

అ : అనంత సృష్టిలో అందాలు ఒలికేది మన తెలుగు.

ఆ: ఆనందంలోను, ఆర్తనాదంలోను ఆత్మీయతను పలికించేది మన తెలుగు

ఇ : ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఇతిహాసాలనుండి ఇప్పటి వరకు సాహిత్యానికి పెద్ద పీట వేసింది మన తెలుగు.

ఈ : ఈనాటికి ప్రాచీన హోదా పురస్కారాన్ని దక్కించుకున్నది మన తెలుగు.

ఉ : ఉరకలు వేసే ఉత్సాహాన్ని నింపే పాటలు సైతం మనసును ఉర్రూత లూగించే ఘనత మన తెలుగు

ఊ : ఊహలకే రెక్కలు వచ్చి అనుభూతులకే అక్షరరూపం దాల్చిన భాష మన తెలుగు

ఋ: ఋషులనాటి నుండి గ్రాంధిక, వ్యవహారిక భాషలకు ఊపిరిపోసింది మన తెలుగు.

ఎ : ఎంతటివారలైనా అమ్మని అమ్మా అని పిలిచే మన సంస్కృతి సంప్రదాయాన్ని నిలబెట్టేది మన తెలుగు.

ఏ : ఏనాటినుండో ఏలిన ప్రభువుల, ఎందరో కవుల కృషివలన నేడు ప్రాచీన హోదాను దక్కించుకున్నది మన తెలుగు.

ఐ : ఐక్యతను సాధించుటలో, సమైక్యతను పెంపొందించుటలో అన్ని భాషల వారితోను సఖ్యతను పెనవేసుకున్నది మన తెలుగు.

ఒ : ఒకరి మనసులోని భావాలను మరొకరికి తెలియజెప్పి అన్యోన్యతను పెంచేది మన తెలుగు.

ఓ : ఓనమాలనాడే ఓంకారానికి శ్రీకారం చుట్టి ఓపికతో, ఆటపాటలతో నేర్చుకునేది మన తెలుగు.

ఔ : ఔన్నత్యాన్ని చాటిచెప్పి, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నలుదిక్కులా తెలియజేసింది మన తెలుగు.

అం : అందరి దృష్టిని ఆకర్షించి తమ నటనా, భాషణా, కౌశలాన్ని తెరకెక్కించింది మన తెలుగుసినీ పరిశ్రమ.

అః : అంతఃపురంలోని భాషా చాతుర్యాన్ని నాటకరంగం ద్వారా రక్తి కట్టించింది మన తెలుగు.

క: కళలలో ఒకటయిన కవిత్వానికి కమనీయతను సంతరింప జేసింది మన తెలుగు.

గ : గల్లీ నుండి ఢిల్లీ వరకు గళం ఎత్తి చిరస్థాయి గుర్తింపును పొందింది మన తెలుగు.

చ : చరిత్రలోనే చారిత్రాత్మకమైన చరితను కలిగి చరితార్థమైనది మన తెలుగు.

జ : జనరంజకమైన కృష్ణాపత్రిక ద్వారా తెలుగువారిని స్వాతంత్ర్య సమరంవైపు నడిపింది మన తెలుగు.

ట : టపాద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలను తెలిపి ప్రచార సాధనంగా తనదంటూ ఒక ప్రత్యేక స్థానం దక్కించుకున్నది మన తెలుగు.

ఢ : ఢమరుకం మ్రోగితే వచ్చే నాదంకన్నా కంఠనాదం నుండి వెలువడే రాగాలకు రూపం ఇచ్చింది మన తెలుగు.

ణ : వీణతంత్రులతో వచ్చే రాగాలకు అక్షరరమ్యతను మేళవించి సప్తస్వరాలగు స, రి, గ, మ, ప, ద, ని, స లను లోకానికి చెప్పి వెలుగునింపింది మనతెలుగు.

త : తరంగాలద్వారా రేడియోను, దూరదర్శనులను ఆవిష్కరించి ప్రచార సాధన ప్రతిపత్తిని కల్గించింది మన తెలుగు.

ద : దశదిశలా మన ఆచార వ్యవహారాలను, ధర్మంయొక్క గొప్పతనాన్ని చాటి చెప్పింది మన తెలుగు.

న : నరనరాల్లో జీర్ణించుకున్న దేశభక్తిని గేయరూపంలో ఎత్తి చూపి తెలుగువారి నాడిని విశదపరిచింది మన తెలుగు.

ప : పండుగల – పర్వదినాల ప్రాధాన్యతను పదిలంగా హృదయంలో దాచుకునేలా పుస్తకరూపం దాల్చింది మన తెలుగు.

బ : బడికి వెళ్ళగానే తెలుగులోనే అ, ఆలతో ఓనమాలు నేర్చుకునే ప్రథమ భాష మన తెలుగు.

మ : మంచి కథగాని, కవితగాని, మాటగాని, పాటగాని, పద్యంగాని ఏది చెప్పినా వీనుల విందును గొలుపుతుంది మన తెలుగు.

య : యజ్ఞ యాగాదులలో శ్లోకాలను, మంత్రాలను పఠించి దైవారాధన చేసి సాక్షాత్కారం పొందుటకు దోహదపడేది మన తెలుగు సంస్కృతి.

ర : రవిలా ప్రకాశించి దాని సాటి మరేది లేదని నిరూపించి రవిరాజులా వెలుగొందేది మన తెలుగు.

ల : లక్షణమైన ఛందస్సు, అలంకారాలతో విలక్షణమైన వ్యాకరణంతో పదాలను లతలా అల్లుకున్న భాష మన తెలుగు.

వ : వశీకరణ విద్యలో ఎంతశక్తి ఉంటుందో అలా తెలుగువారి నుండి తెలుగుభాష ఇతరుల్ని ఇట్టే వశపరుచుకొని మేము తెలుగువారమని గర్వంగా చెప్పుకున్న స్థితికి ఎదిగింది మన తెలుగు.

శ : శరదృతువులో వెన్నెల ఎలా మనస్సుకు హాయినిస్తుందో అలాగే శతకపద్యాల్లోని సారమంతా తెలుగువారిని ఆనందరస డోలికల్లో ముంచెత్తడానికి సహకరిస్తుంది మన తెలుగు.

స : సంఘంలో నేడు గౌరవమర్యాదలు పొందాలన్నా, సంస్కారవంతమైన జీవితాన్ని గడపాలన్నా, తెలుగువారమని సగర్వంగా చెప్పు కుంటున్నామంటే ఆ ఘనత మన తెలుగు భాషదే.

హ : హంస పాలను, నీళ్ళను వేరు చేసినట్లుగా, మనం ఎంతమందిలో ఉన్నా మీరు తెలుగువారని ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చేది మన కట్టూ – బొట్టూ, భాషయే ముఖ్యకారణమని చెప్పాలి.

ళ : కళలలో కవిత్వం, సంగీతం రెండూ భాషకు సంబంధించినవే. కాబట్టి మన తెలుగువారి కవిత్వమూ, సంగీతమూ ఎంతటివారినైనా ఇట్టే మంత్రముగ్ధుల్ని చేస్తుందంటే అది మన తెలుగుభాషామతల్లి పుణ్యమే! అని అనడంలో ఎలాంటి సందేహంలేదు.

**– కట్ట రంజిత్ కుమార్**

ఎం.ఎ. తెలుగు, ద్వితీయసంవత్సరం

# గుర్రం జాషువా - గబ్బిలం ఖండకావ్య పరిశీలనం



**1. కవి పరిచయం :**

జననం : నాల్గు పడగల హైందవ నాగరాజు పీఠమణిచిన ధైర్యశాలి గుర్రం జాషువా కవివరేణ్యులు గుంటూరు జిల్లాలోని వినుకొండలో సెప్టెంబర్ 28, 1895వ సంవత్సరంలో జన్మించారు.

తల్లిదండ్రులు : లింగమాంబ, గుర్రం వీరయ్యగార్లు.

భార్యలు : మొదటి భార్య మేరీ, రెండవభార్య విమలమ్మ.

మరణం : జులై 24, 1971వ సంవత్సరం

**రచనలు :**

జాషువాగారు రమారమి 34 కావ్యాలను రచించారు. అందులో కొన్ని –

**2. ఖండకావ్యాలు**

అనాథ, కొత్తలోకం, స్వప్నకథ, ముసాఫిరులు, గబ్బిలము, నాగార్జునసాగర్, కాందిశీకుడు, సాలీడు, నేతాజీ, గిజిగాడు, బాపూజీ, శిల్పి, స్వయంవరం, స్మశానం, రాష్ట్రపూజ, నెలబాలుడు.

స్వీయచరిత్ర : నాకథ (పద్యరచన 3 భాగాలు)

**3. బిరుదులు - అవార్డులు**

కవికోకిల, కవితావిశారద, మధురశ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్.

1965వ సంవత్సరంలో 'క్రీస్తు చరిత్ర' లఘు కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

గజారోహణం, పౌరసన్మానాలు ఈ కవి దిగ్గజాన్ని మరిన్ని రచనలు చేసేందుకు ప్రోత్సహించాయి. అసలిది తెలుగు సాహితీ కన్యకు జరిగిన సన్మానం. ఈ సన్మానాలు, పురస్కారాలు గుర్రం జాషువా సారస్వత సేవకు గుర్తింపు "కృషితో నాస్తిదుర్భిక్షం" అన్న సూక్తి నిజమైంది.

**4. గుర్రం జాషువాగారి విశిష్ట లక్షణాలు**

1. వేదనా భరిత జీవితానుభవంతో మానవ జీవితాన్ని వ్యాఖ్యానించిన విశిష్ట, విలక్షణ కవి గుర్రం జాషువా గారు.
2. జాషువా మానవతావాది.
3. ఈ మానవతాదృక్పథమే ఆయన కవిత్వానికి జీవగర్ర.
4. సాంఘిక ప్రయోజనం లేని కవిత్వమతనికి ఇబ్బంది, గిట్టదు.
5. ఆయన భావాలలో ఆధునికధోరణి, అభ్యుదయ పోకడ, సామాజిక స్పృహ, సంస్కార ప్రయత్నం కనిపిస్తాయి.
6. కరుణ రసాన్ని అభివ్యక్తీకరించడంలో ఆయన సిద్ధహస్తుడు.
7. జాషువా కవిత్వం ద్రాక్షాపాకం. మృదు మధురమైన శైలిలో కవిత్వం రాసి రసహృదయాలను చూరగొన్నారు.
8. జాషువా గారు సాంఘిక రుగ్మతలను తొలగించడానికి, మానవత్వాన్ని పెంపొందించడానికి, మూఢ విశ్వాసాలను పటాపంచలు చేయడానికి తన కవితను సాధనముగా చేసుకున్నారు.
9. జాతీయాభిమానం, సంఘ సంస్కరణాభిలాష ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.
10. గౌతమ బుద్ధుడు, యేసుక్రీస్తు, మహాత్మాగాంధీజీగార్ల జీవకారుణ్య భావం జాషువాగారిలో కనిపిస్తుంది.

## 5. గబ్బిలము ఖండకావ్య పరిశీలనం

**విషయము :** అరుంధతి పుత్రుని బాష్ప సందేశాన్ని కరుణరస పూరితంగా రచించిన జాషువా హృదయ వేదనకి అక్షర రూపమే గబ్బిలం కావ్యం.

గబ్బిలం కావ్యం ప్రధానంగా వర్ణవ్యవస్థను నిరసించిన అద్భుతకావ్యం.

మహాకవి కాళిదాసు మేఘసందేశాన్ని పోలి గుర్రం జాషువా గారి గబ్బిలం ఉంటుంది. అందుకే మేఘ సందేశం పొగ సందేశం, గబ్బిలం వగ సందేశం. భారతీయ సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, సంప్రదాయ వ్యవస్థను గబ్బిలం కావ్యంతో వివరించి చెప్పినారు.

గబ్బిలంలోని ప్రతి పద్యంలోను జాషువా సాక్షాత్కరిస్తారు. కవిత్వం నుండి కర్మ సిద్ధాంతం వరకూ, వినుకొండ నుండి వెండికొండ వరకూ, నన్నయ నుండి వేమన వరకూ, వివేకానందుని నుండి వీరభోగవసంతరాయల వరకూ వారి హృదయాన్ని స్పందించి మనస్సుకు చికాకు కల్గించిన ఎన్నో విషయాలను రసవత్తరంగా ప్రస్తావించడం వలన గబ్బిలం కావ్యం జాషువా గారి తాత్త్విక చింతనకు మౌలిక గ్రంథం అని చెప్పవచ్చును.

ఈ కావ్యంలో నిజాయితీ, ఆర్తి, ఆవేశం, ఆవేదన, ప్రతిఘటన అనే విశిష్టాంశాలు నిండుగా మెండుగా ఉన్నాయి. ఇవియే జాషువా కవిత్వానికి కచ్చితంగా జీవలక్షణాలని చెప్పవచ్చును.

కందుకూరి వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి ఆశీర్వాదం పొందిన జాషువా తన సాహితీ తపస్సును అణగారిన వర్గాల శ్రేయస్సుకై ఉపయోగించాడు. వారు కోల్పోయిన విలువైన జీవితాన్ని తిరిగి పొందేలా కృషి చేశారు.

మనిషిని మనిషి నుంచి విడదీసే సాధనాలను గర్హించిన గబ్బిలము నరుడిని కష్టపెట్టి నారాయణుని కొలిచే ఆ ధర్మాన్ని తీవ్రంగా ఖండించింది. గాంధీజీ విధానాన్ని పూర్తిగా విశ్వసించిన ఈ విశ్వకవి సమ్రాట్ గబ్బిలము ద్వారా తుకతుక ఉడికే అశ్రు సందేశాన్ని పంపించాడు. గబ్బిలము రచన అంతా అభ్యుదయ మార్గంలోనే నడిచింది.

గబ్బిలము ఖండకావ్యం పూర్వభాగంలో సందేశం పంపటం, ఉత్తర భాగంలో సమాధానం అందుకోవటం ఉంటుంది. నిజానికి సమాజంలోని అసమానతలు మనల్ని ఆలోచించడానికి పురిగొల్పితే అస్పృశ్యతా రాచగురువు సమాజాన్ని ఏవిధంగా పీడిస్తుందో గ్రహిస్తే, మీదే కులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోయినప్పుడు సాటి మనిషికి కలిగే బాధను తెలుసుకోగలిగితే అప్పుడు గబ్బిలం గుర్తుకు వస్తుంది. గుర్రం జాషువా గారి ఆలోచనా విధానం మనకు అర్థమౌతుంది.

జాషువా గబ్బిలము ఒక ఆదర్శం కోసం, ఒక లక్ష్యం కోసం విస్తరించిన భావ పరంపర, సామాజిక జీవితంలోని ప్రతి విభాగాన్ని పరామర్శించి, విమర్శించి, పునర్నిర్మించే ఉన్నతాశయమే జాషువా గబ్బిలం కావ్యానికి ప్రేరకమైనది.

## 6. ముగింపు

నవయుగ కవిచక్రవర్తి అనదగిన గుర్రం జాషువా కవివరేణ్యులు రచించిన గబ్బిలం ఒక గొప్ప అభ్యుదయ కావ్యం.

సామాన్యుడిని మాన్యుడిని చేసి మానవత్వానికి గోపురం కట్టిన గబ్బిలం. సామాజిక జీవితంలోని ప్రతీ విషయాన్ని తడుముతోంది ఈ గబ్బిలం.

గబ్బిలం కన్నీటికథ, జాషువా స్వీయకథలాంటిది. ఈ ఖండకావ్యంలో సామాజిక దురన్యాయాలకు సవర్ణ హిందువుల ద్వేషానికి గురి అయిన ఒక పంచముడే (మాలవాడు) గబ్బిలానికి ప్రతీక. గబ్బిలం ఒక అపశకునపక్షి. ఇది రాత్రి వేళలో మాత్రమే సంచరిస్తుంది. దీన్నే జాషువా కవిగారు సందేశహారిణిగా, వార్తాహారిణిగా తీసుకున్నారు. గబ్బిలం సమాజంలో గల అంటరాని తనాన్ని కైలాసంలోగల శివుడికి విన్నవించుకోవడమే ఇందులోని సారాంశము.

అసమ సమాజం బాకులు గుమ్మినప్పుడు అంటరానితనం విషాగ్నులు చిమ్మినపుడు, దుర్భర దారిద్ర్యం వెన్నాడినప్పుడు, దురంత వేతన గుండెల్లో, తునక తునక ఉడికినప్పుడు జాషువాగారు గుర్తొస్తారు. అతని ఫిరదౌసి గుర్తొస్తుంది. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది.

**– బేగరి మొగులయ్య**

ఎం.ఎ. ప్రథమసంవత్సరం

# ప్రేమతో...

సృష్టిలో ...
పవిత్రమైనది పరిమళసువాసనలను వెదజల్లేది "ప్రేమ"
తెలివైనది వివేకాన్ని వికసింపజేసేది "ప్రేమ"
జ్ఞానిధియై విజ్ఞానాన్ని విరజిమ్మేది "ప్రేమ"
అద్భుతమైనది పంచభూతాలను పరిభ్రమింపజేసేది "ప్రేమ"
అనంతమైనది అంతరిక్షాన్ని సహితము ఆవరించినది "ప్రేమ"
అందమైనది ఆహ్లాదమైన ఆనందాన్నిచ్చేది "ప్రేమ"
జీవమైనదై జీవమును ప్రాణమును పోసేది "ప్రేమ"
మరణంలేనిది మరణము నుండి రక్షించేది "ప్రేమ"
భయపడనిది భయాన్ని పారద్రోలేది "ప్రేమ"
అధైర్యపడనిది అభయాన్ని ధైర్యాన్నిచ్చేది "ప్రేమ"
"ప్రేమ" కపటములేనిది. అమర్యాదగా నడవదు
"ప్రేమ" తప్పులను క్షమించేది, అపకారము తలపెట్టదు
"ప్రేమ" మోసము చేయదు. అబద్ధమాడదు
"ప్రేమ" లాభము ఆశించదు, స్వప్రయోజనముకోరదు.

దరిద్రులపట్ల దయ చూపుతుంది "ప్రేమ"
కష్టాలలో ఉన్నవారిపట్ల కనికరం చూపుతుంది "ప్రేమ"
ఆపదలో ఆర్తనాదము చేసేవారిని ఆదుకొంటుంది "ప్రేమ"
ఏ దిక్కులేని వారిని అక్కున చేర్చుకొంటుంది "ప్రేమ"
అన్నింటి (కష్టనష్టాలను) సహించి ఓర్చుకుంటుంది "ప్రేమ"

అలసిన హృదయానికి ఆదరణను ఇచ్చేది "ప్రేమ"
ఆవేదనతో ఉన్న ఆత్మకు ఆనందాన్ని ఇచ్చేది "ప్రేమ"
మలినమైన మనస్సుకు మనశ్శాంతిని ఇచ్చేది "ప్రేమ"
సొమ్మసిల్లిన శరీరాన్ని సేదతీర్చేది "ప్రేమ"
సృష్టి పుట్టకముందే ఉన్నది ఆ "ప్రేమ"
సృష్టిని సృష్టించి, నడిపిస్తూ ఉన్నది ఆ "ప్రేమ"
మనల్ని సృష్టించి, నడిపిస్తూ ఉన్నది ఆ "ప్రేమ"
పంచప్రాణాలను ప్రతిరోజు మనకిస్తూ ఉన్నది ఆ "ప్రేమ"
ఇంతకీ ఏంటీ ఆ "ప్రేమ"

వాట్ ఈజ్ లవ్?
లవ్ ఈజ్ గాడ్.
ఇంకెంతకాలం!
ప్రేమకు అర్థం తెలియక పయనిద్దాము?
ఈ సృష్టిలో మనము ప్రేమలేనివారమైతే వ్యర్థులము
ప్రేమలేని వారమైతే నిష్ప్రయోజనము.
అందుకే,
ప్రేమను కోరుకుందాము, ప్రేమను (దైవమును) అనుసరిద్దాము
ప్రేమ స్వరూపాలుగా మారుదాము. ప్రపంచాన్ని ప్రేమమయం చేద్దాము.
ప్రేమను చేరుకుందాము.

**– లక్ష్మన్న**

ఎం.ఎస్.సి. (జువాలజీ) ద్వితీయ సంవత్సరం

## యువతీ - యువకులు ఆలోచించండి

యువతీ యువకులు మరీ హీనంగా మారిపోతున్నారు. ఇలా మారిపోవడానికి ఒకే ఒక్క కారణం విదేశీయుల వల్లనే మన యువతీ–యువకులు ఇలాంటి స్థితికి చేరుకున్నారు. ఈ ఘోరమైన ఆచారాన్ని అరికట్టవలసిన అవసరం మన అందరిపైన ఉన్నది. యువతీ యువకుల్లారా చెడు అలవాట్లకు బానిసలు కాకండి. మీ జీవితాన్ని ఆ చెడు అలవాట్లు నాశనం చేస్తాయి. మీ జీవితాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యువతీయువకులు ఈరోజుల్లో అన్నీ కలిగి ఉన్నారు కాని, ఒక మనస్సు మాత్రం కలిగి లేరు. జీవితంలో యువతీ యువకులు మంచివారైతే అభివృద్ధి చెందుతారు. చెడ్డవారైతే చెడిపోతారు. చూశావా నేస్తమా నీ జీవితంలో మంచి స్నేహితులను కలిగిఉండు. లేకపోతే నీ జీవితానికి రూపురేఖలు లేకుండాపోతుంది. యువతీయువకుల్లారా! నాతో స్నేహం చేయాలి అనుకుంటున్నారా, మీకు మనస్సు ఉందో లేదో, ఒక్కసారి ఆలోచించి నాతో స్నేహం చేయండి. ఓ యువతీ యువకుల్లారా మంచి మనస్సు ఉన్నవారు ఎప్పుడైనా విజయం సాధిస్తారు.

**– నీలాల శ్రీనివాసు**

# గొప్పవారి గూర్చి
# గొప్పవారు చెప్పిన గొప్ప సూక్తులు

**శ్రీకృష్ణదేవరాయలు**

సాహితీ సమరాంగణ చక్రవర్తి
కర్ణాటకాంధ్ర సమన్వయ నిత్య స్ఫూర్తి

**సిద్ధేంద్రయోగి**

కూచిపూడి నృత్యరీతికి ఆద్యుడు
తెలుగు నాట్యజగతికి ఆరాధ్యుడు

**పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి**

ఆగామి కాలజ్ఞాన కర్త
పురోగామి సమాజ సంస్కర్త

**రుద్రమదేవి**

కాకతీయ మహాసామ్రాజ్య భారధారణి
శాత్రవ భయంకర నిత్యరుద్ర రూపిణి.

**మొల్ల**

కవితలల్లిన తొలి తెలుగు విదుషీమణి
రామాయణ కావ్యరచనా రసధుని

**బ్రహ్మనాయుడు**

పలనాటిసీమ పండించుకున్న ధర్మవేది
చాపకూటితో సమతను నేర్పిన సౌమ్యవాది

**తానీషా**

గోలకొండనేలిన కుతుబ్‌షాహీ పాదుషా
రామదాసు భక్తికి చలించిన మనీషి.

**రామదాసు**

భద్రాచల రామన్నకు గుడికట్టిన గోపన్న
రామదాసై తెలుగు హృదికెక్కిన భక్తులమిన్న.

**క్షేత్రయ్య**

మువ్వగోపాల పదమోహన గాయకుడు
మధురభక్తి భావరాగ రంజకుడు.

**త్యాగయ్య**

అగ్రేసర దాక్షిణాత్య వాగ్గేయకారుడు
అక్షర నాదోపాసనైక జీవనుడు.

**కందుకూరి వీరేశలింగం**

సంఘసంస్కరణ పండితుడు
బహుముఖ సాహితీప్రక్రియా మండితుడు

**గురజాడ అప్పారావు**

ఆధునికాంధ్ర కవితా వైతాళికుడు
సువిశాల మానవతావాద ప్రతిపాదకుడు

**సీ. ఆర్. రెడ్డి**

ఆధునిక సాహితీ విమర్శకు ఆద్యుడు
విద్యాపరిపాలనా రంగాలలో అనవద్యుడు

**మహబూబ్ ఆలీఖాన్**

అసఫ్ జాహీ వంశ పాలకుడు
ఆర్తజన నిత్య పోషకుడు

**రఘుపతి వెంకట రత్నం నాయుడు**

తెలుగుసీమలో బ్రహ్మ సమాజకులపతి
బ్రహ్మర్షి బిరుద సార్థక విద్యాపతి.

**– పాతకోటి రాజు**
ఎం.ఎ. తెలుగు, ప్రథమసంవత్సరం

# అణగారిన వర్గాలు ఉద్యమించాలి

ఒక్క రక్తపుచుక్క, ఒకలాఠీదెబ్బ, ఒకకేసు, ఒక సావు లేకుండా అంబేద్కర్ సిద్ధాంతం, పూలే ఆలోచన, కాన్షీరాం పని విధానంలోనే తెలంగాణా రాష్ట్రాన్ని సాధిద్దాం.

– పూలే, అంబేద్కర్ ఫలాలను అనుభవిస్తున్న విద్యావంతులైన ఎస్.సి, ఎస్.టి, బి.సి మైనారిటీ సోదరులకు అంబేద్కర్ సిద్ధాంతాలను అంగీకరించే అగ్రవర్ణ మిత్రులకు నేను చెప్పేది ఏమిటంటే తెలంగాణ రాష్ట్ర సాధనకు ఏ అగ్రకుల శక్తులు నాయకత్వం వహిస్తున్నాయో తెలంగాణ రాష్ట్రం ద్వారా విడుదలయ్యే రాజ్యాధికారం ఆ అగ్రకుల శక్తులలోకి పోతుందనేది సత్యం. బ్రిటీష్ వారినుండి స్వాతంత్ర్యం వచ్చినపుడు కూడా అదే జరిగింది. రేపు ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రం వచ్చినా అదే జరుగుతుంది. కాబట్టి ఎస్.సి, ఎస్.టి, బి.సి మైనారిటీలు 80% కలిగిన మనము రాజ్యాధికారాన్ని సాధించి మన సమస్యలను పరిష్కరించుకుని అణచివేతకు గురైన మన చీకటి జీవితాలలో క్రొత్త వెలుగులు నింపుదాం. కాబట్టి మన అందరం కూడా అందుకు ఎంతో కృషి చేయాలి. అగ్రకుల పాలనా పీఠాన్ని కూలగొట్టి అణగారిన వర్గాల విలువైన ఆశయాలతో క్రొత్త రాజ్యాధికారం సృష్టించి పాలించి, అభివృద్ధి చెందుదాం.

సీమాంధ్ర అగ్రవర్ణాలు తెలంగాణని 60సంవత్సరాలుగా దోచుకున్నది నిజమేకానీ ఆ దోచుకున్న నీళ్ళు, నిధులు, వారి అగ్రవర్ణ సమాజానికి పెట్టుకున్నారే తప్ప ఆ సొమ్ముని అణగారిన వర్గాలు మరింత క్రిందికి అణగదొక్కి వారికి చెందవలసిన ప్రత్యేక ప్యాకేజీలు అభివృద్ధి నిధులను పక్కకు మళ్ళించి స్వార్థంతో మరియు దౌర్జన్యంతో అగ్రకుల వర్గాల వారు, వారి బంధువులు అందరూ అభివృద్ధి చెందుతున్నవారే తప్ప అణగారిన వర్గాలను ఏమాత్రం ఆదుకోవటం లేదు. కాబట్టి మనమందరం కలిసి కాంగ్రెస్ ముసుగులో ఉన్న రెడ్లనూ, టిడిపి ముసుగులో ఉన్న కాపులను అదేవిధంగా టి.ఆర్.ఎస్. ముసుగులో ఉన్న మెలకువులను వీరందరూ ఎన్నికలపుడు అణగారిన వర్గాల కాళ్ళు మొక్కి దండం పెట్టి రాజకీయాలలోకి వచ్చి అన్నం పెట్టిన చేతినే నరికిన చందంగా వీరిని ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదు. కాబట్టి మనందరం ఏకమై ఉద్యమించి రాజకీయ ద్రోహుల మెడలను వంచుదాము. దీనికి అందరూ పోరాడాలి. కాబట్టి జిత్తులమారి నక్కలు అయిన ఆ మూడుపార్టీలు అణగారిన వర్గాలను మూగజీవులను చేసి జిత్తులమారి నక్కలవలె మనపై ఆధిపత్యం చెలాయిస్తుంది.

కాబట్టి అంబేద్కర్ అగ్రవర్ణ సమాజంపై 40సంవత్సరాలు పోరాడి తన మహామేధస్సుతో మనకు రాజ్యాంగాన్ని రచించి రిజర్వేషన్లను అందించినందున మనం అనుభవిస్తున్నాము. అంబేద్కర్ అన్నట్లు భవిష్యత్తులో అణగారిన వర్గాలు కూడా రాజ్యాధికారం సాధించాలని కలలుగన్నాడు. కాబట్టి తన కలలుకన్న సమయం ఆసన్నమయ్యింది కాబట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అణగారిన వర్గాలతోనే రాజ్యాధికారం జరపాలని కోరుకుంటు న్నాను.

జై భీంలతో.....

**– కొప్పు రాజు**

బి.ఎ. (పి.ఎస్.ఎం.) ద్వితీయసంవత్సరం

## స్నేహం

స్నేహం అనే సమయంలో నేను ఒక చేపను
గాలం వేసి గాయ్ చేస్తానో
మాయం చేసి మోసం చేస్తావో లేక
నీరులా మారి స్నేహం చేస్తావా నీ ఇష్టం.

## జల చక్రం

విశ్వరమణీయాల వింత జలచక్రం
అవని సుట్టు అల్లుకున్న అందమైన చక్రం
పవనమై నింగిలో పారాడెని ఈ చక్రం
ప్రాణకోటి మనుగడకు మూలం ఈ జలచక్రం
నిరంతరంబు వెలుగుపూలు నేలకు వెదజల్లువాడు
అనంత కాంతి పుంజములలో అలరించే నింగిరేడు
సెలగతేరు సుట్టి భవిని పగలు రాత్రి తిప్పె వాడు
లేడి పరుగులతో వేడి గుర్రములాడించివాడు

ఎవరి మాటల వెనుక ఎంత మోసం ఉంటుందో
మనము తెలుసుకోనంత వరకు మోసపోతూనే ఉంటాం.
కాబట్టి మనం తెలియని వారు
చెప్పే మాటలను వినకపోవడమే మంచిదికానీ
మన శ్రేయోభిరాశులు మాత్రం మన
క్షేమం గురించే మాట్లాడతారు.

## జై తెలంగాణ (గేయం)

పల్లవి : జయ జయమ్ము సోదరా జై తెలంగాణ నీదిరా
సై అంటూ స్వరమెత్తరా స్వాతంత్ర్యం సాధించరా

చరణం : ఆంగ్లేయులతో పోరాటం నాడూ బానిస మరణం
ఆంధ్ర మిత్రుత్వం నయవంచన నర బలిదానం
సమైఖ్యయని అణగదొక్కి మింగొద్దూ మా ప్రాణం
ఇంకెన్నాళ్ళూ...
ఇంకెన్నాళ్ళూ...
ఇంకెన్నాళ్ళీ వైనం శ్రమ దోపిడీ విధానం ॥జయ॥

చరణం : ఓరుగల్లు రుద్రమవై రోషాన్ని భాసురించు
ఓటమినెరుగక ధీటుగ వేటను చవి చూపించు
కాదని బదులిస్తే యమ క్రూరంగా కబళించు
కరీం నగరు కనికవై...
కరీంనగరు నిప్పుకణికవై ఈ దురాక్రమణ దహించు ॥జయ॥

చరణం : నాదని ఎదురొస్తే నువ్వు నరనరాన్ని చీల్చేట్టూ
నవ జీవనాన్ని కాంక్షించు నిజామాబాద్ మీదొట్టూ
నిజమైన పోరు నాదంటూ నిజాయితీని తెల్పేట్టూ
ఆదిలాబాద్ ఎజెండాగా...
ఆదిలాబాద్ ఎజెండాగా పదిజిల్లాల విల్లెక్కుపెట్టు॥జయ॥

చరణం : ఖమ్మం మాదని అంటే కల్కిరూపమయ్యేట్టూ
కాళిక నువ్వై ఇలలో ఖడ్గాన్ని చేతబట్టూ
ఎగబడి పిడిబాకల్లే ఎదుటి వాడి గుండెలదిరేట్టూ
కాలువ నీరే మాకు,
కన్నీరు మీకంటే...
నల్లగొండోద్యమ ఖిల్లావై నయవంచకులను తరిమికొట్టు ॥జయ॥

చరణం : కంపెనీలు మాకంటే క్లర్కూ పోస్టులకు మీరంటే
మరిగే రక్తం తీరు మహబూబ్‌నగరు అని చూపు
పొట్టేలై ఢీకొట్టూ రంగారెడ్డి రణరంగపు
ఉప్పెనలా ఉరుమెరుపై...
ఉప్పెనలా ఉరుమెరుపై మెదకు వాడిని వాడికి చూపు ॥జయ॥

చరణం : ఇకనైనా వదలండీ వలసరాజ్య పాలననూ
చావో రేవో అయినా సజీవ దహనం అయినా
సడలదు మా ఈ పట్టూ సంకెళ్ళను లెక్కించక
హైదరాబాద్ ఇమ్మంటే,
అధికారం మాదంటే....
ఎదురుపడీ తిరగబడే తిత్తితీస్తా భాగమతీ మీదొట్టూ॥జయ॥

– **నర్రా రాజు**, ఎం.ఎ. ప్రథమ సంవత్సరం

## వెలుగుల తెలుగు

తెలుగు కోటి స్వరాల వీణ
తెలుగు పదహారణాల జాణ
తెలుగు అక్షరాలు ముత్యాల మణులు
తెలుగుపదాలు తేనెలూరు గనులు
తెలుగుమాట సంపెంగ పూతోట
తెలుగునుడికారం సొగసుల బాట
తెలుగు సాహిత్యం ఓంకార రవం
తెలుగు భాష పరుగిడు నయగారం
తెలుగుకైతకు నాందిపలికిన నన్నయ
మధురసోయగాలద్దిన తిక్కన, యఱ్ఱయ
జాను తెలుగు జాలు వారించిన నన్నెచోడబల్లి
పాల్కురికి ద్విపదలు సుకుమారుగా అల్లి.
భక్తి అలంకారాల పోతన, శ్రీనాథులు
సాహితీ సమరాంగణ సార్వభౌములు
ప్రబంధాన్ని దౌడు తీయించిన అష్టదిగ్గజాలు
తెలుగు సాహితీ కంఠంలోవెలిగే హారాలు.

– ***బి. సైదులు (కళింగ)***
ఎం.ఎ. తెలుగు, ప్రథమ సంవత్సరం

## తెలుగు భాషా స్వభావం

పరిమళించు పువ్వు
పసిపాప నవ్వు
తల్లి లాలన లాలింపు
తండ్రిపాలన కవ్వింపు
ఆత్మీయత సోయగాల సొంపు
ధారాల స్పష్టతల ఊరడింపు
చెరిగిపోని ఆసక్తి పుట్టించే పదాల కూర్పు
శబ్దాలంకారాల రమ్యతను తొడిగిన గాన సింగారింపు
మరిచిపోని హాయినిగొల్పే పసిడిగాడ్పు
భావాన్ని పరవసాల బాటలో నడిపే సాగనంపు
చదివితే హృదయం హత్తుకునే తలంపు
లాలిత్య రమణీయ మధుర కావ్యాల ఆకళింపు
తొలకరి చినుకుల మట్టి వాసనల గుబాళింపు
ఎందరో కవుల మాగాణిలో విరబూసిన శ్రమైక్య సౌరభం

– **జి. జంగయ్య**
ఎం.ఎ. తెలుగు, ఫైనల్

# భారతంలో విజయ రహస్యం

ఎనభై నాలుగు లక్షల జీవజంతువులలో ఉత్తమమయిన జీవి మానవుడు. ఈ మానవుడు సృష్టిలో దేనినైనా సాధించవచ్చు. అందుకు తగినన్ని శక్తులు అతనిలో ఉన్నాయి. స్వామి వివేకానంద అన్నట్లు “సమస్త శక్తులన్ని నీలోనే ఉన్నాయి మీరు ఏమైనా చేయ వచ్చు. దేనినైనా సాధించవచ్చు”. కాని చాలామంది వారి లక్ష్యాలను ఎందుకు సాధించలేకపోతున్నారు? సాధించటం ఎలా? అనే ప్రశ్నలకు ఒకటే సమాధానం “నిన్ను నీవు జయించు. తర్వాత నీవు దేనినైనా జయించగలవు” అంటారు. అసలు మనలో మనం జయించుకునేవి మనసు, మాట, దేహము. ఈ మూడే మనలను మనిషిగా నిర్ణయించి మంచి పథంలో నడుపుతాయి. వాటిని గురించి భారతంలో తిక్కన చెప్పిన చక్కని పద్యాలను చూద్దాం.

**మనసును వాక్కును గాయం**
**బు నియంత్రితములుగ జేసి పొందుదురు ధనం**
**బునకై ముచ్చులు, దానిం**
**కనుగొనగ వలదే మోక్ష కాంక్షికి వత్సా.**

*శాంతి. ప. 4-313*

ఈ పద్యాన్ని భీష్ముడు ధర్మరాజు సందేహానికి సమాధానం చెప్తూ, దొంగ తనది కానిదానిని పొందాలనుకున్నప్పుడు ఆ ధనంకోసం మనసును, మాటను, చేష్టను కట్టిపడవేసి వాటిని పొందుతాడు. మరి మన లక్ష్యం మీద కోరిక కలవారు దీనిని పరిశీలించవద్దా?

దొంగతనంచేసి పాపం మూటకట్టుకున్నవాడు. అట్టివాడు కూడా ధనం కోసం ఎంత నిష్టగ ఉంటాడు. లోలోపల మనసు వద్దని చెప్తున్నా దానిని చంపుకుని, తలపెట్టిన కార్యం ముగించే వరకు మాటను మాన్పించి, దేహాన్ని ఎక్కడైన అణిగి కూర్చోడానికి, మణిగి పడుకోడానికి, లంఘించి దూకటానికయినా సిద్ధపడుతాడు. ధనం అంటే రాకడలో, నిలకడలో, పోకడలో దుఃఖాన్ని నింపేదే. అయినా అదేదో ఉద్ధరిస్తుందని ఆశతో అటువంటి తుచ్ఛమైన దానికోసం, ఆ స్వభావం కలవారు 3 కరణాలను కట్టివేసి అదుపులో పెట్టుకుంటే, ఒక ఉన్నత లక్ష్యం కోసం ప్రయత్నించేవారు ఇంకెంత పట్టుకలిగి ఉండాలి?

ముఖ్యంగా విద్యను ఆర్జించే సమయంలో వయసు పొంగుతూ పోటీపడుతుంది. మోక్షాన్ని కాంక్షించే సమయంలో వయసు వంగుతూ లొంగదీస్తుంది. ఎప్పుడు విరుద్ధంగానే ప్రవర్తించటానికి ప్రయత్నిస్తుంది. దేహం మనసును, మాటను తోడుగా పెట్టుకోవాలి. కానీ వాటిని మన చేతుల్లో ఉంచుకోవాలి.

**తేరు శరీరము దానికి**
**సారథి సత్వంబు తురగచయ మింద్రియముల్**
**దారుణ తరబుద్ధి వ్యా**
**పారము లొనరంగ గనప పగ్గములధిపా!**

*(స్త్రీ. ప. 1-57)*

పై పద్యాన్ని విదురుడు ధృతరాష్ట్రునకు చెప్తూ రాజా! ఈ శరీరం ఒక బండి. దానికి సారథి మనస్సు. ఇంద్రియాలు గుర్రాలు. మిక్కిలి కఠినంగా ఉండే బుద్ధిచేసే పనులు గట్టి పగ్గాలు. దేహమనే రథం. మన యాత్రకు సంబంధించిన సాధనం. బయలుదేరే చోటు, గమ్యస్థానం మనకు తెలిస్తే దానికి కావలసిన మార్గశుద్ధి, సాధనం స్పష్టంగా ఉండాలి. మార్గమధ్యంలో ఎటువంటి ఆటంకాలు ఏర్పడకూడదు. అందుకు పైసాధనాలు ఉపకరిస్తాయి. అప్పుడే యాత్ర సఫలమవుతుంది.

రథం అన్నాడు అంటే నీవు వేరు నీ శరీరం వేరు అనే భావాన్ని ముందుగా పొందాలి. అయితే ఈ బండిని నడిపేవాడు ఎవరు అంటే మనసు. దానినే సత్వము అని కూడా అంటారు. మనసనేది ఉందనుకోవటమే కాని దాన్ని కొలచి ఇది దాని స్వరూపం అని చెప్పరాదు. అందుకే దాన్ని సూక్ష్మం అంటారు. సూక్ష్మం అంటే ఎత్తు, లావు, బరువు మొదలగునవి లేనిదని అర్థం. ఏమీ లేనట్టి ఈ మనసు అన్నీ అధికంగా ఉన్న దేహాన్ని తన ఇష్టం వచ్చిన చోటికి లాగుకొని పోతుంది. మనసు బలం ముందు, దేహం బలం చాలా తక్కువ. సారథి సమర్థుడైతే యాత్రచేసేవాడు క్షేమంగా గమ్యాన్ని చేరుకుంటాడు. కాని సారథి అయోగ్యుడైతే గమ్యాన్ని చేరుకోకుండా నాశనం అయిపోతాడు. అందువల్ల సారథి మన ఆధీనంలో ఉండాలి. మనం సారథి ఆధీనంలో ఉండకూడదు. అసలు మనసు అంటే వచ్చిపోయే ఆలోచనల పుట్ట. అది ఈ దేహం అనే బండిని నడుపుతుంది.

ఈ దేహమనే రథానికి కట్టిన గుర్రాలు చెవి, చర్మము, కన్ను, ముక్కు అనే ఇంద్రియాలు. ఇవి విషయాలయిన శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే వాటికోసం తిరుగుతూ ఉంటాయి. గుర్రాలను అదుపులో పెట్టుకుని లక్ష్యంవైపు తిప్పటానికి బుద్ధి వ్యాపారాలనే పగ్గాలుంటాయి. బుద్ధి అంటే వచ్చేపోయే ఆలోచనలను

ఒక కొలిక్కి తెచ్చి కార్యాన్ని నిశ్చయం చేసే స్థితి. అది చేయించే పనులన్ని వ్యాపారాలు. వాటిని 'గనప' (గట్టి) పగ్గాలుగా నిరూపించారు. వాటిని వదిలించుకోవటం అంత తేలికైన పనికాదని భావం.

దేహం ఇంద్రియాలను బుద్ధివ్యాపారాలతో ముడిపెట్టి మనసును ఏవిధంగా నడుపుతుందో తెలుస్తుంది. అయితే ఇందులో ప్రయాణించే జీవుడు అవశుడయితే అధోగతి, మన వశంలో ఉంటే ఉత్తమ గతి కలుగుతుంది. ఆ ఉత్తమగతి విజయం.

మనస్సును, ఇంద్రియాలను, కోరికలను జయించకుండా ఉండటానికి కారణాలు

**పనివడి పూచి పట్టమి, సుబంధుర ధైర్యము నిర్వహింతునే**
**నను మతిసొన్పకుండుట, సమగ్రతపంబున తత్ఫలేచ్ఛ లే**
**కునికి, విమోక్ష తృష్ణభర మొందమి కామునడంచుగాన యి**
**య్యసువులు లేమి నుప్పె యనుపాయతగా నతడాడె భూవరా!**

*(అశ్వ - 1-132)*

పని కట్టుకుని పట్టుదల పట్టకపోవడం, నేను ఏ కొంచెము కూడ సడలనని ధైర్యాన్ని నిర్వహించగలననుకోవటం, లక్ష్యం మీద ఆశ, బరువును ఎత్తుకోకపోవటం అనేవి దురాలోచనను అణచివేస్తాయి. కాబట్టి ఈ పద్ధతులు లేకపోవటమే ఉపాయం లేకపోవటం.

మనం అనుకున్న దానిని అదేపనిగా పెట్టుకుని సాధించటానికి పూనుకోవటం, చేసే పనిలో ఫలాపేక్ష లేకుండా చేయటం మొదలయినవి మనను ఇబ్బంది పెట్టే విషయాలను జయించే మార్గాలు.

ప్రతి విజయం వెనుక ఒక నిగూఢమైన వ్యక్తి ఉంటాడు. అతడే గురువు. వారి జ్ఞాన దృష్టితో, అనుభవ సారంతో సాధనకు మార్గం చూపుతారు. అది కాంక్షించే వారిని రక్షించి తీర్చిదిద్దాలనే వారి కోరిక.

**రక్షింప దలచు వాడే**
**శిక్షించు భయంబుజెప్పి చేయించు పనుల్**
**రక్షింప దలచకుండిన**
**శిక్షింపదుపేక్ష చేసి చెప్పదేదియున్**

ఎంతటి వారికైన మార్గదర్శకుడు అవసరమే. వారు ఏదో ఒక రూపంగా మేల్కొల్పుతారు. వారి దృష్టిలో కొంతమంది జీవితాల్లో వెలుగును నింపటమే వారు ఆశించే కర్మఫలితం. దీనినే విష్ణువు నారదునికి ఈవిధంగా చెప్పాడు.

**జ్ఞానము కేవల కృప న**
**జ్ఞానికి నుపదేశవిధి బ్రకాశము సేయం**
**గానిది సకల ధరిత్రీ**
**దానంబున కంటె నధికతరఫలమగున్**

*- శాంతి 4-255*

కేవలం కృపతో జ్ఞానమును, దానికోసం జిజ్ఞాస గల వారికి ఉపదేశ పూర్వకంగా బోధించి హృదయంలో వెలుగొందే విధంగా మొత్తం భూమినంతటిని దానం చేసిన దాని కంటె ఎక్కువ ఫలాన్ని కలిగించేది అవుతుంది అన్నంతగా వారి సంతోషం అందుకే. ఒకరి సూచన ద్వారా మొదట స్వాధ్యాయిగా మారితే తర్వాత విజయం మన బానిస అవుతుంది.

**- అట్టెం దత్తయ్య**
ఎం.ఎ. తెలుగు, ద్వితీయ సంవత్సరం

## నా చదువు - నా చావు

నేను చదువుకొన్న మొనగాన్నా...?
అందుకే అడిగింది నా పిచ్చితల్లి....
ఇకనైనా నన్ను కష్టపెట్టకురా కొడకా అని...!
అందుకే అడిగింది నా అక్క....
నా కూతుళ్ళను సాత్తవారా తమ్ముడా అని...!
అందుకే అన్నడు నా అన్నయ్య ప్రేమతో....!
తమ్ముడా నా వళ్ళ కాదురా నీ ఫీజుల బరువు అని....!
అందుకే మా అయ్య అడిగిండు....!
నీకు ఉద్యోగం నాకు చావు ఒకేసారి అని...
చూశారా నా చదువు
నాకే బరువై నన్ను పిచ్చివాన్ని చేసింది.
చూశారా నా చదువు....!
నావాళ్ళ ఆశలన్ని చంపింది
అందుకే నా చదువు - నా చావుకొచ్చింది.
ఇది నా ఆకలి చావు కాదురా
నాలుగున్నర కోట్ల తెలంగాణ బిడ్డల ఆకలి కేక.

**- బి. రాజన్న**
ఎం.ఎ. ద్వితీయసంవత్సరం

# ఆధునిక యుగ కవితా వైతాళికుడు - గురజాడ

ఎన్నో శతాబ్దాలు గడిచినప్పటికీ ఎప్పటికప్పుడు కొత్తపుంతలతో షడ్రసోపేత కవితా విందును పంచిపెడుతూ సాహితీ రేఖలను నలు దిక్కులకు విరజిమ్మే తెలుగు భాషా సాహిత్యంలో రెండుసార్లు పెనువిపత్తులు వచ్చాయి. ఇంచుమించు వెయ్యేళ్ళ క్రితం నన్నయ కాలం (11వ శతాబ్దం)లో వచ్చిన మార్పు తర్వాత 18వ శతాబ్దపు ఉత్తరభాగంలో గురజాడ కాలంలో రెండో మార్పు వచ్చింది.

నన్నయకాలంలో తెలుగు భాషా వికాసానికి పునాది పడింది. సరళ, ప్రౌఢ, గ్రాంథికాలతో, వ్యాకరణాలతో అనేక గ్రంథాలు, కావ్యాలు రావడానికి మార్గం ఏర్పడింది. అయితే ఈ కావ్యాలన్నింటికీ మూలం ఏదో ఇతిహాసంనుంచో, పురాణం నుంచో చిన్న కథను ఎంచుకుని వర్ణనాత్మక రచనా శైలితో కావ్యంగా మలిచేవారు. ఆ ప్రవాహం కృష్ణరాయలకాలంలో ప్రబంధ రచనలకు దారి తీసింది. కాని ఈ రచనలు పండితులను మాత్రమే రంజింపజేశాయి. కాని ఆనాటి జనపదానికి ఏమాత్రం అంతుచిక్కలేదు అనుట గమనార్హం. రమారమి (18వశతాబ్దం) గురజాడ కాలం వరకు ఆ సాహిత్యపు పోకడలు, అటువంటి రచనలే తెలుగు సాహిత్యాన్ని శాసిస్తూ వచ్చాయి.

తెలుగు సాహిత్యంలో నవ నవ్య కవితకు నాంది పలికింది ఎవరూ అనే వాదనలు కొంతకాలం సాగాయి. సి.నా.రె. గారు రచించిన "ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయాలు, ప్రయోగములు" లో శ్రీశ్రీని యుగకర్తగా పేర్కొన్నారు. వేగుంట మోహన్ ప్రసాద్ గారు శ్రీశ్రీని నవ్య పితామహునిగా ఉద్ఘాటించారు. కాని శ్రీశ్రీ లెక్కకు మించినన్ని సార్లు నవ్యకవిత్వ అడుగుజాడ గురజాడ అని, అనేక విధాలైన సాహితీ బాటలు వేసింది గురజాడ అయినా తాను దానిని కొద్దిగా వెడల్పు చేశాననీ గురజాడ ఆధిపత్యాన్ని పేర్కొన్నాడు శ్రీశ్రీ.

### కవితాజాడ - గురజాడ

గురజాడ వెంకట అప్పారావు తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామంనుండి వైజాగ్‌కు తరలివచ్చారు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌశలమ్మ. 1862 సెప్టెంబర్ 21న గురజాడ జన్మించాడు. గురజాడ ఇంగ్లీష్ ఆంగ్లంలో రాసిన "సారంగధర" అనే పద్యకావ్యం 1883లో ప్రచురింపబడింది.



గురజాడ అంటే కన్యాశుల్కం గుర్తొస్తుంది. దానిలో గిరీశం, మధురవాణి తదితర పాత్రల ద్వారా నాటి సమాజంలోని దురాచారాలను మూఢ విశ్వాసాలను దారుణంగా ఖండించాడు. ముఖ్యంగా నాటి సమాజంలో విలయతాండవం చేస్తున్న "కన్యా శుల్కం" కోరలు పీకడానికి ఈ నాటకాన్ని రచించాడు. ఈ నాటకం ప్రాచుర్యం అవుతున్న కొద్దీ ఈ దురాచారం పట్ల సమాజంలో కొంత మార్పు వచ్చిందని మనకు అవగతమవుతున్నది. చక్కని రచనా శైలితోపాటు, కొంత గ్రాంథికం, సరళగ్రాంథికమైన రచనా విధానంతో ఈ నవలికను అత్యంత హృద్యంగా భావార్థాలతో నిండుకుండలా పూరించాడు. తెలుగు ప్రేక్షకులు ఏనాటికీ మరచి పోలేని నాటకం 'కన్యాశుల్కం'.

గురజాడ కవితా అడుగుజాడకు నిదర్శనపుటద్దం వచన సాహిత్యంలోని ప్రయోగం అయిన దిద్దుబాటు. ఇది మొట్టమొదట కథానిక. కథానికకు ఉండవలసిన లక్షణాలు కొలతలు అన్నీ దిద్దుబాటుకున్నాయి. సరళ రచనాంశంతో భావానికి పెద్దపీట వేస్తూ ఈ కథానిక సాగుతుంది. ఇందులో పాత్రల చిత్రణ అత్యంత మనోహరంగా ఉంది. 'దిద్దుబాటు' మరెన్నో కథానికలకు అంకురార్పణ చేసింది.

అటు పండితులను, ఇటు పామరులను ఇరు వర్గాలను తన రచనా శైలితో మెప్పించగలిగాడు గురజాడ. అతి సరళమైన వచనా కవిత్వంతో మాత్రా సరళములు అనే ఛందస్సును ప్రవేశపెట్టి జనపదుల నాలుకలపై మిగిలిపోయే సరళమైన రచనలు చేసాడు గురజాడ.

గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల,
కొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా (ముత్యాలసరాలు)

సరళమైన పదం నిండైన అర్థం గురజాడ కవితకు వైశిష్ట్యం.

తగటు బంగరు చీరకట్టి
కురుల పువ్వుల సరులు బెట్టి
నుదుట కుంకుమ బొట్టు పెట్టి
సొంపు వెంపారన్ (కన్యక)

అక్షర సొంపు అర్థపెంపుతో కవితా 'కన్యక'ను పెంచి పోషించాడు.

తన కవితల ద్వారానే ఆనాటి ప్రజాధిపతులు సామాన్య జనంపై నిరంకుశత్వాన్ని విమర్శనాత్మకంగా వివరించి చెప్పాడు.

నిండు కొలువున లవణుడను రా
జుండె జోలికి డొకడు దరి జని,
"దండి నృపః వొక గండు గారడి కలదు కను" మనియెన్

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాల నే అగుదున్ (లవణరాజు కల)

గురజాడ పొదుపైన పదాలతోటి నిండైన అర్థాన్ని ఇచ్చే వాక్య నిర్మాణం చేయడం అతని శైలి. 'లవణరాజు కల'లో ఆనాటి కుల వ్యవస్థను కఠినంగా దుయ్యపట్టాడు. "మంచియన్నది మాలయైతే మాల నే యగుదున్" అంటూ కులవ్యవస్థపై ధ్వజమెత్తాడు. సరళ సాహిత్యంతోటి సంఘంలోని మంచి చెడ్డలను తన రచనల ద్వారా ఎత్తి చూపాడు.

మేలిమి బంగరు నెలతల్లారా
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లులగన్నా పిల్లల్లారా
విన్నారమ్మా యీ కథను (పూర్ణమ్మ)

నలుగురు కూచుని నవ్వే వేళల
నా పేరొక తరి తలవండి
మీ మీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి (పూర్ణమ్మ)

ఎంతో సున్నితమైన భావంతో గురజాడ ఆవిష్కరించిన ఈ కవిత తరువాత ఎంతో మంది కవులకు ఆదర్శం అయింది. జనావళి నాలుకలపై నిత్యం ఉదహరించే పదాలతో అర్థవంతంగా అర్థాన్ని అలంకరించడం గురజాడ శైలి. కన్యకలో ఆనాటి దురాచారమైన బాల్య వివాహాలను తన కవితల ద్వారా కఠినంగా తిరస్కరించాడు. ఇప్పటికీ ఎప్పటికైనా ప్రతి ఒక్క తెలుగువాడి నాడిలో వినిపించే గేయం గురజాడ 'దేశభక్తి'.

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్
సొంత లాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్ ॥దేశమంటే॥

ఆనాటి స్వతంత్ర సమరంలో 'నేనుసైతం' అంటూ దేశభక్తి కవితల ద్వారా ప్రజలలో చైతన్య జ్వాలను రగిల్చాడు గురజాడ.

నూగు మీసపు కట్టు
కొనకానిబొట్టు
నోటున సిగరెట్టు
కోటు వింత కుట్టు
చేగ ఒలుగు వెండికట్టు
నీలగిరి కొలను గట్టు
పైన విహరించు వైష్ణవ బొట్టు...

అంటూ అంత్య ప్రాసను అందంగా తీర్చి దిద్ది సాహితీ కొత్త పోకడలను కూర్చిన గురజాడ నవయుగ వైతాళికుడు!

– ఎం.గీత, జె.నాగమణి, జె.స్వాతి
ఎం.ఏ., తెలుగు ప్రథమ సం॥